వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక పత్రిక

ఏప్రిల్ 2007 69 రు. 10

- ఫోకస్ : 2007-08 కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు
  మూడు వ్యాసాలు
- పత్రికారంగం - పతనమవుతున్న విలువలు
- జి డి పి పెరుగుదల - ఆర్థికాభివృద్ధి
- నందిగ్రామ్ కాల్పులపై నిజనిర్ధారణ
- ఉన్నత విద్య పై రెండు వ్యాసాలు
- పరిశోధన అవసరమైన మీడియా

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక పత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

69 ఏప్రిల్ 2007


వార్షిక చందా: రు.120 విడి ప్రతి : రు. 10

సంపాదకీయం

తేడాలేదని చూపిన నందిగ్రామ్

నందిగ్రామ్ దారుణ మారణకాండ జరిగి రెండు వారాలు గడిచిపోయాయి. మార్చ్ 14న ఆ ప్రాంతంలోని కొన్ని గ్రామాలపై పోలీసు బలగాలు, సిపిఐ (ఎం) కార్యకర్తలు కలిసి దాడి జరిపారని, ఆ దాడిలో కనీసం పద్నాలుగు మంది మరణించారని, దాదాపు అరవై మంది జాడ ఇంకా తెలియడం లేదని, వందలాది మంది క్షతగాత్రులయ్యారని ఇప్పటివరకూ అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. స్త్రీల మీద అత్యాచారాల గురించి, మృతదేహాలను మాయం చెయ్యడం గురించి, గృహదహనాలను గురించి, ఆస్తి విధ్వంసాన్ని గురించి రోజురోజూ కొత్త విషయాలు బైటపడుతున్నాయి. అక్కడ జరిగిన దారుణాల గురించి తృణమూల్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, ఎన్‌డిఎ పక్షాలు చేస్తున్న ప్రచారం అబద్ధాల మయమని పాలక సిపిఐ (ఎం) చేస్తున్న వాదనను అంగీకరించినా, కేంద్ర నేర పరిశోధక శాఖ నుంచి మహాశ్వేతాదేవి, మేధాపాట్కర్‌లతో సహా ఎందరో స్వతంత్ర మేధావులు, నిజనిర్ధారణ బృందాల వరకూ అవే దారుణాల గురించి అవే మాటల్లో చెపుతున్నారు. సిపిఐ (ఎం) ఒక్కటే నిజాలు చెపుతూ ఇంతమంది అబద్ధాలు చెప్పే స్థితి ఉండదు. పైగా సిపిఐ (ఎం)కు అక్కడ అధికార ప్రయోజనాలున్నాయి గనుక, కాల్పులు జరిపిన పోలీసుల మాటలు, సిపిఐ (ఎం) మాటలు ఒకే రకంగా ఉన్నాయి గనుక వారి మాటలనే అనుమానించవలసి వస్తుంది. నందిగ్రామ్‌లో ప్రత్యేక ఆర్థిక మండలం ఏర్పాటు జరుగుతుందా లేదా, అక్కడి ప్రజలకు అది మేలు చేస్తుందా లేదా, అది పారిశ్రామికీకరణ ప్రయత్నమా భూ ఆక్రమణ ప్రయత్నమా, ప్రజలు అంగీకరిస్తున్నారా లేదా అనే ప్రశ్నలన్నీ చర్చనీయాంశాలే కావచ్చు. చర్చా క్రమంలో వాస్తవం నిగ్గుతేలవచ్చు. కాని ఆ చర్చకన్న ముఖ్యమైన విషయం తనను తాను వామ పక్షమనీ, మార్క్సిస్టుననీ భావించుకుంటున్న ప్రభుత్వం ప్రజల నిరసన పట్ల ఎట్లా ప్రతిస్పందిస్తుందనేది. ఒక కాంగ్రెస్ ప్రభుత్వమో, భాజపా ప్రభుత్వమో, తెలుగుదేశం ప్రభుత్వమో ప్రజల నిరసనను కాల్పులతో అణచదలచుకుంటాయి. ప్రజలు దౌర్జన్యం చేసినందువల్ల అనివార్యంగా పోలీసులు కాల్పులు జరపవలసి వచ్చిందని సమర్థించుకుంటాయి. బషీర్‌బాగ్‌లోనూ గంగవరంలోనూ జరిగిందదే. కాని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకత్వంలోని వామపక్ష కూటమి ప్రభుత్వం కూడ సరిగ్గా అదే విధంగా ప్రజల నిరసన ప్రదర్శన మీద కాల్పులు జరిపి, ఆ ప్రజల దౌర్జన్యాన్ని ఆపడంలో అనివార్యంగా కాల్పులు జరిపామని అంటున్నదంటే ఆ పార్టీల ప్రభుత్వానికీ వామపక్ష ప్రభుత్వానికీ తేడా ఉన్నట్టా లేనట్టా? ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోపల వామపక్ష ప్రభుత్వం ఏదో సోషలిజం సాధించి పెడుతుందనే భ్రమలు ఎవరికీ లేవు, కనీసం ప్రజల హక్కులను గౌరవించడంలో విభిన్నంగా ఉంటానని అయినా చూపకపోతే ఎట్లా? ♦

లోపలి పేజీల్లో...



2007-08 కేంద్ర రాష్ట్ర బడ్జెట్లు

అసలు అంకెల్లో పెరుగుదలను ప్రజాజీవితంలో అభివృద్ధిగా చూడవచ్చునా అనే ప్రశ్న ఎట్లాగూ ఉంటుంది. దేశంలో ఒక పిడికెడు మంది ఆదాయాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగినందువల్ల జాతీయాదాయంలో పెరుగుదల కనబడవచ్చు. దానితో కోట్లాది పేద ప్రజానీకానికి ఎటువంటి సంబంధం ఉండకపోవచ్చు. ఆర్థికమంత్రి అనుకూలాంశాలుగా ప్రకటించిన ప్రతి అంకెతోనూ ఆ సమస్య ఉంది. ఇక ప్రతికూలాంశాలుగా చెప్పిన వ్యవసాయం పెరుగుదల రేటు తగ్గిపోవడం, ద్రవ్యోల్బణం అనేది కూడ అంకెలలో మాత్రమే చూడకుండా ప్రజాజీవితంలో అవి వేసే ప్రభావం వైపు నుంచి చూడవలసి ఉంటుంది. వ్యవసాయంలో వెనుకబాటుతనానికి ఒక సూచికగా వ్యవసాయరంగంలో విపరీతంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోతున్నదనడానికి సూచికగా ధరల పెరుగుదల ప్రజాజీవితాన్ని అల్లకల్లోలం చేస్తోంది.

ఫోకస్ : 2007-08 కేంద్ర రాష్ట్ర బడ్జెట్లు

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక పత్రిక

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040 - 66843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

సహాయ సంపాదకులు : డి.వి.రామకృష్ణారావు
సర్క్యులేషన్ మేనేజర్ : వై. రామచంద్రం
9949391028
కంపోజింగ్ & లే ఔట్ : సి. రాజశేఖర్

పాఠకుల వీక్షణం

గత కొంతకాలంగా 'వీక్షణం' రెగ్యులర్‌గా చదువుతున్నాను. పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే పత్రిక ఆసాంతం విజ్ఞాన ఖని అనడం అతిశయోక్తి కాదనేది నా అభిప్రాయం.

'వీక్షణంలో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమయిన అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. వీక్షణంను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్ని రకాల అభిప్రాయాలను, భిన్నాభిప్రాయాలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది' అనే అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను.

సంపాదక వర్గం భావిస్తోంది అనే బదులు అమలు పర్చుతాం అని సరిచేయవలసిన అవసరం ఉంది. ఈ పత్రిక చదవటం అలవాటు చేసుకొన్న గత ఆరునెలలుగా నేను గమనించిందేమిటంటే మైనారిటీ మతతత్వానికి, మెజారిటీ మతతత్వానికి సమాన దూరం పాటించడం అనే సెక్యులర్ భావనను మరచి కేవలం మైనారిటీ వాదాన్ని బలపరిచే రచనలకు ఇచ్చినంత ప్రాధాన్యత మెజారిటీ వాదానికి సంబంధించిన రచనలకు ఇవ్వకపోవడం. ఇలాంటి ఒంటెద్దు పోకడలతో మెజార్టీలకు తప్పుడు సంకేతాలు రచనల ద్వారా అందించే పత్రికల సరసన వీక్షణం చేరటానికి ఉవ్విళ్లూరుతుందా అనే అనుమానం కొత్త పాఠకులకు రాకుండా చూసుకోవలసిన గురుతరమైన బాధ్యత సంపాదక వర్గంపై ఉంది.

– జూల ముత్తెన్న
మెదక్

రాష్ట్రంలో జైళ్లలో మగ్గుతున్న వారిలో ఎక్కువమంది నిరుపేద కుటుంబాలనుంచి వచ్చినవారే నన్న సంగతి జగమెరిగిన సత్యం. క్షణికావేశంలో పెద్ద, చిన్న నేరాలు చేసిన ఖైదీల భార్య, బిడ్డలు, ముసలి తల్లిదండ్రులు, జీవనోపాధిలేక, సమాజంలో ఆదరణ లేక ఆకలితో అలమటిస్తున్నారు. అనారోగ్యంపాలై అకాల మృత్యువాతపడుతున్నారు. వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. వారి పిల్లలైతే సరైన విద్యకు నోచుకోలేక బాలకార్మికులుగా, బాలనేరస్తులుగా మారి గత్యంతరం లేని దుస్థితికి గురి అవుతున్నారు.

సత్ప్రవర్తన కల్గిన జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించే ఉద్దేశ్యంతో శిక్షాకాలాన్ని సమీక్షించే పద్ధతి భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉంది. క్షమాభిక్ష అనేది ఖైదీల సత్ప్రవర్తనకు సమాజం తరపున ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం. ఖైదీలను సకాలంలో విడుదల చేయకపోవడం వలన అనేక సామాజిక ఇబ్బందులు ఉత్పన్నమవుతాయని న్యాయకోవిదులు, మేధావులు, సమాజ సంక్షేమ నిపుణులు సూచించడం జరిగింది.

దీర్ఘకాలంగా రాష్ట్రంలోని వివిధ కారాగారాలలో మగ్గుతున్న జీవిత ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలను, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, అన్ని ప్రజా సంఘాలు, మేధావులు, రచయితలు, సంపాదకులు, పత్రికా ప్రతినిధులు, మీడియా వారు, సమాజ సంక్షేమ దయార్థ్రహృదయుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ వారు స్పందించి ఎట్టకేలకు సత్ప్రవర్తన కల్గిన ఖైదీల విడుదలకు సంబంధించి 2006 డిసెంబర్ 16న జి.ఒ. ఎంఎస్. నెం. 314, 315లను జారి చేసారు. తరువాత జరిగిన కొన్ని పరిణామాల ప్రభావం వలన, తిరిగి ప్రభుత్వం వారు జి.ఒ. ఎంఎస్. నెం. 12 ద్వారాపై జి.ఒ లను నిలుపుదల చేయడంతో 2007 జనవరి 26న విడుదలవుతామని ఎంతో ఆశగా విడుదల కొరకు ఎదురుచూస్తున్న ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు, బంధువులందరూ, తీవ్రమనో వేదనకు, గురై మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.

ఈ ఏడాది జనవరి 26న విడుదల అవ్వాల్సిన ఖైదీల విడుదల ప్రక్రియను అపివేస్తూ, అఖిల పక్షాల అభిప్రాయాలను తెలుసుకొని త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని హోంశాఖ మంత్రి జనవరి 18న ప్రకటించారు. తరువాత ఇంతవరకు ఆ ఊసే ఎత్తడంలేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఖైదీల కుటుంబాలు అన్ని రాజకీయపక్షాలను కలిసి వినతి పత్రాలు ఇచ్చాయి. భారత కమ్యూనిస్టు పార్టీ చొరవతో అఖిల పక్ష సమావేశం ఫిబ్రవరి 2న జరిగింది. అందులో ప్రభుత్వం వారు ఖైదీల విడుదల కొరకు జారీ చేసిన జి.ఒ. ఎంఎస్. నెం. 314, 315 ప్రకారం అర్హులైన ఖైదీలందరిని విడుదల చేయాలని ఏకగ్రీవంగా అంగీకరించారు. అదే విషయాన్ని ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రిని కలిసి అఖిలపక్షం స్పష్టం చేసింది. హోం మంత్రితో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి ఫిబ్రవరి 13న ప్రకటించారు.

నోరున్న వర్గాల మద్దతు సంపాదించలేక పోతున్న ఖైదీల సామాజిక పరిస్థితి, సకాలంలో విడుదలకు నోచుకోలేక మానసిక క్షోభను అనుభవిస్తున్న ఖైదీలు వారి కుటుంబసభ్యుల ఆవేదనను, మానవతా దృక్పథంతో ఆలకించి, మన్నించి, అఖిలపక్షం వారు ఏకగ్రీవంగా అంగీకరించి, ఖైదీల విడుదల కొరకు ప్రభుత్వం వారు జారీ చేసిన జి.ఒ. ఎంఎస్. నెం. 314, 315లను యథాతథంగా వెంటనే అమలు జరపాలి. ఖైదీల విడుదల కొరకు ప్రభుత్వం వారు, న్యాయనిపుణులు, అన్ని రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు, మేధావులు, రచయితలు, పత్రికా ప్రతినిధులు, మీడియా వారు, జైలు అధికారులు సహకరించి ఖైదీల విడుదల కొరకు న్యాయం చేయమని అందరి వేడుకుంటున్నాం.


– జీవిత ఖైదీలు
సెంట్రల్ జైల్, కడప


అనంతపురం జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికి పైగా చేనేత రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఒకటిన్నర లక్షల మందికి పైగా మగ్గాలు నేస్తున్నారు. షెడ్ చేనేత కూలీలు ఇరవై ఎనిమిది వేలకు పైగా, ఇంటిలోనే ఉండి కూలీ మగ్గం నేస్తున్న వారు 48,762 మంది ఉన్నారు. మాస్టర్ వీవర్స్ వద్ద అప్పు తీసుకోని చీరలు తయారు చేసేవారు 53,000 మంది మిగతావారు. వాళ్లు ముడిసరకులు స్వంతపెట్టుబడితో కొని స్వంత వ్యాపారం చేసబ్తు ఉన్నారు. అలాగే చేనేత అనుబంధ పనులైన కండెలు చుట్టువారు అంచులు అతుకువారు. జరీ, డోలు చుట్టువారు, రౌషం, వార్పు ముడి సరుకులు అద్దకందార్లు,


(మిగతా 12 పేజీలో)


కొత్తపుస్తకాలు















- **చెలికాడు** - కవిత్వం - పిన్నిక శ్రీనివాస్ - విరసం ప్రచురణ, 46 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : పాణి, 12/92, పద్మావతీ నగర్, కర్నూలు, అన్ని పుస్తకాల షాపులలో
- **అఫ్జల్ జీవనయానం - అర్ధాంతరంగా ముగియవలసిందేనా?** - ఆంగ్లం అరుంధతిరాయ్ - తెలుగు అనువాదం పి. సుబ్బారావు, మానవ హక్కుల వేదిక, నల్లగొండ జిల్లా శాఖ ప్రచురణ, 24 పేజీలు, 1/8 డెమీ - ఉచితం
- **మహాసామ్రాజ్య - మరణవేదన - ఇదీ నేటి అమెరికా** - డి. పాపారావు - చైతన్య పబ్లికేషన్స్, 96 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: డి. పాపారావు, ఎ-89, జర్నలిస్టు కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.
- **కట్టెల మోపు** - కవితా సంకలనం - కత్తి పద్మారావు - లోకాయుక్త ప్రచురణలు, 245 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి, లుంబినీవనం, అంబేడ్కర్ కాలనీ, పొన్నూరు - 522 124. గుంటూరు జిల్లా. అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **జైలు డైరీల సాక్షిగా - క్రాంతిదర్శి భగత్‌సింగ్** - ఎన్‌వైఎస్ - పిడిఎస్‌ఒ సంయత ప్రచురణ, 44 పేజీలు, 1/8 డెమీ, రు. 5, ప్రతులకు: మైత్రీ బుక్‌హౌస్, మసీదు వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002.
- **ఆశయాల పందిరి** - నల్లెల్ల రాజయ్య, వరంగల్ రచయితల సంఘం ప్రచురణ, 38 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : నల్లెల్ల రాజయ్య, కన్వీనర్, వరంగల్ రచయితల సంఘం, హన్మకొండ.
- **షహీద్ సద్దాం హుస్సేన్ కీ యాద్‌మే** - దీర్ఘ కవిత - పరవస్తు లోకేశ్వర్ - గాంధీ ప్రచురణ, 16 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: గాంధీ ప్రచురణలు - నెం. 8, ఇ.నెం. 12-2-709/5/1/సి/1, నవోదయ కాలనీ, మెహదీపట్నం, హైదరాబాద్.
- **ఛానళ్ళ విస్తృతి సీరియళ్ళ వికృతి** - నాగసూరి వేణుగోపాల్ - ఆకాష్ పబ్లికేషన్స్, 220 పేజీలు - 1/8 డెమీ. రు. 75, ప్రతులకు : ఆకాష్ పబ్లికేషన్స్, జి-14, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సామర్లకోట - 533 440.
- **ఆనవాలు** - సాహిత్య వ్యాసాలు - ఎ. రాజాహుస్సేన్ - చుక్కా రామయ్య విద్యాపీఠం ప్రచురణ, 196 పేజీలు, 1/8 డెమీ, రు. 90, ప్రతులకు - జూలూరు గౌరిశంకర్, జర్నలిస్టు, సంపాదకుడు, 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్, అన్ని పుస్తకాల షాపుల్లో
- **మన్నెం గుండెల్లో బాక్సైట్ బండలు** - లయ, జి.ఎస్.ఆర్.డి. సొసైటీ ప్రచురణ, 84 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : లయ, ఫ్లాట్ నెం. 501, కురుపం కాసిల్, ఈస్ట్ పాయింట్ కాలనీ, విశాఖపట్నం - 530 017. జి.ఎస్.ఆర్.డి. సొసైటీ, గుమ్మలక్ష్మీపురం, విజయనగరం జిల్లా.











నందిగ్రామ్ కాల్పులపై నిజ నిర్ధారణ నివేదిక

- మేధాపాట్కర్ బృందం

నందిగ్రామ్ దారుణ మారణకాండ గురించి మార్చ్ 14 మధ్యాహ్నానికల్లా పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన టెలిఫోన్ వల్ల తెలిసింది. అప్పటికి కాల్పులు ఇంకా జరుగుతున్నాయని, పదుల సంఖ్యలో ప్రజలు మరణించారని, వందల సంఖ్యలో గాయపడ్డారని తెలిసింది. మాలో కొందరం వెంటనే భారత ప్రధానమంత్రికీ, సోనియాగాంధీకీ, ప్రణబ్‌ముఖర్జీకీ, శివరాజ్‌పాటిల్‌కీ, పశ్చిమబెంగాల్ గవర్నర్‌తో సహా మరి కొందరికి మా ఆందోళన తెలియజేసాం. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా ఒక లేఖ రాశాం. దాన్నే ఆ హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. ఆ తరువాత కూడా నందిగ్రామ్‌లో జరిగిన దురంతాలు, ప్రభుత్వ ప్రోత్సాహంతో జరిగిన భయానక సంఘటనలు మా దృష్టికి వస్తూనే ఉన్నాయి.

దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి కలకత్తాకు చేరుకున్న మేము, బాధిత ప్రాంతాలకు పయనం అయ్యాం. ప్రభుత్వం, సిపిఎం ఒక పక్కన, రైతులు, మత్స్యకారులు, కూలీలు, వృత్తిదారులు తదితర ప్రజా సమూహాలన్నీ మరొకపక్కన ఉండి సాగుతున్న ఘర్షణ గురించి, పోరాటాల గురించి మేం అప్పటికే విని ఉన్నాం. బెంగాల్‌లో పనిచేస్తున్న కార్యకర్తల సహాయంతో మేము ఆయా గ్రామాల ప్రజలను, గాయపడి ఆస్పత్రుల్లో ఉన్నవారిని ఎంతో మందిని కలుసుకున్నాం. సరిగ్గా మార్చ్ 14న, ఆ తరువాత నందిగ్రామ్‌లో కచ్చితంగా ఏం జరిగిందో తెలుసుకోవడానికి అవసరమైన సమాచారమంతా సేకరించడానికి ప్రయత్నించాం. మా బృందంలోని సభ్యులలో మేధాపాట్కర్ (నర్మదా బచావో ఆందోళన్, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్), డి. తంగప్పన్ (న్యూ ట్రేడ్ యూనియన్ ఇనిషియేటివ్), డా. బి.డి. శర్మ (భారత జన ఆందోళన్), త్రిదేవ్ ఘోష్ (పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా), జి.ఎన్. సాయిబాబా (అంటీ డిస్‌ప్లేస్‌మెంట్ ఫ్రంట్ సన్నాహక కమిటీ) అరుణ్ ఖోటే (నేషనల్ క్యాంపేఫర్ దళిత్ హ్యూమన్ రైట్స్), రాకేష్ రఫీఖ్, (యువ భారత్), రామ్ ధీరజ్ (ఆజాదీ బచావో ఆందోళన్), శ్రీమంత్ (కళింగనగర్ ఉద్యమం), మెహెర్ ఇంజనీర్ (శాస్త్రవేత్త, విద్యావేత్త) ఉన్నారు.

మా బృందం నందిగ్రామ్ ప్రాంతంలో అనేక గ్రామాలను సందర్శించింది. కలకత్తాలో పి.జి. ఆస్పత్రిని, నందిగ్రామ్, తమ్లుక్ ఆస్పత్రులను సందర్శించింది. తూర్పు మిద్నాపూర్ జిల్లా మెజిస్ట్రేట్‌ను, కలెక్టర్‌ను కలిసింది. వివిధ రాజకీయ ప్రజా సంస్థలతో మాట్లాడింది. బాధిత ప్రాంతాలలో అనేకమంది గ్రామస్తులతో సవివరమైన ఇంటర్వ్యూలు జరిపింది. బాధితులతోనూ, వారి బంధువులతోనూ మాట్లాడింది.

బృందంలోని కొందరు సభ్యులు నందిగ్రామ్‌లో జనవరిలో జరిగిన ఘటనలను కూడా పరిశీలించారు. అందువల్ల ప్రస్తుత స్థితిలో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయని బృందం గుర్తించింది.

గోకుల్‌నగర్, ఖంగాబేరా, సోనాచుర, అధికారిపార, మహేష్‌పూర్, హాజారకంతా మొదలైన గ్రామాలను మా బృందం సందర్శించినప్పుడు నందిగ్రామ్ ఘటనకు సంబంధించి ఎన్నో వాస్తవాలు తెలియవచ్చాయి.

1. గోకుల్‌నగర్, సోనాచురాలలో జరిగిన సంఘటనల గురించి ప్రజలందరూ, వారిలో ఎక్కువ భాగం స్త్రీలు, ఏకకంఠంతో ఎన్నో రోజులనుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు తమను బెదిరిస్తున్నారని చెప్పారు. పాఠశాలల పరీక్షలు అయిపోగానే ఈ దాడి జరుగుతుందని అనుకున్నామని కాని కొంత ముందే జరిగిందని వారు అన్నారు.

2. రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి పి.ఆర్. రాయ్ నందిగ్రామ్‌లోకి ప్రభుత్వం బలవంతంగానైనా ప్రవేశించి తన చట్టబద్ధ పాలనను నిలబెడుతుందని బహిరంగంగానే అన్నారని మాకు తెలిసింది. శాంతిభద్రతల శాఖ ఇనస్పెక్టర్ జనరల్ ఇటువంటి ప్రకటనే చేశారు. అందువల్ల ప్రభుత్వ నిర్బంధకాండ గురించి పశ్చిమబెంగాల్ అంతటా సంఘటనకు రెండు రోజుల ముందునుంచే ప్రచారంలో ఉంది. ఈ ప్రకటనల మీద నందిగ్రామ్‌లో నిరసనలు కూడా వ్యక్తమయ్యాయి.

3. ఈ ప్రాంతంలో కెజూరి, తెకాలి అని సిపిఎం కేంద్రాలైన రెండు గ్రామాలు ఉన్నాయి. పోలీసులు కెజూరి నుంచి సోనాచుర మీదికి, తెకాలి నుంచి గోకుల్‌నగర్ మీదికి దాడికి వచ్చారు. ఈ రెండు గ్రామాల మీదికి రావడానికి మూడు మార్గాలు ఉన్నాయి. గర్‌చక్రభేరియా, ఖంగాబేరా, 7 జలపాయి అనే ఈ మూడు మార్గాలనుంచి పోలీసులు దాడికి వచ్చారు. పోలీసులు సోనాచుర, గోకుల్‌నగర్‌లలోకి ప్రవేశించే సమయానికి ప్రజలు పూజలోనో, ఖురాన్ పఠనంలోనో ఉన్నారు. అప్పటికి అక్కడ మహాప్రభు గౌరంగదేవ్ ఉత్సవాలు జరుగుతున్నాయి. పోలీసులు గ్రామం మీద దాడి చేస్తారనే హెచ్చరికలను ఖండిస్తున్నప్పటికీ, దేవుడే తమను కాపాడుతాడని ప్రజలు మత ఉత్సవాల్లో మునిగి ఉన్నారు. పోలీసుల రాక తెలియగానే స్త్రీలను, పిల్లలను ముందు పెట్టి అలా చేస్తే పోలీసులు దాడి చేయరని భావించారు. ఇదంతా చూస్తే ప్రజలు శాంతియుతంగా నిరసన తెల్పుతున్నారని, అవాంఛనీయ సంఘటన ఏదీ జరిగి ఉండేది కాదని అనిపిస్తుంది. ఈ రెండు చోట్ల ఉన్న ప్రజలపై పోలీసులు కాల్పులు జరపవలసిన అవసరమే లేదు.

4. ముందు ఉన్న స్త్రీలు తమ చేతులు ఊపుతూ తమ మీద దాడి చేయవద్దని అరిచారు. తాము పూజలు నిర్వహించుకుంటున్నామని, పోలీసులు అందులో జోక్యం చేసుకోవద్దని, తమ గ్రామాల్లో ప్రవేశించవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

5. అది జరుగుతుండగానే ప్రజలకు ఏ హెచ్చరిక చేయకుండా, వ్యవధి ఇవ్వకుండా పోలీసులు బాష్పవాయు గోళాలు, రబ్బరు బుల్లెట్లు పేల్చారు. దానితో ఆ ప్రదేశమంతా పొగలు కమ్ముకున్నాయని ప్రజలు మాకు చెప్పారు. ఆ పొగలలోనే పది నిమిషాల లోపలే ఏమి జరుగుతున్నదో ప్రజలు గుర్తించే లోపుగానే పోలీసులు కాల్పులు

ప్రారంభించారు. చాలా ఎక్కువగా నడుము పై భాగాననే కాల్చారు. ప్రత్యేకంగా స్త్రీలను గురిపెట్టి కాల్చారు. పరుగెత్తి పారిపోతున్న వారిని కూడా గురిపెట్టి కాల్చారు. రెండు చోట్ల కూడా తొక్కిసలాట, గందరగోళం జరిగాయి. భంగాబేరాలో పోలీసులు గ్రామస్తుల వెంటబడి తరుముతూ, కాలుస్తూ వారిని రెండు కిలోమీటర్ల దూరంలోని సోనాచుర గ్రామం దాకా వెంటాడారు.

6. మొదట జరిగిన కాల్పులు, ప్రజలను చంపడం సరిపోనట్టు ఆ తరువాత ఇరవైనాలుగు గంటల వరకు కూడా ఆ గ్రామాలలో పోలీసులు కాల్పులు జరుపుతూనే వచ్చారు. బయటి వారు ఆ గ్రామంలోకి, కాల్పులు జరిగిన ప్రదేశాలలోకి ప్రవేశించకుండా చక్రబంధం చేశారు. ఆ సమయంలో గ్రామాలలో పెద్ద ఎత్తున లూటీలు, గృహదహనాలు, ఆస్తులదహనాలు, స్త్రీల మీద అత్యాచారాలు జరిగాయని స్థానికులు మాకు చెప్పారు. పోలీసులు, సిపిఎం కార్యకర్తలు ఇళ్లలోకి చొరబడి స్థానికులను నిర్దాక్షిణ్యంగా కొట్టారని, స్త్రీలను ఇళ్లలోనుంచి బయటకు లాగి రేప్ చేశారని, అవమానించారని స్థానికులు మాకు చెప్పారు. గ్రామస్తుల మీద ఈ దాడికి రాష్ట్ర ప్రభుత్వం, మిద్నాపూర్ పోలీసులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారని వార్తలు వచ్చాయి. ప్రజల కథనాలు కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ఉదాహరణకు సంఘటన జరగడానికి కొద్ది రోజుల ముందే మిద్నాపూర్ పోలీస్ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం నుంచి నలభై వేల తూటాలు, నలభై అంబులెన్స్‌లు కావాలని కోరింది. దీన్ని బట్టి గ్రాస్తుల మీద దాడి అన్ని ఏర్పాట్లతోనూ పద్ధతి ప్రకారం జరిగిందని, కాని ఈ దుర్మార్గాన్ని ఎదిరించడానికి ప్రజలు సన్నద్ధంగా లేరని తేటతెల్లమవుతుంది.

8. గ్రామస్తులు చెప్పిన కథనం ప్రకారం సిపిఎం కార్యకర్తలు పక్కన ఉండి ఎవరి మీద దాడి చెయ్యాలో చెప్తుండగా పోలీసులు కాల్పులు జరిపారు. బయటి గ్రామాల నుంచి సమీకరించిన ఈ సిపిఎం కార్యకర్తలు ఖాకీ యూనిఫారాలు వేసుకున్నారని, కాని చెప్పులు తొడుక్కున్నారని గుర్తించారు. ఆ యూనిఫారాలు కూడా చాలా మందికి సరిపోయేలా లేవని, వారు తమ మణికట్టులకు ఎర్ర రిబ్బన్లు కూడా కట్టుకున్నారని గోకుల్‌నగర్‌లోని అధికారిపరాలో స్త్రీలు చెప్పారు. ఖాకీ దుస్తుల్లో ఉన్న, పోలీసులు కాని ఈ వ్యక్తులను గ్రామస్తులు వాహిని కార్యకర్తలు లేదా హర్మద్ వాహిని కార్యకర్తలు అని సంబోధించారు. సోనాచుర, టెకాలి బజార్, గోకుల్‌నగర్ పంచాయత్ గ్రామాలలోని ప్రజలు మాతో ఈ హర్మద్ వాహిని కార్యకర్తలు కెజూరి వైపునుంచి వందలాదిగా తమ గ్రామాల మీద దాడి చేశారని చెప్పారు. ఈ హర్మద్ వాహిని కార్యకర్తలు గ్రామస్తుల మీద నాటు ఆయుధాలతోనూ, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆయుధాలతోనూ నిర్విచక్షణగా కాల్పులు జరిపారు. బాధితులకు తగిలిన తూటాలను బట్టి ఆ తూటాలు పోలీసులు వాడేవి కాదని కూడా ఆస్పత్రి అధికారులు మాకు చెప్పారు.

9. సోనాచుర గ్రామంలో రామకృష్ణ సరళ్ కిండర్‌గార్టెన్ విద్యాలయంలో చదువుతున్న 35 మంది పిల్లల జాడ తెలియలేదని గ్రామస్తులు మాకు చెప్పారు. ఇప్పటికీ వారి ఆచూకీ తెలియదు. ఇతర గ్రామాలనుంచి కూడా పిల్లలు తప్పిపోయిన సమాచారం ఉంది. తమ పిల్లల్ని చంపేసి ఉంటారని, శవాలను మాయం చేసి ఉంటారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మనుషులను చంపడం, మృతదేహాలను మాయం చేయడం ఈ హర్మద్ వాహినికి అలవాటేనని గ్రామస్తులు చెప్పారు. గ్రామ శివార్లలోని పొదల్లో ఇద్దరు స్కూల్ యూనిఫారాలు దొరికాయని కూడా వారు చెప్పారు. పిల్లలను రెండు కాళ్లు చెరొక వైపు లాగి చంపిన ఉదంతం కూడా ఉందని వారన్నారు.

10. గ్రామాలలోకి పోలీసులు అధికారులు రాకుండా నిరోధించడం కోసం గ్రామస్తులు అంతకు ముందు తవ్విపెట్టిన కందకాలలో సిపిఎం కార్యకర్తల సహాయంతో పోలీసులు మృతదేహాలను పూడ్చిపెట్టారని సోనాచుర గ్రామస్తులు ఏడుస్తూ పదే పదే చెప్పారు. ఈ మాట నిజమే అయితే ఆ కందకాలను తిరిగి తవ్వించే ఏర్పాటు చేసి అక్కడ మృతదేహాలు ఉన్నాయో లేదో చూడాలి. కొన్ని మృతదేహాలను ట్రక్కులో వేసుకొనిపోయారని కూడ గ్రామస్తులు చెప్పారు.

11. ఇంకా దుర్మార్గమైన విషయం ఏమంటే కొందరు గ్రామస్తులు గాయపడిన వారికి సహాయం చేయడానికి ప్రయత్నించినపుడు వారిని కూడా పోలీసులు విపరీతంగా కొట్టారు. సహాయం అందించడానికి వచ్చిన అంబులెన్స్‌లను కూడా ఆపివేశారు.

12. ఆ ప్రాంతంలో ఇప్పటికీ పెద్ద సంఖ్యలో పోలీసులు ఉండడం గ్రామస్తులకు ఆందోళన కలిగిస్తోంది. ఎందువల్లనంటే పోలీసులు సిపిఎం గుండాలకు రక్షణ కల్పిస్తున్నారు. సహాయం అందిస్తున్నారు. పోలీసుల ఉనికివల్ల పిల్లలు పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారు, స్త్రీలు మార్కెట్‌కు పోలేకపోతున్నారు. ఆ ప్రాంతంలోని పాఠశాలలన్నీ ఇప్పటికీ మూతపడే ఉన్నాయి. పోలీసులు గ్రామాలలోని ఇళ్లమీద దాడి చేస్తూనే ఉన్నారు.

13. సోనాచురలో మా బృందం ఉన్నప్పుడే ముగ్గురు వ్యక్తులను ఎత్తుకుపోయారని వార్త వచ్చింది. ఆ బాధితుల కుటుంబాలు పెద్ద ఎత్తున శోకాలుపెడుతూ పోలీసులను తిట్టడం ప్రారంభించారు. ఇతర గ్రామస్తులు, మా బృందం సభ్యులు వారిని శాంతింప చేయవలసి వచ్చింది.

14. మార్చ్ 16న పోలీసులు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, అవాంఛనీయ సంఘటనల నుంచి తప్పించుకునేందుకు తాము పారిపోవలసి వచ్చిందని గోకుల్‌నగర్‌లోని స్త్రీలు మాకు చెప్పారు.

15. పోలీసుల చేత అత్యాచారానికి, అవమానానికి గురైన స్త్రీలను మేము ఆస్పత్రుల్లో కలిశాం. వారి ఒంటి మీద గాయాలు ఉన్నాయి. వారు మానసిక ఆందోళనలో ఉన్నారు. కానీ వారికి చికిత్స చేయడానికి, సాంత్వననివ్వడానికి మహిళా డాక్టర్లు లేరు. అత్యాచారం జరిగిందని రుజువుచేసే పరీక్షలు కూడా ఇంతవరకు జరపలేదు.

16. పిల్లాపాపలనుంచి ముసలిముతకా వరకు ఎంతోమంది గాయపడిన వ్యక్తులు ఆస్పత్రుల్లో చేరలేక ఇంకా గ్రామాల్లోనే ఉన్నారు. పొరుగు గ్రామాలనుంచి సిపిఎం కార్యకర్తలు తమ మీద మళ్లీ దాడి చేస్తారేమోనని భయపడుతున్నారు.

17. నిరక్షరాస్యత వల్ల తమంతట తాము పోలీసు కేసులు పెట్టకుండా ఉన్నామని, బైటనుంచి వచ్చే సహాయం అందకుండా సిపిఎం అడ్డుకుంటోందని ప్రజలు చెప్పారు.

18. వందలాది కుటుంబాలు, ప్రత్యేకించి రోజు కూలీలు, రోజుల తరబడి తమకు ఉపాధి దొరకడం లేదని, టెకాలి మార్కెట్‌కు వెళ్లి కూలి

చేసుకోకుండా సిపిఎం గుండాలు అడ్డుకుంటున్నారని మాతో చెప్పారు. ఎన్నో కుటుంబాలు మా బృందం పర్యటించడానికి రెండు రోజులు ముందు నుంచి ఇళ్లలో పొయ్యి రాజెయ్యకుండా ఉన్నారు. కొన్ని వారాలుగా వాళ్లకు కంటి మీద కునుకు కూడా లేదు.

19. ప్రజలందరు ముఖ్యంగా స్త్రీలు బాధతో, ఆందోళనతో శోకాలు పెడుతూ మూకుమ్మడిగా చెప్పిన మాట ఏమంటే ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా బుద్ధదేవ్ భట్టాచార్యనే ఈ ప్రాంతంలో పిల్లలను, స్త్రీలను ఉద్దేశపూర్వకంగా హత్య చేయించినందుకు బాధ్యుడిగా గుర్తించాలని, శిక్షించాలని. ధనుంజయ్ వంటి ఒక పేద యువకుడు రేప్, హత్య నేరాలపైన ఉరిశిక్షకు గురైనప్పుడు, నందిగ్రామ్ మారణకాండ బాధ్యులకు కూడా అదే శిక్ష పడాలని వారన్నారు. ఎన్నో కుటుంబాలు మృత్యువును, విధ్వంసాన్ని ఎదుర్కొన్న తరువాత కూడా, ఈ ప్రాంతంలో

20. ఎన్నో ప్రజా సమూహాలు చిందరవందర అయినప్పటికీ కూడ తమ భూమిని, వనరులను మరెవరో ఆక్రమించుకోవడానికి అనుమతించబోమనే సంకల్పం ఏకగ్రీవంగా, దృఢంగా ఉంది. ఈ ప్రాంతంలో భూసేకరణ జరపబోమని లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ప్రభుత్వ ఎత్తుగడల పట్ల ప్రజలకు అనుమానం ఉంది. తమలో తమకు చీలికలు లేకుండా పోరాటాన్ని కొనసాగిస్తామని చెపుతున్నారు.

ఈ నేపథ్యంలో మేం ఈ కింది డిమాండ్‌లు చేస్తున్నాం

1. నందిగ్రామ్ ప్రాంత గ్రామాలలో జరిగిన కాల్పుల ఘటన, ఇతర అత్యాచారాలు అన్నింటిపైన ఒక సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేత న్యాయవిచారణ జరిపించాలి. ఈ దుర్మార్గ ఘటనకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బాధ్యులైన నేరస్తులందరినీ శిక్షించాలి.
2. ఈ ప్రాంతంలోని బాధిత గ్రామాలన్నింటిలో జాడ తెలియని వ్యక్తులందరి గురించి తక్షణం పరిశోధన జరిపించాలి. అవసరమైతే ఒక స్వతంత్ర సంస్థ చేత ఇంటింటి సర్వే జరిపించాలి. భంగాబేరా కాలువ సమీపంలో మృతదేహాలను పాతిపెట్టి ఉంటారని ప్రజలు అనుమానిస్తున్న కందకాలను తవ్వించాలి.
3. పోలీసు బలగాలన్నింటిని తక్షణమే ఉపసంహరించాలి. దశలవారీ ఉపసంహరణ కూడకాదు. సిపిఎం కార్యకర్తలు బెదిరింపులకు అణచివేతకు, దాడులకు పాల్పడకుండా చూడాలి.
4. ఇండోనేషియాకు చెందిన సలీం గ్రూప్‌కు అప్పగించిన నందిగ్రామ్ ప్రత్యేక ఆర్థిక మండలం, రసాయన కర్మాగారాల ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నామని స్పష్టమైన, లిఖితపూర్వకమైన, అధికారికమైన ప్రకటన వెలువడాలి.
5. దేశవ్యాప్తంగా అన్ని ప్రత్యేక ఆర్థిక మండలాల ప్రతిపాదనలను, అసలు ప్రత్యేక ఆర్థిక మండలాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలి.
6. నందిగ్రామ్ ప్రాంతంలోని గ్రామాలలో ప్రశాంత పరిస్థితిని పునరుద్ధరించేందుకు ప్రముఖ ప్రజాస్వామిక వాదులతో ఒక పౌరవేదికను రూపొందించాలి.
7. మృతుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలి. గాయపడిన వారందరికీ తగిన చికిత్సకు అవకాశం కల్పించాలి. సరైన వైద్య సౌకర్యాలకోసం వారిని కలకత్తా ఆస్పత్రులకు తరలించాలి.
8. బాధితులందరి వైద్య చికిత్స సమాచార పత్రాలను పరిరక్షించి ఒక స్వతంత్ర, తటస్థ సంస్థకు అప్పగించాలి. ♦

పత్రికారంగం - పతనమవుతున్న విలువలు

- వి. హనుమంతరావు

మార్గదర్శి ఫైనాన్షియర్స్, ఈనాడు పత్రిక, పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించే జిఓ – ఈ మూడూ ముఖ్యమంత్రి వై.ఎస్.ను అత్యంత వివాదస్పదునిగా చేశాయి. ఆ మాటకు వస్తే జలయజ్ఞం, రింగ్‌రోడ్, అసైన్డ్ భూముల పంపకం లాంటి వివాదాల్లో ఇప్పటికే చిక్కుకుని ఉండగా, గోరుచుట్టు మీద రోకటి పోటులాగా పై మూడు విషయాలు అదనంగా వచ్చి చేరాయి. ఎప్పుడు ఎలా వైఎస్‌ను గద్దె నుంచి దింపేసి తానే మళ్లా ముఖ్యమంత్రిని అవుదామా అని అవకాశం కోసం ఎదురు చూస్తున్న చంద్రబాబుకు వెతకబోయిన తీగ కాలికి తగిలిందన్నట్లు ఈ తాజా సమస్యలు చక్కటి అవకాశమిచ్చాయి. అటు ఈనాడు, మార్గదర్శి సంస్థల అధినేత రామోజీరావు, ఇటు చంద్రబాబు అఖిల భారత వేదిక మీదకు ఈ సమస్యలను ప్రవేశపెట్టి నానా యాగీ చేస్తున్నారు. తన తొమ్మిది సంవత్సరాల పాలనలో చంద్రబాబేమీ తక్కువ వివాదాస్పదుడు కాకపోలేదు. ఆయన పరిపాలన ఎంతగా ప్రజల్లో జుగుప్స కలిగించిందో 2004 ఎన్నికలే రుజువు చేసాయి. ఇప్పుడేమో ఆయన నిష్కాగరిష్టుడైనట్లు, నిష్కల్మష హృదయుడైనట్లు, ఎటువంటి అవకతవకలకు పాల్పడని వాడైనట్లు, వైఎస్సే అత్యంత జుగుప్సాకరమైన పనులకు దిగజారినట్లు చిత్రించటం ఉభయుల పాలనను అనుభవించిన ప్రజలే తమ మనస్సులోనే తీర్పు చెప్పుకుంటారు. ఈ ఉపోద్ఘాతంతో ప్రస్తుత వివాదాస్పదమైన మూడు విషయాలకు వద్దాం.

ద్రౌపదీ వస్త్రాపహరణంలా పత్రికా స్వాతంత్రాపహరణానికి ఒడిగట్టిన వైఎస్ ప్రభుత్వం హిమాలయపర్వతం అంత తప్పు చేసిందనటంలో సందేహం లేదు. తీవ్రమైన ఖండనార్హమైనదే. అసలే ఈనాడు–మార్గదర్శి సంవాదం హాట్‌హాట్‌గా సాగుతూ, వైఎస్ విమర్శల తుఫానుకు గురవుతున్న సమయంలోనే ఈ జిఓ జారీ చేయటం ఒక పెద్ద బ్లండర్. సంవత్సరం పొడవునా రాష్ట్ర సెక్రటేరియట్‌లో పనిచేసే యాభై శాఖలు జిఓలు జారీ చేస్తూనే ఉంటాయి. అవన్నీ చంద్రబాబుగాని వైఎస్‌గాని చూడరు, చదవరు. ఆ పని ముఖ్యమంత్రి కార్యాలయం చేయాలి. లేదా పత్రికల్లో లీకయితే, దాని మీద అలజడి ప్రారంభమైతే ముఖ్యమంత్రి దృష్టికి వస్తుంది. ఇప్పుడదే జరిగింది. ఆఘమేఘాల మీద ఉపసంహరించటం జరిగింది. కాని కొంత మంది మేధావులు ముఖ్యమంత్రి పచ్చజండా చూపించకుండా జిఓ విడుదలవుతుందా అని ప్రశ్నిస్తున్నారు. 'వైఎస్ ఇప్పటికే ఈనాడు పత్రిక రాతల మీద అగ్గి మీద గుగ్గిలమై పోతున్నాడు. అందుచేత ఆ పత్రిక మీదనే నేరుగా చర్య తీసుకొంటే అనవసరమైన రభస అవుతుందని, అందుచేత జనరల్‌గా ఒక జిఓ విడుదల చేయమని ఆదేశించారు'ని ఆయన మనసులోదూరి చూచిన కొంత మంది రాజకీయులు, పాత్రికేయులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిరోజూ పని కట్టుకొని ప్రభుత్వంలో జరిగే అన్ని అవకతవకలకు వైఎస్సే వ్యక్తిగతంగా బాధ్యుడని, ఆయనకు తెలిసే ఇవన్నీ జరుగుతున్నాయని రాస్తుంటే చీమూ నెత్తురున్న వాడెవడైనా స్పందిస్తాడు; రక్తం ఉడుకెత్తుతుంది. పీకల దాకా కోపం వస్తుంది. కాని ఈనాడు మీద ఎటువంటి చర్యా తీసుకోలేదే? పరువు నష్టం దావాలు వెయ్యలేదే? తాను నేరుగా గోదాలోకి దిగకుండా, పరోక్షంగా కోర్టుకెక్కలేదే? నేనేమీ వైఎస్‌ను సమర్థించడం లేదు.

ఆయన సారథ్యంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను తూర్పారబట్టాల్సిందే. పరిపాలనా పరిధిలో జరిగే అవకతవకన్నింటి గురించి ఈనాడు పత్రిక ఎన్నో కథనాలు ప్రచురిస్తోంది; ప్రచురించాలి కూడా. ముఖ్యమంత్రిగా ఆ పాపాలన్నీ ఆయన మోయాల్సిందే. కాని ఈ పాపాలన్నింటికీ ఆయనే వ్యక్తిగతంగా బాధ్యుడనే విధంగా చిత్రించడమే వివాదానికి మూలం. అలా విమర్శించే ఈనాడు పత్రిక మీద నేరుగా చర్య తీసుకొంటే కంపు కంపవుతుందని, ఆ సంస్థ గ్రూపులో భాగమైన మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాడికి దిగారని ఆరోపణ. చంద్రబాబును భుజాన వేసుకొని వైఎస్ మీద ఈనాడు యుద్ధాన్ని ప్రకటించినప్పుడు, దానిని రాజకీయం చేసినప్పుడు యుద్ధ తంత్రాలన్నీ అమల్లోకి వస్తాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య మాజినో, సీజ్‌ఫ్రిడ్‌ల మధ్య ఇలాంటిదేదో జరిగినట్లు గుర్తు. ఇలాంటివన్నీ ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాల్లో సర్వసాధారణం. అది రాజకీయ యుద్ధం కావచ్చు, సాయుధ పోరాటం కావచ్చు. మావోయిస్టులు అడవుల్లో ఫలానాచోట ఉన్నారని ఇన్ఫార్మర్ల ద్వారా తెలుసుకొన్న పోలీసులు నేరుగా వారితో తలపడకుండా విస్తృత వలయాకారంలో నాలుగు వైపులనుంచి చుట్టుముట్టి, దాడి చేసిన ఎత్తుగడ గురించి పత్రికల్లో చదివాం. ఎవ్రీథింగ్ ఇజ్ ఫేయిర్ ఇన్ వార్ అండ్ పాలిటిక్స్. చంద్రబాబు, వైఎస్ ప్రభుత్వ, ప్రతిపక్ష స్థానాల్లో ఉన్నప్పుడు ఈనాడు ఒకరి పక్షాన కొమ్ముకాసి ఉంటే అందుకు తగిన ప్రతిఫలం అనుభవించాల్సిందే.

తప్పుడు రాతలు రాస్తున్నదనే ఆరోపణకు గురవుతున్నది ఈనాడు పత్రిక. కాని ప్రభుత్వం చర్య తీసుకొన్నది ఆ గ్రూపుకు చెందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పైన. ఇలా చేయటం వైఎస్ రామోజీరావుపైన కక్ష తీర్చుకోవటానికి తీసిన దొంగ దెబ్బ అనేది వైఎస్ పై ఆరోపణ. రామోజీ ఎలాంటి చట్టవిరుద్ధ చర్యకు పాల్పడ్డారో, ఇంతకుముందు హైదరాబాద్ నగరంలోని అనేక అర్బన్ సహకార బ్యాంకులు కూడా అదే తప్పు చేసినా వారి మీద ఎందుకు చర్య తీసుకోకుండా మర్గదర్శి ఫైనాన్షియర్స్ మీదే ఎందుకు తీసుకున్నారు? వైఎస్ తన చేతులకు బురద అంటకుండా తన లక్ష్యాన్ని సాధించుకొంటున్నారనేది వారి వాదన. ఈ వాదనలు పైకి లాజికల్‌గానే కనపడతాయి. వైఎస్ ఫైనాన్షియర్స్ మీద చర్య తీసుకోకుండా తన మీద ప్రతిరోజూ వ్యక్తిగతంగా అభియోగాలు మోపుతూ వచ్చిన ఈనాడు మీదే నేరుగా చర్య తీసుకొన్నాడని అనుకొందాం. అప్పుడీ విమర్శకులే 'చూశారా? వైఎస్ పత్రికా స్వాతంత్ర్యం మీద దెబ్బ తీసాడ'ని విమర్శించేవారు కాదా? ఫైనాన్షియర్స్ మీద దాడి చేయకూడదని వాదిస్తున్నారంటే ఈనాడు మీదనే చేయాలని ఈ విమర్శకులు పరోక్షంగా

సూచిస్తున్నారా? వైఎస్ అలా చేసి ఉంటే పత్రికా స్వేచ్ఛ మీదదాడి అని విమర్శించేవారు కాదా? వైఎస్ పత్రికా స్వేచ్ఛ మీద దాడి చేయనందుకు అభినందించాల్సింది పోయి విమర్శిస్తారేమిటి? ఫైనాన్షియర్స్ మీద దాడి కక్ష సాధింపు చర్యే. సందేహం లేదు. కాని అది చట్టవిరుద్ధం కాదు. ఫైనాన్షియర్స్ మీద చట్ట విరుద్ధంగా దాడి చేసి ఉంటే వైఎస్ తోలువొలిచినా ఎవరు కాదనేవారు కాదు. పైనే చెప్పినట్లు రాజకీయ యుద్ధంలో మంచి చెడ్డలు, బాగోగులు, తప్పు, ఒప్పులుండవు. నైతికత అనేది సమాజంలో నుంచి కాకి ఎప్పుడో ఎత్తుకుపోయింది. రాజకీయాల్లో మిగిలింది విధానాలు కాదు; వ్యూహాలు, ఎత్తుగడలు, ఎత్తుకు పై ఎత్తులు మాత్రమే. గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు వచ్చాయని అనుకోవడమెందుకు?

గురివింద గింజ తన కింద నలుపు తానెరుగదు. పత్రికల, పాత్రికేయుల స్వేచ్ఛను భక్షించిన వాళ్లే పత్రికా స్వేచ్ఛ గురించి గొంతు చించుకొని, దేశమంతా ప్రచారం చేయబూనుకోవటం విడ్డూరం. రాష్ట్రంలో రెండు దిన పత్రికలకు శతాబ్దకాలంగా నేను వ్యాసాలు రాస్తున్నా. వాటిని పత్రికాధిపతులు, సంపాదకులు ప్రచురిస్తూ వస్తున్నా, వాటిని ప్రచురించవద్దని హుకుం జారీ చేసి అమలు జరిపించిన వారే ఈనాడు పత్రికా స్వేచ్ఛ గురించి ఇల్లెక్కి అరుస్తున్నారు. పత్రిక అచ్చువేసే న్యూస్ ప్రింట్ ధరను పెంచితే, అది పత్రికా స్వాతంత్ర్యానికి గొడ్డలి పెట్టని వక్రభాష్యం చెప్పినది, ఈయన అధ్యక్షత వహించిన ఎడిటర్స్ గిల్డే. హైదరాబాద్‌లో ఎక్కడైనా నలుగురు జర్నలిస్టులు కలిస్తే అందులో ఇద్దరు ఈనాడు నుంచి తొలగించబడినవారే. ఈనాడు పత్రికకు సంపాదకీయ విభాగంలో సీనియర్ జర్నలిస్టుగా మొట్టమొదటి పునాదులు వేసిన ఎబికె, పొత్తూరి, టివికె, ఈ వ్యాసకర్తలను మొదటి రెండేళ్లలో బయటకు వెళ్లిపోవాల్సిన పరిస్థితిని కల్పించింది ఈనాడు చీఫ్ ఎడిటరే. ఈ పత్రిక ప్రారంభించడానికి, ఆయన తలకాయలో ఓ దినపత్రిక విశాఖలో పెట్టాలనే ఆలోచను ప్రవేశపెట్టి ప్రారంభించడానికి సకల చర్యల్లో తోడ్పడి, ఒక ఎడిటర్‌ను సూచించి, వెనకాలపడి, ప్రారంభోత్సవం చేయించింది ఈ వ్యాసకర్తే. మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రారంభించకముందు ఢిల్లీలో ఉన్నప్పుడు ఒక సర్దార్జీ చిట్ ఫండ్‌లో చేరమంటే చీట్ ఫండ్ అని ఎగతాళి చేస్తూనే హైదరాబాద్ వచ్చి మార్గదర్శి చిట్ ఫండ్ స్థాపించారు.

అంతకు ముందు దక్షిణాదిలో సుదర్శన్ చిట్‌ఫండ్ అనే సంస్థ చాలా సంవత్సరాలు విజయవంతంగా పనిచేసి కూడా పలు కారణాల వల్ల మూతపడిన సుమారు సమయంలో మార్గదర్శి ఉద్భవించింది. ఇప్పుడు చిట్ ఫండ్ సంస్థ కాకపోయినా ఫైనాన్షియర్స్ ఇబ్బందుల్లో పడింది. పచ్చళ్లకు ఇతర దేశాల్లో ఏమోగాని, ఇక్కడ మొదట్లో బావున్నా, ప్రాచుర్యం కోల్పోయినట్లు అనిపిస్తుంది. షిప్ బ్రేకింగ్ ఎప్పుడో మూతపడింది. స్టూడియోస్ గుదిబండగా తయారైంది. దర్శనీయ స్థలంగా మార్చి సొమ్ము చేసుకోవాల్సిన స్థితిలో ఉన్నారు. ఈనాడు పత్రిక, ఈటివి మాత్రం పాప్యులర్ సంస్థలుగా మిగిలాయి. ఈ సోది అంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఈ సంస్థలు వార్తల్లోకెక్కాయి కాబట్టి పూర్వాపరాలు తెలుసుకొని ఉంటే మంచిదని మాత్రమే. ఒక విషయం మాత్రం అంగీకరించాలి. ఇప్పటి వరకూ చిట్‌ఫండ్స్, ఫైనాన్షియర్స్ సంస్థలు డిపాజిటర్ల విశ్వాసాన్ని కోల్పోయిన సందర్భాలు లేవు.

మనమంతా వార్తా పత్రికలు చదువుతున్నాం. కాని మనం చదువుతున్నది వార్తాపత్రికలు కాదు, వ్యాఖ్యా పత్రికలు. మనం వార్త చదువుతున్నామో, వ్యాఖ్యలు చదువుతున్నామో తెలియటం లేదు. రెండు కలగాపులగం చేసి, ఏది వార్తో, ఏది వ్యాఖ్యో తెలియనంతగా మనకందిస్తున్నాయి పత్రికలు. న్యూస్ ఈజ్ సేక్రెడ్, కామెంట్ ఈజ్ ఫ్రీ అనే ప్రాథమిక సూత్రాన్ని పత్రికలు ఎప్పుడో తుంగలోతొక్కేసాయి. ఇదేదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఎప్పుడైతే పత్రికలు వ్యాపార సంస్థలయ్యాయో, అప్పటి నుంచి అవి ఆయా యాజమాన్యాల ప్రయోజనాలను కాపాడే వ్యవస్థలుగా తయారయ్యాయి. బడా కార్పొరేట్లు వీటిని తమ అధీనంలోకి తీసుకొని, వాటి ద్వారా ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసి, వాటి ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొని వచ్చి తమ కనుకూలమైన విధానాలను ప్రభుత్వం అమలు పరిచేలా చేసుకోవటం వారి లక్ష్యం. ఉదాహరణకు మీరు రోజూ ఈనాడు పత్రిక చదువుతున్నారనుకోండి, దానిలోని రాతలన్నీ తెలుగుదేశానికి అనుకూలం, ప్రభుత్వానికి వ్యతిరేకం. పాఠకులుగా మనకు తెలియకుండానే ఆలోచనలు ఆమూసలో ప్రభావితమవుతాయి. అబద్ధాన్ని నూరు సార్లు పలికితే నిజమై పోతుందన్నట్లు వైఎస్‌ను రోజూ తిడుతూంటే, అదే నిజమై పాఠకుల మనస్సులో తిష్ట వేస్తుంది. ఇలాంటి దుష్ట ఆలోచనకు పత్రికా స్వాతంత్ర్యం అనే ముసుగుతొడిగి, ఈ స్వాతంత్ర్యాన్ని ఎవరో హరించేస్తున్నట్లు గగ్గోలు.

ఏ స్వాతంత్ర్యానికైనా హద్దులుంటాయి. వెనకటికి బ్రిటన్‌లో ఓ పెద్ద మనిషి ఇలాగే తనకు స్వతంత్రం ఉందని చేతి కర్రను గాలిలో తిప్పుకొంటూ పోతుంటే అది ఒకరి ముక్కుకు తగిలింది. ఆయన కోర్టుకు వెళ్తే న్యాయాధిపతి తీర్పునిస్తూ "నీ స్వాతంత్రం నీ చేతి కర్ర చివర భాగంతో అంతమయి, ముక్కుతో అతని స్వతంత్రం ప్రారంభమౌతుంది" అని అన్నారు. పత్రికలకు ప్రభుత్వ విధానాలను విమర్శించడమే కాదు, చీల్చి చెండాడే హక్కుంది. ఆ స్వాతంత్ర్యానికి అక్కడ ఫుల్‌స్టాప్. వ్యక్తిగతంగా విమర్శలు చేయదలచుకొంటే, ఆ స్వాతంత్ర్యానికి హద్దులేర్పడతాయి. శాసనసభలో ఏ సభ్యుడైనా మరొక సభ్యుని మీద గాని, సభలో లేని వారి మీద గాని వ్యక్తిగత విమర్శలు చేయదలచుకొంటే ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. నిదర్శన పూర్వకంగా విమర్శించాలి. విలేఖరి అధికారిక కార్యక్రమాలను విమర్శించదలచుకొంటే, లేక ఏ రాజకీయ నాయకుడో విమర్శించినా, వాటి గురించి తత్సంబంధిత అధికారిని కలుసుకొని, అతని జవాబును కూడా ప్రచురించటం పాత్రికేయ ధర్మం. కాని ఇప్పుడు జరుగుతున్నదేమిటి? వైఎస్ మీద చేస్తున్న ఆరోపణల, విమర్శల విషయంలో ఈ వృత్తి ధర్మాన్ని పత్రికలు పాటిస్తున్నాయా?

ఈ రోజున నిజంగా స్వతంత్రంగా, నిర్భయంగా వ్యవహరించే పత్రికలున్నాయా? ఇవి మా పార్టీ పత్రికలని చెప్పుకొనే కమ్యూనిస్టు పత్రికలతో ఏ పేచీ లేదు. కాని ఇతర పత్రికలు మావి స్వతంత్ర పత్రికలని చెప్పుకొంటూనే ఏదో పార్టీ కొమ్ముకాయటమో, లేక బురద జల్లడమో జరుగుతోంది. 1950 ఉత్తరార్థ కాలంలో నేను విశాలాంధ్ర పత్రికకు విలేఖరిగా పని చేస్తున్నప్పుడు; నీ పత్రిక పార్టీ పత్రిక, మా పత్రిక ఇండిపెండెంట్‌గా అన్ని వార్తలు ఇస్తుందని నన్ను గేలి చేసేవారు. కాని

వాస్తవమేమంటే అప్పుడూ ఇప్పుడూ కూడా మంత్రి చెప్పిన విషయానికి అందులో విశేషం ఏమైనా ఉన్నా లేకపోయినా, లేదా ఆ విషయం ఇదివరకే పత్రికల్లో వచ్చినా, పతాక శీర్షిక లేదా మొదటి పేజీ వార్త అవుతుంది. అదే కాలంలో నగరంలో నిజాం కాలేజీ పక్కన ఉన్న కో–ఆపరేటివ్ యూనియన్‌లో సహకార వారోత్సవాల సందర్భంలో సభ ఏర్పాటుకు విలేకరిగా వెళ్లినప్పుడు, ఆ సభకొచ్చిన ప్రజలకన్నా విలేఖరుల సంఖ్యే ఎక్కువగా ఉంది. అయినా ఆ వార్త మరుసటి రోజు పత్రికలో మొదటి పేజీ వార్త అయింది. కాని అదే రోజున కృష్ణా జిల్లా గన్నవరం గ్రామంలో కమ్యూనిస్టు నాయకుడు సందరయ్య యాభై వేల మంది హాజరైన సభలో మాట్లాడితే ఆ వార్త లోపలి పేజీల్లో ఎక్కడో పదిలైన్లలో అచ్చయింది. ఇది ఆ రోజుల్లోనే పత్రికా స్వాతంత్ర్యం అమలు పరచిన తీరు.

మీరు పత్రికల్లో అప్పుడప్పుడు చదివే ఉంటారు. ఎవరి గురించో, ఏ సంస్థ గురించో పత్రికలో వార్త ప్రచురితమవుతుంది. అప్పుడు ఆ వ్యక్తి, లేదా ఆ సంస్థ మీరు ప్రచురించిన వార్త వాస్తవం కాదు, అసలు విషయం ఇదీ అని, ఈ విషయం, ఈ వివరణను మీ పత్రికలో ప్రచురించమని కోరుతారు. చాలా కొద్ది ఇంగ్లిష్ పత్రికలు తప్పుపట్టిన వార్తరాసిన విలేకరిని వాకబు చేసి, అతని వివరణతో సహా ప్రచురిస్తాయి. అది ఫ్యాక్చువల్ ఎర్రర్ అయితే క్షమాపణలతో సవరణను ప్రచురిస్తాయి. మిగతావన్నీ కేరాఫ్ చెత్తబుట్ట. ఇది పత్రికా స్వాతంత్ర్యం అమలు జరుగుతున్న తీరు.

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు హిందూ పత్రికలో ప్రతివారమూ, ప్రతి ఇరవై ఐదు రోజులకోసారి ఆయన ప్రభుత్వ కార్యక్రమాల గురించి, ప్రజలంతా హాయిగా బతుకుతున్నారని అడ్వర్టయిజ్‌మెంట్లు ఏ యాదగిరి పేరుతోనో, ఏ వెంకటేశ్వర్లు పేరుతోనో వేయించుకొని ప్రజల డబ్బు చెల్లించేవారు. ఈ తతంగం వ్యవహారం హిందూ సంపాదకునికి తెలియనిది కాదు. పత్రికా స్వాతంత్ర్యాన్ని రెండువైపులనుంచి మహబాగా కాపాడారు.

అదే పాలనలో మరో విశేషం. ఇది నేను టీవీలో విన్నా. హైదరాబాద్ నుంచి 'మంచి' విలేకరులను పోగేసి సింగపూర్ తీసుకొని వెళ్లారు. సింగపూర్‌లో ప్రైవేట్‌గా పత్రికలు నడిపేవారెవరూ లేరు. ఒకే ఒక ప్రభుత్వ పత్రిక. వార్తలంటే ప్రభుత్వ వార్తలే. మీరు కూడా ఆ పత్రికలో లాగే ప్రభుత్వ అనుకూలంగా రాయాలని తీసుకొని వెళ్లిన విలేకరులకు పరోక్షంగా చెప్పటమేకదా? పత్రికా స్వాతంత్ర్యం జిందాబాద్. యాజమాన్యాలిలా ప్రవర్తిస్తూంటే, కొంతమంది సీనియర్, జూనియర్ విలేకరుల ప్రవర్తన, రాతల గురించి ఎంత తక్కువ రాస్తే అంత మంచిది. మందు పోస్తే రాసేవారు, పార్టీ, ప్రభుత్వం నుంచి ప్లాటు, ఫ్లాటు, స్కూటర్, కారు పుచ్చుకొని, ఏమి ఎలా రాయమంటే రాసే వారికి కొదవేమీలేదు. పాత్రికేయుల యూనియన్లు అలాంటి సీనియర్ల (సీనియారిటీ దేంట్లో?) చేతుల్లో బందీలైపోయాయి. మళ్లా వీళ్లే ఫలానా నాయకుడు డబ్బు తిన్నాడని, ఆస్తులు పోగేసుకున్నాడని, అడ్డమైన గడ్డితింటున్నాడని వార్తలు రాస్తారు. ఆ ఫలానా నాయకుడు ఇలా రాసేవేమిటని అడగడు. ఇంకో ఫలానా నాయకుడు ఫలానా వెధవ పని చేసేడని, కక్ష తీర్చుకోవటానికి ఆ విలేకరి చేతే రాయించుకొంటాడు. ఇలాంటి సందర్భాల్లో కొంత మంది విలేకరులు బలిపశువులవుతారు. తన్నులు తింటారు.

ఇలా రాస్తూపోతే పెంటను కదిలించినట్లవుతుంది. పై నుంచి కింద దాకా, మంత్రుల నుంచి ఛోటా నాయకుల వరకూ, అసలు మొత్తం సమాజమే కుళ్లు కంపు కొడుతుంది. పత్రికలు, పాత్రికేయులు ఆ సమాజంలో భాగమే.

స్వాతంత్ర్యం పూర్వం పత్రికాధిపతులు, సంపాదకులు ప్రజలకు ఆరాధ్యులు... ఇప్పుడో?

ఈ గుడ్డి రాజకీయ విద్వేషాలతో, కక్షలతో దేశంలో పత్రికా ప్రపంచాన్ని చుట్టు ముట్టుతున్న ప్రమాదాన్ని గుర్తించటం లేదు. చాలా కాలంగా విదేశాల్లో బహుళ ప్రచారం కల పత్రికలు మన దేశంలో ఆ పత్రికల ఎడిషన్లు ప్రచురిస్తామని భారత ప్రభుత్వం తలుపు తడుతున్నాయి. దేశంలోనే ఉన్న బడా పత్రికలు కూడా ఈ ప్రయత్నాన్ని ఖండించాయి. వాటిని అనుమతించరాదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అటువంటి వైఖరి తీసుకొన్న పత్రికలే ఇప్పుడు దాసోహమంటున్నాయి. ఇటీవల విదేశీ పత్రికలతో ఒడంబడిక చేసుకొని ఇక్కడ ప్రచురణలు ప్రారంభించాయి కూడా. అవి కేవలం ఇంగ్లిష్ లోనే కాక ప్రాంతీయ భాషల్లో కూడా వారి పత్రికల ఎడిషన్లు తీయడానికి వెనుకాడవు. ఇదే జరిగితే రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రస్తుతం నడుస్తున్న ప్రాంతీయ భాషా పత్రికలు పోటీకి తట్టుకోలేక షాపులు మూసుకోవాల్సిందే. ఇది జరక్కుండా ఏమి చేయాలో అనే విషయంపై యాజమాన్యాలు, పాత్రికేయులు అర్థం లేని జగడాలను పక్కన పెట్టి ఆలోచించుకోవాలి. ♦

(... 5వ పేజీ తరువాయి)

మరి ఇంతమంది అసంఘటిత కార్మికులు బతుకుతున్నారు. ప్రభుత్వం నుండి ఏవో పథకాలు వస్తున్నా, అవి పార్టీ కార్యకర్తలకు తప్ప నిజమైన చేనేత కూలి కార్మికుని దరి చేరవు. అనంతపురం జిల్లాలో, ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కుటుంబాలు 2004 నుండి ఇప్పటివరకు దాదాపుగా 200 మందికి పైగా చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వారిలో కేవలం 20 మందికి మాత్రమే ఎఫ్.ఐ.ఆర్., పోస్టుమార్టం రిపోర్టులు ఉన్నాయి. ముఖ్యమంత్రి గారు ఆత్మహత్యలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి రెండు సంవత్సరాలు గడిచిపోయినా కేవలం ముగ్గురికి మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇచ్చి చేనేత అధికారులు, ఆర్.డి.ఒ. చేతులు దులుపుకున్నారు. మళ్లీ ముఖ్యమంత్రి అనంతపురం జిల్లాకు వచ్చేవరకు ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు న్యాయం జరిగేలా లేదు. పెండ్లికి ఎదిగిన అమ్మాయిలు, బడికి ఎదిగిన బుడతలు, కుటుంబాలు యావత్తు శ్రమించినా అన్నం తినడానికి కష్టంగా తయారైన రోజులు. దిక్కుతోచని పరిస్థితిలో చేనేత కుటుంబా ఆత్మహత్యలు చేసుకునే దీన స్థితిలో ఉన్నాయి.

– ఎం. రామాంజనేయులు

ధర్మవరం

జి.డి.పి. రేటుతో దేశ ఆర్థికాభివృద్ధిని లెక్కించటం సబబా?

– వి. చలపతిరావు

భారతదేశ ఆర్థికాభివృద్ధి ప్రస్తుతం ఎనిమిది శాతం జి.డి.పి. పెరుగుదలతో నిబ్బరంగా, దృఢంగా గత ఒకటి రెండు సంవత్సరాల నుండి కొనసాగుతోందని భారత ప్రభుత్వం పదే పదే చెప్తుతోంది. ఈ ఘనత అంతా తమ ఖాతాలోకి వెళ్లినట్లు చెప్పుకుంటోంది. అయితే ఈ జి.డి.పి. (స్థూల జాతీయోత్పత్తి) పెరుగుదల తతంగం గురించి సామాన్య ప్రజలకు (సోనియాగాంధీ సానుభూతి చూపే 'ఆమ్ ఆద్మీ'కి) ఏమీ తెలియదు. వారికి తెలిసిందల్లా, ఏ ప్రభుత్వం వస్తే తమకు ఏమి ఒరిగిందని, తమకు ఏమి సౌకర్యాలు కలిగాయి, తమకు కూడు, గుడ్డ, నివసించటానికి ఇల్లు వసతి లాంటివి సమకూరుతున్నాయా, తమ పిల్లలకు చదువు సౌకర్యం, వైద్య సౌకర్యాలు అందుతున్నాయా, ముఖ్యంగా తమకు కావలసిన నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దొరుకుతున్నాయా? ఈ అంశాలతోనే 'ఆమ్ ఆద్మీ' దేశ ఆర్థికాభివృద్ధి రేటును తూకం వేస్తారే కాని, ప్రభుత్వాధినేతలు గంటలు మోగిస్తూ మరీ మరీ చెప్పే జి.డి.పి. పెరుగుదల రేటుతో కాదు.

కనుక ప్రభుత్వం తన హయాంలో సదరు జి.డి.పి రేటు పెరుగుదల ఏడు నుండి ఎనిమిది శాతం వచ్చిన తర్వాత ప్రజలకు ఏమి అదనంగా సౌకర్యాలు కలిగాయి, ప్రజల జీవన ప్రమాణం ఎంత పెరిగింది, రేపు ఎనిమిది నుంచి తొమ్మిది శాతం పెరిగితే అదనంగా సౌకర్యాలు ఏమైనా కలుగుతవో నికరంగా చెప్పగలగాలి. అప్పుడే అది నిజమయిన ఆర్థికాభివృద్ధి లేదా సమగ్ర ఆర్థికాభివృద్ధి అవుతుంది. లేనట్లయితే ప్రజల దృష్టిలో అదొక వృథా ప్రసంగం, అర్థం పర్థం లేని మాటలవుతాయి. ఈ ప్రభుత్వాలు, ఆర్థిక సంస్కరణలను మానవముఖంతో అమలు పరుస్తామని చెప్తుతున్నాయి కదా, కనుక వారు సాధించే ఆర్థికాభివృద్ధి సామాన్య ప్రజలకు నికరంగా కల్పించిన సౌకర్యాల పరిభాషలో ప్రకటించాలి. సౌకర్యాల కల్పనే గీటురాయి కావాలి.

నిత్యావసర వస్తువుల ధరలు క్రమంగా గత రెండు సంవత్సరాల నుండి పెరుగుతూ ఇప్పుడు తారా స్థాయికి చేరాయి. ఉల్లిగడ్డలు, పప్పు దినుసులు, కూరగాయలు, బియ్యం, గోధుమల ధరలు కొన్ని యాభై శాతం, కొన్ని వంద శాతం వరకు పెరిగి, సామాన్య ప్రజలకు, మధ్యతరగతి వారికి, ఉద్యోగులకు కడు భారంగా తయారయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తులు అందిన కొత్తలోనే బియ్యం, గోధుమల లాంటి తిండి గింజలకు సైతం ధరలు విపరీతంగా పెరిగితే రేపు వేసవి కాలంలో, తర్వాత వర్షాకాలం తొలి రోజులలో తిండిగింజల ధరలు ఎంత మండిపోతాయో ఊహించవచ్చు. నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను ఎందుకు విస్మరిస్తున్నాయి? పైగా కేంద్ర ఆర్థిక మంత్రి దేశం ఇలా ఆర్థిక ప్రగతి సాధించే సందర్భంలో వస్తువుల ధరలు పెరగటం సామాన్యమని వాదిస్తున్నాడు. ఆరు నెలల క్రితం సోనియా గాంధీ యు.పి.ఎ చైర్ పర్సన్‌గా, ధరలు అదుపు చేయవలసిందిగా ప్రభుత్వానికి లేఖ రాసారు. అయినా ధరల పెరుగుదల ఆగలేదు. వ్యవసాయకంగా మన దేశంలో అత్యధికంగా అభివృద్ధి అయిన రాష్ట్రం పంజాబ్. అయినా అక్కడ కూడ వ్యవసాయోత్పత్తుల, కూరగాయల ధరలు బాగా పెరిగి సామాన్యుల బతుకులు అతలాకుతలం అవుతున్నాయి. అక్కడ ఉన్నది కాంగ్రెస్ పాలనే.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ నేత వై.ఎస్.ఆర్ రైతు బాంధవుడనని చెబుతూ రాష్ట్రమంతా కాలినడకన పర్యటించి, టిడిపి ప్రభుత్వాన్ని గద్దె దింపి మూడేండ్లుగా పరిపాలన చేస్తున్నాడు. కాని ఇక్కడ కూడ క్రమంగా ధరలు తారాస్థాయికి చేరాయి. ఇంకొక వైపు ప్రజాపంపిణీ దుకాణాలకు చేరవలసిన వేలాది టన్నుల బియ్యం వ్యాగన్ల ద్వారా ఓడరేవులకు చేర్చబడి అక్కడి నుండి అక్రమంగా వేరే దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ధరల పెరుగుదల పై ఆందోళన చేయటం వలన ముఖ్యమంత్రి సంబంధిత అధికార్లతో సమావేశమై అక్రమ నిలువలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోమని ఆదేశించారు. ఇరవై నాలుగు గంటలలోనే రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ విభాగం దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో ఆహార ధాన్యాల నిల్వలు పట్టివేసింది. విజిలెన్స్ దాడులలో, కంది, శెనగ, మిర్చి, చింతపండు, పసుపులాంటి నిత్యావసర వస్తువుల నిల్వలు బయటపడ్డాయి. మార్కెటు ఫీజు చెల్లించకుండా బినామి పేర్లతో నిల్వచేసిన 20.10 లక్షల క్వింటాళ్ల ఆహార ధాన్యాలను అధికారులు స్వాధీన పరుచుకున్నారు. ఇది కర్నూలు జిల్లాలో జరిగింది. అదే విధంగా అనంతపురం జిల్లాలో గిడ్డంగులపై జరిగిన దాడులలో 24.41 లక్షల రూపాయల విలువచేసే ఆహార ధాన్యాల నిల్వలు పట్టుబడ్డాయి.

ఇక్కడ పరిశీలించదగిన విషయం ఏమంటే ముఖ్యమంత్రి ఇంతకాలం ధరలు పెరిగి సామాన్య ప్రజలు బాధపడుతుంటే ఇదే విధమైన ఆదేశాలు అధికార్లకు ఎందుకు ఇవ్వలేదు? పైగా ఒక దశలో ఆయన నిత్యావసర వస్తువుల పెరుగుదలకు కారణం పెట్రోలు ధరలు పెరగటం వలన అని అసలు విషయాన్ని మరుగుపరిచి ప్రజలను మభ్యపెట్టాడు. ఇప్పుడు ప్రజలు, ప్రతిపక్షాల ఆందోళన ఎక్కువకాగానే అక్రమ నిల్వల పై దాడులు చేయవలసిందిగా ఆదేశాలు ఇవ్వటం విడ్డూరంగా ఉంది.

ఇక రెండవ విషయం, ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వగానే విజిలెన్స్ విభాగం ఇరవై నాలుగ్గంటల్లో వివిధ జిల్లాలలో దాడులు జరపటం వింతగా ఉంది. ముఖ్యమంత్రి స్వయంగా ఆదేశాలు ఇస్తేనే, లేదా వీరి చెవుల్లో ఊదితేనే అక్రమ నిల్వలు వెలికితీయటానికి పూనుకుంటారా, లేనట్లయితే వీరికి బాధ్యత లేదా? లేదా ఈ అక్రమ నిల్వదార్లకు, అధికారంలో ఉన్న రాజకీయులకు సంబంధాలున్నాయని ఇంతకాలం వారి జోలికి పోవటానికి భయపడుతున్నారా? లేదా ఈ యంత్రాంగం అక్రమ నిలువదారుల వద్ద ముడుపులు తీసుకుంటూ ప్రేక్షకపాత్ర వహించారా? ఏది ఏమయినా యంత్రాంగంలో స్తబ్దత, రాజకీయులు అక్రమ నిలువదారులతో మిలాఖత్ అయి ఉండటం వల్లనే ఇలా

వినియోగ వస్తువుల ధరలు పెరగటానికి మూల కారణం అని తేట పడుతోంది. ఇది చాలా ఘోరమైన విషయం. ఇలా ఒకవైపు రాజకీయ నాయకులు నేరస్తులతో మిలాఖత్ అయివుండి, ఇంకొక వైపు జన జీవనంలో విలువలను నాశనం చేస్తూ, రెండవ వైపు కార్పొరేట్ సెక్టార్ సంపాదించే లాభాలపై జి.డి.పి. ని అధిక స్థాయికి కల్పనచేసి (ప్రొజెక్షన్) చూపగానే ఆర్థికాభివృద్ధి ఎక్కువ అయిందని పాలకులు మురిసిపోవటం జరుగుతోంది. ఈ కొలతలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావటానికి, ప్రపంచ బ్యాంకు నుండి మరిన్ని అప్పులు తేవటానికి పనికి రావచ్చునేమో కాని దేశంలో నివసిస్తున్న 75 శాతం బీద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెరగటానికి పనికిరావు.

ఫిబ్రవరి 12న ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశంలో గవర్నర్ ప్రసంగంలో ధరల అదుపు గురించిన ప్రస్తావన లేదు. ఒకప్పుడు ప్రభుత్వం ప్రణాళికలలో, బడ్జెట్లలో పేదల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి లాంటి అంశాలు ప్రాధాన్యత క్రమంలో పేర్కొనేది. కాని ఇప్పుడు వాటి ప్రాధాన్యత తగ్గి ప్రభుత్వాల దృష్టిలో అంతా పట్టణీకరణ వైపు అందులో ఎక్కువగా హైదరాబాద్, విశాఖపట్టణాల్లాంటి పెద్ద నగరాలలో పారిశ్రామికీకరణ పెంచటానికి మౌలిక సౌకర్యాలు పెంచటం పైననే లగ్నమై ఉంటున్నది. చిన్న పట్టణాలు, మండల కేంద్రాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత లభించటం లేదు. గ్రామ పంచాయితీలకు రాజ్యాంగ సవరణలు 73,74 ప్రకారం తగు ఆర్థిక వనరులు కల్పించి గ్రామాలను అభివృద్ధి జరపాలనే ధ్యాస ఈ ప్రభుత్వాలకు లేకుండా పోతోంది. గాంధీ ఆదేశించిన 'గ్రామ స్వరాజ్' కార్యక్రమం పూర్తిగా మసకబారిపోతోంది.

ఇటీవల ముఖ్యమంత్రి బహుశా రెండుసార్లు పల్లె ప్రజలను నగరాలకు తరలి రావలసిందిగా, నగరాలకు వచ్చి ప్రైవేట్ సెక్టర్‌లో పెరుగుతున్న ఉద్యోగాలలో చేరవలసిందిగా పిలుపు ఇచ్చాడు. ముఖ్యమంత్రి రెండవసారి పల్లెవాసులను ఉద్దేశించి పై విధంగా అనగానే ప్రతిపక్ష నాయకుడు బాబు గ్రామస్తులు పట్టణాలకు వచ్చి భిక్షమెత్తుకోవాలా అని ప్రశ్నించాడు. ఈనాడు ప్రతిపక్షంలో ఉండి ఈయన ఆ విధంగా ప్రశ్నించాడు, కానీ వాస్తవంగా ఇరువురూ కూడా గ్రామీణ రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, చేనేత పరిశ్రమల్లాంటి వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దాని ఫలితంగా ఆనాటి నుండి ఈనాటి వరకు అటు రైతులు, ఇటు చేనేత కార్మికుల అత్మహత్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఈ పాపంలో ఇద్దరూ భాగస్వాములే. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ, కాని ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాపంపిణీ విధానం షాపులలో పంపిణీ అయ్యే బియ్యం గోధుమలు పంజాబ్, హర్యానాలవి. ఈ రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ కన్నా చాలా చిన్న రాష్ట్రాలు. చిన్న రాష్ట్రాలైతే కేంద్రం నుండి నిధులు రావని సమైక్యవాదులు వాదిస్తుంటారు. ఇప్పుడేదో గొప్పగా వీరు కేంద్రం నుండి నిధులను ప్రవహింప చేస్తున్నట్లుగా ప్రగల్భాలు పలుకుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చత్తీస్‌గడ్ వలె నిధులు లేక వెనకబడి పోగలదని వీరు వాస్తవాలకు అతీతంగా మాట్లాడుతారు. ఇటీవల పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో కూడా చత్తీస్‌గడ్ నుండి బియ్యం రవాణా అయి అగ్గువ ధరలకు లభ్యం అవుతున్నట్లు పత్రికలలో వార్తలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో అరకొరగా ఏడు గంటలు కూడ సరిగా కరెంట్ సరఫరా కావటం లేదు. కాని చత్తీస్‌గడ్ రాష్ట్రంలో ఇరవై నాలుగు గంటలు కరెంట్ సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఉత్తరాంచల్ పర్వత ప్రాంతాలలో రోడ్లు వగైరా మౌలిక సౌకర్యాలు పెంచటంలో అక్కడి ప్రభుత్వం బాగా కృషి చేసిందని వార్తలు. సమైక్య రాష్ట్రం పేర హైదరాబాద్ చుట్టు పక్కల గల ప్రభుత్వ భూములను అమ్మి, సర్కార్‌ను దివాళా తీయించి తమ కడుపులు నింపుకుంటున్న సమైక్య పాలకులు దీనికి ఏమి జవాబు చెబుతారు?

ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి 2020 వరకు భారతదేశం జనాభాలో 60 శాతం నగరాలలో నివసిస్తారని, 2050 వరకు దేశంలోని 90 శాతం ప్రజలు నగరాలలో నివసిస్తారని చెప్పాడు. అంటే ఈ ప్రభుత్వాలు నగరాలను అంత వేగంగా విస్తరింప చేస్తారన్నమాట. వీరు పట్టణీకరణకు, పారిశ్రామికీకరణకు అంత ప్రాధాన్యతను ఇస్తారన్నమాట. గ్రామాల అభివృద్ధికి, వ్యవసాయరంగ అభివృద్ధికి క్రమంగా ప్రాధాన్యత తగ్గుతుందన్నమాట. పూర్వం ఇంగ్లాండ్ ప్రముఖ కవి వర్డ్స్‌వర్త్ చెప్పినట్లు గ్రామాలన్నీ వదిలిపెట్టబడి బీడుబడిపోతాయన్నమాట. అంటే అనాది నుండి గ్రామాలలో పుట్టి పెరిగిన భారతీయ సంస్కృతి నాగరికతలు సమసిపోతాయన్నమాట. ఇది అభిలషణీయమా? భారతీయ మేధావులు తేల్చవలసి ఉంది. భారత దేశంలోని మొత్తం జనాభానంతా నగరాలలోకి, పట్టణాలలోకి తరలించి ఇక్కడి మంచినీటి సమస్యను, మురికి వాడలు, మురికి కాలువల సమస్యలను, ట్రాఫిక్, వాతావరణ కాలుష్య సమస్యలను ద్విగుణీకృతం చేయటం కన్న, ఇప్పుడున్న గ్రామాలే ఇప్పటి కన్న అధికాదాయాలతో అధిక సౌకర్యాలతో అభివృద్ధి అయ్యే విధంగా మన ఆర్థిక వేత్తలు, సాంఘిక శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు అందరూ ఆలోచించి కొత్త ఆదర్శ అభివృద్ధి మోడల్స్‌ను రూపొందించలేరా? ఆర్థికాభివృద్ధిలో జి.డి.పి. పెరుగుదల మంత్రం జపిస్తూ పూర్తిగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలను గుడ్డిగా అనుకరించటం ఉచితమా?

ప్రస్తుతం భారతదేశం ఆర్థికాభివృద్ధిలో చైనాతో పోటీపడుతోంది. కొన్ని రంగాలలో చైనాను రోల్ మోడల్‌గా తీసుకుంటోంది. చైనా అభివృద్ధితో పోల్చుకుంటున్నది. అక్కడ కొన్ని గ్రామాలలో ప్రజల జీవన ప్రమాణాలు, వసతులు వ్యవసాయంతో పాటు, ఆదాయాల అభివృద్ధి కొరకు పరిశ్రమలు కూడ కార్పొరేట్ సెక్టర్ స్థాయిలో అభివృద్ధి చేయబడ్డట్టు వార్తలు వస్తున్నాయి. ఉదాహరణకు చైనాలోని జియాంగ్సు ప్రావిన్స్‌లో హు వాక్సి గ్రామ ఆర్థికాభివృద్ధి చాలా ఉచ్ఛస్థితికి చేరిందట. ఈ గ్రామంలో మొత్తం 2000 మంది గృహస్తులు, ప్రతి ఒక్కరూ 6000 చదరపు మీటర్ల విస్తీర్ణం గల విలాసవంతమైన ఇళ్లలో ఉంటున్నారట. అందరికీ కార్లు కూడ ఉన్నాయి. ఈ గ్రామస్తుల తలసరి ఆదాయం 10,000 డాలర్లు. ఈ ఆదాయం చైనాలోని సగటు రైతుకన్నా 50 అంతలు ఎక్కువ అని చెబుతున్నారు. ఈ గ్రామ అభివృద్ధికి మూలకారణం, అక్కడ వ్యవసాయంతో పాటు కొన్ని మెకానికల్ పరిశ్రమలను అభివృద్ధి చేశారు. ఆ గ్రామ పరిశ్రమల ఉత్పత్తుల, అమ్మకం వలన గత సంవత్సరం మొత్తం 40 బిలియన్ల యెన్‌లు (ఐదు బిలియన్ డాలర్లు) సంపాదించారట. ఈ గ్రామ పరిశ్రమలు కార్పొరేట్ స్థాయికి

తెలంగాణకు రక్షణలు విస్మరిస్తే సమైక్య ఆంధ్రకు ప్రాతిపదికే లేదు

– మండగడ్డ విక్రమ్ కుమార్

ఆంధ్రప్రదేశ్ సమైక్య రాష్ట్రంగా ఏర్పడి యాభై సంవత్సరాలు పూర్తి అయ్యాయి. దేశానికి స్వాతంత్ర్యం లభించి యాభై తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి భారత రిపబ్లిక్‌గా ప్రకటించుకొని యాభై ఆరు సంవత్సరాలు కావస్తున్నది. సమైక్య రాష్ట్రం కొనసాగుతున్నప్పటికీ, రాష్ట్ర పునర్విభజన వాదం కొనసాగుతూనే ఉంది. దేశ వ్యాపితంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికపై రాష్ట్రాల నిర్మాణం జరిగింది. అందుకు అనుగుణంగానే రాష్ట్ర అవతరణ జరిగి ఐదు దశాబ్దాలు గడిచినా, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమాలు సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నాడు ప్రభుత్వం, వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పాలకులు రాష్ట్ర సమగ్ర అభివృద్ధి విషయంలో ఆయా రంగాలలో సాధించిన అభివృద్ధిని ప్రకటిస్తున్నారు. కానీ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారంలో జరిగిన వైఫల్యాలను ప్రకటించడంలో ప్రతి నవంబర్ ఒకటి నాడు విఫలం చెందుతున్నారు.

ముఖ్యంగా రాష్ట్రంలో పలు ప్రాంతాలు వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించినప్పటికీ చారిత్రాత్మకంగా తెలంగాణ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేని ప్రాంతంగా కొనసాగుతున్నది. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు సహితం వెనుకబడి ఉన్నప్పటికీ, తెలంగాణ వెనుకబాటుతో పోల్చలేం. సమైక్యాంధ్ర విషయంలో తెలంగాణ ప్రజల మనోభావాలు ప్రత్యేకతను సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు, తర్వాత పలు ఉద్యమాలు, ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. వాటికి నాయకత్వం వహించిన నాయకులు రాజీపడి చరిత్ర కాలగర్భంలో కలసిపోయినా, తెలంగాణ ప్రజల మనోభావం నిరంతరం చరిత్రకు అదనపు పుటలను చేర్చుతూనే ఉంది. తెలంగాణ ప్రజలకు సమైక్యాంధ్రలో ఎదురవుతున్న సమస్యలేమిటి?

వాస్తవంగా నాటి హైదరాబాద్ సంస్థానం మొగల్ సుబేదార్, అసఫ్‌జాహి నిజాం ముల్క్ పాలన కిందికి 1713లోనే, రెండవ నిజాం, నిజాం ఆలీఖాన్ పదకొండు సంవత్సరాల అనంతరం (1724) స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. 1766లో అనగా ఆంధ్రప్రదేశ్ అవతరణకు 190 సంవత్సరాల ముందు సర్కార్లు జిల్లాలను బ్రిటిష్ వారికి ఇచ్చాడు, అనంతరం సర్కార్ జిల్లాల పరిపాలన బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కిందికి వెళ్లింది. నాటి నిజాం నవాబు 1800లలో రాయలసీమ ప్రాంతాన్ని బ్రిటిష్ వారికి దత్తత ఇవ్వటం జరిగింది. తద్వారా నేటి తెలంగాణ జిల్లాలు, మరట్వాడా, ఉత్తర కర్ణాటక ప్రాంతాలతో కలిసి హైదరాబాద్ రాజ్యంగా కొనసాగింది. సంస్థానంలో వెట్టిచాకిరి, ఉర్దు భాష అమలు, దొరతనం, భూస్వామ్య జమీందార్ల వ్యవస్థ మూడుపువ్వులు–ఆరు కాయలుగా ఉన్న రోజులవి. మాడపాటి హనుమంతరావు ఆధ్వర్యంలో 1927లో ఆంధ్ర మహాసభ జరిగి, మెదక్ జిల్లా జోగిపేటలో 1930లో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ప్రథమ మహాసభను నిర్వహించుకుంది.

ఎదిగి స్టాక్ మార్కెట్‌లో వాటి షేర్ల పై మంచి డివిడెండ్లు వస్తున్నాయట. ఈ లాభాలు గ్రామంలోని రైతులందరికీ పంచుతారు. ఆ విధంగా ఆ గ్రామ స్థూల జీవన ప్రమాణం పెద్ద నగరాల ధనవంతుల స్థాయిలో ఉందట. గ్రామాల ప్రజలను నగరాలకు తరలించి పరిశ్రమలలో వ్యాపారాలలో ప్రవేశపెట్టి అభివృద్ధి పరిచే కన్నా, వారిని గ్రామాలలోనే బ్రతకనిచ్చి అక్కడ వ్యవసాయంతో పాటు పరిశ్రమలను గ్రామాలకు కొద్ది దూరంలో పారిశ్రామికవాడలు అభివృద్ధి చేసి అక్కడ పని కల్పించి వారి ఆదాయాలలో వృద్ధి సాధించే ప్రయోగాలు మన దేశంలో చేయకూడదా? ఇలాంటి గ్రామాలు అభివృద్ధి మోడల్స్ డెవలప్ చేయటానికి అన్నాహజారే రెల్లిగాంవ్ అనే గ్రామాన్ని చేసిన అభివృద్ధి అనుభవాన్ని, నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధి అయిన అంకుశాపూర్ గ్రామస్తుల అభివృద్ధి అనుభవాన్ని, ముల్కనూర్ రూరల్ బ్యాంక్ కొన్ని గ్రామాలలో చేసిన అభివృద్ధి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చును. ప్రపంచ గ్రామాల అభివృద్ధి మోడల్‌గా తయారైన చైనాలోని హు వాక్సి గ్రామం అభివృద్ధి వెనక, ఆ గ్రామ కమ్యూనిస్టు పార్టీ సెక్రటరి వూరెన్ చావ్ నలభై ఏండ్ల కృషి ఉంది. చైనా కమ్యూనిస్టు పార్టీ ఆదేశాల ప్రకారం ఆయన ఆ గ్రామ కమ్యూన్ లోని వ్యవసాయ ఉత్పత్తిని మాత్రం మేనేజ్‌మెంట్ చేయాలి కానీ, ఆయన చొరవ తీసుకొని ముందు చూపుతో ఆ గ్రామాన్ని పారిశ్రామికంగా కూడ అభివృద్ధి చేశాడు. మొత్తం చైనాలో ఒక కొత్త గ్రామాల అభివృద్ధి మోడల్‌ను అభివృద్ధి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. కాని పశ్చిమ బెంగాల్‌లోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఎల్లప్పుడూ చైనాను ఆదర్శంగా భావించేది, ఇటీవల సింగూర్ గ్రామంలో మొత్తం 3500 ఎకరాల రెండు పంటల భూమిని బలవంతంగా భూసేకరణ చేసి టాటా కంపెనీకి అంటబెట్టి కలహాలను రేపింది. కాని అదే టాటా కంపెనీని ఒప్పించి భూమి కోల్పోయినందుకు అక్కడి రైతులకు నష్ట పరిహారంతో పాటు రైతులకు ఆ కంపెనీ షేర్లు, భూమికి వారి భూమి దామాషా పద్ధతిలో కొంత ఇప్పించవచ్చును. దానితో అక్కడి రైతులకు ఆదాయాలు పెరిగే అవకాశం ఉంటుంది. రైతులు కూడా తృప్తి చెందవచ్చును. ఒక పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోనే కాక దేశంలో అన్ని రాష్ట్రాలలో స్థాపించబడుతున్న స్పెషల్ ఎకనామిక్ జోన్లకు సేకరించే భూముల యజమానులకు పరిహారంతో పాటు ఆ కంపెనీ షేర్లు కూడా హు వాక్సి గ్రామ నమూనాలో ఇప్పించవచ్చును. ఇలా చేస్తే ఇది సమగ్ర ఆర్థికాభివృద్ధి అనిపించుకుంటుంది. పైగా అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం కల్పించినట్లవుతుంది. ♦

నాటి నిజాం రాజ్యానికి వ్యతిరేకంగా, సాంస్కృతిక, సాంఘిక రాజకీయ ఉద్యమం నిర్వహించింది. ఆంధ్ర మహాసభ నాయకత్వంలో హైదరాబాద్ సంస్థాన ప్రజలు అనగా తెలంగాణ ప్రజలు నిజాం దోపిడీకి, వెట్టి విముక్తికి, భూమి కోసం, భుక్తి కోసం, సంస్థాన విముక్తి కోసం విజృంభించారు. తెలంగాణలో భౌగోళికంగా కీలకమైన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో నిజాం వ్యతిరేక ఉద్యమం ఊపందుకుంది. జనగామ తాలూకా కడివెండి గ్రామంలో చాకలి ఐలమ్మ పంట పరిరక్షణలో భాగంగా నడుంకట్టిన సంఘం ఆధ్వర్యంలో, 1946 జూలై 4న దొడ్డి కొమరయ్య అమరత్వంతో విస్తృతమైన నిజాం వ్యతిరేకోద్యమం అనతికాలంలోనే తెలంగాణ జిల్లాలకు విస్తరించింది.

30 లక్షల జనాభా, 1600 చదరపు మైళ్ల విస్తీర్ణంలో, 3000 గ్రామాలలో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి. నిజాం వ్యతిరేక పోరాటంలో 4000 మంది కమ్యూనిస్టు పార్టీ యోధులు అమరులైనారు. పదివేలమంది కామ్రేడ్స్ జైళ్లపాలయ్యారు. నిజాం రజాకార్ల క్యాంపులలో 50 వేల మంది ప్రజలు చిత్రహింసలపాలయ్యారు. చారిత్రాత్మక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశంలోనే గాక, ప్రపంచంలోనే విశిష్టతను సంతరించుకుంది. 2000 మంది గెరిల్లా దళాలు, పదివేలమంది గ్రామ దళాలతో ప్రజాసైన్యం నైజాం రజాకార్ల ముష్కరులను వెంటాడింది. తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేసింది. 12 నుండి 28 మాసాల పాటు ప్రజా పరిపాలన జరిగింది. రెండు సంవత్సరాల రెండు నెలల పాటు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వీరోచిత పోరాటాల ఫలితంగా నిజాం రాచరిక వ్యవస్థకు బీటలు పడింది. 1948 సెప్టెంబర్ 17న నవాబు లొంగిపోవటం జరిగింది. 1948 నుండి 1952 లో సాధారణ ఎన్నికలు జరిగి, ప్రజా ప్రభుత్వం ఏర్పడే వరకు కేంద్ర సివిల్ అడ్మినిస్ట్రేటర్ పాలనలో ఉంది. సరిగ్గా ఈ సమయంలోనే స్థానికేతరులు హైదరాబాద్ రాష్ట్రానికి వలసలు రావడం ప్రారంభమైన విషయాన్ని విస్మరించలేం.

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో భాగంగా ఉన్న సర్కార్, రాయలసీమ జిల్లాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలని 1913 నుండి 1953 వరకు పలు ఉద్యమాలు, ఆందోళనలు జరిగాయి. చివరకు 1952 డిసెంబర్ 15న 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష ద్వారా పొట్టి శ్రీరాములు మరణించడంతో, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుండి ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు వేరుచేసి 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. రాయలసీమ ప్రజలకు సహితం 1937లో శ్రీబాగ్ ఒప్పందం ద్వారా పలు హామీలు ఇచ్చినా ఏ విధమైన ప్రయోజనం జరగలేదు. తమిళ భాష మాట్లాడే రాష్ట్రం నుండి తెలుగు మాట్లాడే ప్రజల కోసం, భాషా ప్రాతిపదికన, తెలుగు రాష్ట్రం ఏర్పడాలనే కాంక్ష ప్రబలింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి నాంది పలికింది. 1948 నుండి 1952 మధ్య ఆంధ్రప్రాంతం నుండి వలసలు పెరగడంతో, అందుకు నిరసనగా 1952లోనే ముల్కీ ఉద్యమం హైదరాబాద్‌లో జరిగింది. నలుగురు యువకులు ప్రాణాలను కోల్పోవటాన్ని గమనించాలి. ఈ సమయంలోనే జస్టిస్ ఫజల్ అలీ, సర్దార్ ఫణికర్, ఎచ్. కుంజుల ఆధ్వర్యంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. 1954లో తెలంగాణ ప్రజల, నాయకుల అభిప్రాయాలు విన్న ఫజల్ అలీ కమిషన్, తెలంగాణ ప్రాంతాన్ని జాతీయ శ్రేయస్సు దృష్ట్యా ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని సిఫార్సు చేసింది. అందుకు చూపిన కారణాలు - ఆంధ్రప్రాంతంలో తెలంగాణ విలీనమైతే అధిక సంఖ్యలో ఉండే ఆంధ్రప్రాంతం వారే ఉమ్మడి రాష్ట్రంలో లభించే అన్ని లాభాలు హస్తగతం చేసుకొని, తెలంగాణ ప్రాంతాన్ని వలస ప్రాంతంగా మార్చివేసే ప్రమాదం ఉందని, తెలంగాణ ప్రాంత ప్రజలు భయపడుతున్నారు (ఎస్.ఆర్.సి. రిపోర్ట్, పేజ్ నెం. 101). ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పటి నుండీ (1953) ఆ రాష్ట్రానికి ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయి. తెలంగాణ ప్రాంతానికి ఆర్థిక వనరుల సమస్యలేదు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ ఆర్థిక స్థిరత్వం, ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక అనిశ్చిత పరిస్థితి ఎదుర్కోవడానికి ఉపయోగించే ప్రమాదం ఉంది. (ఎస్.ఆర్.సి. రిపోర్ట్ పేజి నెం. 105). కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగంలో తెలంగాణ వాటాని కోల్పోయే ప్రమాద ఉంది. (ఎస్.ఆర్.సి. రిపోర్ట్ పేజి నెం. 105) విద్యారంగంలో తెలంగాణ వెనుకబాటు మరింత ఆంధ్ర ప్రాంత దోపిడీకి గురి అవుతుంది. (ఎస్.ఆర్.సి. రిపోర్ట్ పేజి నెం. 105) పై పరిశీలనలను గావిస్తూనే, ఫజల్ అలీ కమీషన్ ప్రత్యేక రాష్ట్రానికి సిఫారసు చేయడం జరిగింది. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విశాలాంధ్ర స్థాపన వాయిదా పడకూడదని, తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణకు, అభివృద్ధికి కావల్సిన హామీలు ఇవ్వాలని, ఆంధ్ర రాష్ట్ర శాసన సభలో తీర్మానం ఆమోదింపజేశారు. తద్వారా రక్షణలకు ప్రాతిపదిక ఏర్పడిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదు.

నాటి హైదరాబాద్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తన ప్రత్యేక రాష్ట్ర నిర్ణయాన్ని మార్చుకొని విశాలాంధ్ర ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేశారు. తద్వారా తెలంగాణ ప్రాంతంలో పెద్ద ఎత్తున అసంతృప్తి, నిరసనలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అధ్యయనం చేయడానికి ఎ.ఐ.సి.సి తరపున ఎస్.కె. పాటిల్ హైదరాబాద్ రావడం, 'తెలంగాణ ప్రజలు కోరనిదే విశాలాంధ్ర ఏర్పడదని' ప్రకటించడం జరిగింది. నాటి కేంద్ర హోంమంత్రి గోవింద్ వల్లభ్ పంత్ 'తెలంగాణ ప్రజలు సమ్మతిస్తేనే విశాలాంధ్ర స్థాపన జరుగుతుందని' పార్లమెంట్‌లో ప్రకటించారు.

ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విశాలాంధ్ర ఏర్పడటానికి ముందు అక్టోబర్ 17, 1953న విలేకరులతో మాట్లాడుతూ 'విశాలాంధ్ర నినాదం వెనుక దురాక్రమణ ఉద్దేశ్య ప్రేరిత సామ్రాజ్యవాదతత్వం గర్భితమై ఉందని' అభివర్ణించారు. ఈ వ్యాఖ్యానం ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురితమైంది.

తెలంగాణ రాష్ట్రంపై ఫజల్ అలీ కమీషన్, ఎస్.కె. పాటిల్ నివేదిక, గోవింద్ వల్లభ్ పంత్ ప్రకటన, ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ లాంటి ప్రముఖుల అభిప్రాయాలకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. పెద్ద మనుషుల ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రజలకు హామీలు ఇవ్వటం జరిగింది. 1) ఉమ్మడి ప్రణాళికలను ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలు, 2:1 నిష్పత్తిలో భరించాలి. మిగిలిన తెలంగాణ ప్రాంత ఆదాయాన్ని తెలంగాణ అభివృద్ధికి ఖర్చు పెట్టాలి. 2) తెలంగాణలో మద్యనిషేధం పై నిర్ణయం ఆ ప్రాంత శాసనసభ్యులదే. 3) తెలంగాణ ప్రాంతంలోని విద్యావసతులను ఆ ప్రాంతపు విద్యార్థులకే కేటాయించాలి. లేదా రాష్ట్రంలోని విద్యా సంస్థల సీట్లలో మూడోవంతు సీట్లను తెలంగాణ

విద్యార్థులకు కేటాయించాలి. ఈ రెండింటిలో తెలంగాణ ప్రాంతం వారికి ఏది అనుకూలమైతే వాటిని అమలుపర్చాలి. 4) విలీనీకరణ వలన అదనపు ఉద్యోగుల తొలగింపు తప్పనిసరి అయినప్పుడు రెండు ప్రాంతాల వారిని నిష్పత్తి ప్రకారం తొలగించాలి. జనాభా ప్రాతిపదికపై ఉద్యోగ నియామకాలు జరపాలి. 5) తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలను నిర్ణీత నిష్పత్తి ప్రకారం పొందడానికి ముల్కీ నిబంధన ఉండాలి (పదిహేను సంవత్సరాల నివాసం). 6) తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయ భూములను అమ్మటంకాని, కొనటం గాని ప్రాంతీయ మండలి అనుమతి లేకుండా జరగకూడదు. 7) తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రణాళికలో నీటి పారుదల, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగ వ్యవహారాల వంటి కీలక అంశాలు తెలంగాణ ప్రాంతీయ మండలి ఆధీనంలో ఉండాలి. 8) ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులు రెండు ప్రాంతాలకు ఉంటూ మంత్రి వర్గం 3:2 నిష్పత్తిలో ఉండాలి. ఈ ఒప్పందం 1956 జూలై 19న జరిగింది. ఉభయ రాష్ట్రాల మధ్యన జరిగిన ఈ ఒప్పందంలో ఆంధ్ర రాష్ట్రం నుండి ముఖ్యమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, మంత్రి గౌతులచ్చన్న, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రాజు, హైదరాబాద్ (తెలంగాణ రాష్ట్రం నుండి) ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మంత్రులు కె.వి. రంగారెడ్డి, ఎం. చెన్నారెడ్డి, హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు జె.వి. నర్సింగరావు సంతకాలు చేశారు.

దేశంలో ఉభయ రాష్ట్రాల మధ్యన, ముఖ్యమంత్రుల మధ్యన ఒప్పందం జరిగి విలీనమైన పరిస్థితి ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఈ ఒప్పందం హామీలు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినం నాడే, ఉప ముఖ్యమంత్రి పదవి తెలంగాణ వారికి నిరాకరించడం ద్వారా ఉల్లంఘన ప్రారంభమైంది. ఆ తరువాత జనవరి 19, 1969న అఖిలపక్షం ఒప్పందం, ఏప్రిల్ 11, 1969న అష్టసూత్ర పథకం, 1971లో ఐదు సూత్రాల పథకం, సెప్టెంబర్ 21, 1973న ఆరు సూత్రాల పథకం ద్వారా తెలంగాణ ప్రజలకు ఎన్ని హామీలు, ఒప్పందాలు జరిగినా యాభై సంవత్సరాల సమైక్యాంధ్రలో తెలంగాణ ప్రజలు మౌలిక హక్కులు కోల్పోవటమేగాక, వలస ప్రాంతంగా రూపుదిద్దుక్కుంది. అందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కారకులే. వివక్షతకు గురవుతున్నామని, పారిశ్రామిక, వ్యవసాయ, రాజకీయ రంగాలలో, విద్యా, వైద్య, ఉద్యోగ, నీటిపారుదల రంగాలలోను, తెలంగాణ ప్రజలు నష్టపోతున్నారని తెలంగాణ మెజార్టీ ప్రజలు భావిస్తున్నారు. సహజంగా అసంతృప్తి, అశాంతి నెలకొంటున్నది. విశాలాంధ్ర కొనసాగాలని కాంక్షించే వారు తెలంగాణ ప్రజల హక్కులు బలి అవుతున్న తీరును గమనంలోకి తీసుకోకపోవటం సమంజసమా? ప్రజల మనోభావాలను భాషా సెంటిమెంట్‌తో అగౌరవపర్చవల్సిందేనా? ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి.

అసంతృప్తి జ్వాలలు విస్తృతమవుతున్న నేపథ్యంలో, 1969-70 మధ్య తెలంగాణ ఉద్యమం విజృంభించింది. హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవటంతో సుమారు 370 మంది విద్యార్థులు, యువకులు బలి అయినారు. ఎన్నికలలో అత్యధిక స్థానాలు సాధించిన నాయకత్వ రాయితీలు సాధించుకొని, రాజీపడటంతో తెలంగాణ ఉద్యమం కనుమరుగైంది.

ఇటీవల కృష్ణా, గోదావరి జలాల వినియోగం పై తెలంగాణ ప్రాంతానికి లభించవల్సిన న్యాయమైన వాటా అందటం లేదని తెలంగాణ ప్రజలు భావించటం సహేతుకమే. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎడమ కాలువల నిర్మాణం, నీటి విషయంలో వాస్తవాలు వెలుగుచూశాయి. గోదావరి నీటి వినియోగంపై పాలకుల వివక్షత ప్రజలను ఆలోచింపచేస్తున్నది. వ్యవసాయ రంగంలో, ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం 2,82,382 హెక్టార్లు ఆంధ్ర ప్రాంతంలో సాగు పెరగగా, తెలంగాణలో 7,53,571 హెక్టార్ల సాగు భూమి తగ్గిపోయి వాస్తవికతను గమనించవచ్చు.

వాస్తవానికి స్వాతంత్ర్యం నాటికి పదిహేను రాష్ట్రాలుగా ఉన్న దేశం 25కు, ఇటీవల మూడు రాష్ట్రాల ఆవిర్భావం జరిగి, 28 రాష్ట్రాలకు పెరిగింది. అస్సాం రాష్ట్రం నుండి పలు రాష్ట్రాల నిర్మాణం జరిగాయి. పంజాబ్ నుండి హర్యానా, మహారాష్ట్ర నుండి గుజరాత్ విడివడి అభివృద్ధి పథంలో ఉన్న విషయాన్ని కాదనలేం.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సహితం గుర్ఖాల ప్రయోజనం కోసం స్వయం ప్రతిపత్తి గల గుర్ఖాల్యాండ్ నిర్మాణం జరిగింది. సర్కారియా కమిషన్ సహితం అధికారాల వికేంద్రీకరణకు సిఫార్సు చేసింది. రాష్ట్రాల పునర్విభజన ద్వారా కేంద్ర ప్రణాళికా సంఘం, కేంద్ర ఆర్థిక సంఘం, కేంద్ర ప్రభుత్వం ద్వారా సమకూరే నిధులు, ఆయా ప్రాంతాలు వినియోగించుకునే అవకాశం లభించడమే గాక, వనరుల సమీకరణ, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన పట్ల చొరవ ఏర్పడుతుంది. ప్రాంతాల ప్రయోజనాల ప్రాతిపదికగా ప్రాజెక్ట్‌ల నిర్మాణం ప్రాధాన్యతగా ఆలోచన పెరుగుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు రాజ్యాంగ బద్ధత కల్పిస్తుంది.

కొన్ని రాజకీయ పార్టీలు జమ్ము-కాశ్మీర్ ప్రజల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించబడిన ఆర్టికల్ 370ని సమర్థిస్తారు. కాని తెలంగాణ ప్రజలకు సంబంధించిన ఒప్పందాలను విస్మరిస్తారు. తెలంగాణ ప్రజల అంశం చర్చకు వచ్చినప్పుడు ఇతర ప్రాంతాల వెనుకబాటుతనాన్ని గుర్తు చేస్తూ, ప్యాకేజీల పేరుతో పాక్షిక ఉద్యమాలు గావించి మేమున్నామని ప్రచారం చేస్తారు. ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే తప్ప ప్రజా ప్రయోజనం లేదు. తెలంగాణ సమస్యను నీరు గార్చే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. 1985లో నాటి ముఖ్యమంత్రి తెలంగాణ ప్రాంతీయ అభివృద్ధి మండలిని రద్దు చేసి 610 జి.ఓ. జారీ చేసినప్పుడు శాసనసభలోపల వెలుపల నిరసనను ప్రకటించి ఉద్యమించిన పార్టీలు, రాష్ట్ర రాజకీయ రంగంలో ఉన్నాయా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. మన దేశం విభిన్న జాతులతో కూడుకున్నది. భాష ఒక్కటే ప్రాతిపదికగా చూడలేం. నాగా భాషమాట్లాడే ప్రజలు ఒకే రాష్ట్రంగా ఉండాలనే డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ, తెలుగు మాట్లాడేవారు ఒకే రాష్ట్రంగా ఉండాలనడం వాస్తవికతను అంగీకరించకపోవటమే. ప్రజల దైనందిన జీవిత కార్యకలాపాలు, సంస్కృతి, సాంఘిక, రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా భౌతిక దృక్పథంతో, వాస్తవాల ప్రాతిపదికగా పరిశీలించాలి. సమైక్యాంధ్ర కొనసాగింపు తెలుగు అనే సెంటిమెంట్ ప్రాతిపదికగా చూడలేని స్థితికి ఐదు దశాబ్దాల సుదీర్ఘకాల అనుభవం మన ముందున్నది.

ఫ్యూడల్ వ్యవస్థ వేళ్లూనుకొని ఉన్న తెలంగాణలో నేటికీ భూసమస్య ప్రధాన అంశంగానే ఉంది. జమీందారీ వ్యవస్థ రద్దయినా బినామి పేర్లతో భూకేంద్రీకరణ కొనసాగుతోంది. అత్యంత ప్రాముఖ్యత కల్గిన రెండు అంశాలు (1) యాభై సంవత్సరాల సుదీర్ఘ సమైక్య ఆంధ్రప్రదేశ్ అనుభవం – గుణపాఠాలు (2) తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు – పర్యవసానాలు.

ప్రత్యేక రాష్ట్ర ఆందోళన ప్రారంభమైన అనంతరం గత ఐదు సంవత్సరాలుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్ విముక్తి దినంగా ప్రకటించి, విజయ ఉత్సవాలు నిర్వహించాలనే డిమాండ్ పెరుగుతున్నది. కానీ ఏ ప్రభుత్వం కూడా అంగీకరించిన పరిస్థితి లేదు. వాస్తవానికి 1947 ఆగస్ట్ 15 నాటికే యావత్ భారతదేశం స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. కానీ, నిజాం స్వతంత్ర హైదరాబాద్‌ను ప్రకటించుకున్నాడు. నాటి కేంద్ర ప్రభుత్వం నిజాం నిర్ణయానికి భిన్నంగా సైనిక చర్య ప్రారంభించడం ఒకవైపు, అప్పటికే యావత్ తెలంగాణ రాష్ట్రంలో పునాది వర్గాలైన కష్టజీవులు ప్రజల నుండి నిజాం సర్కార్‌ను దూరం చేయటంలో మరోవైపు కమ్యూనిస్టు ఉద్యమం విజయం సాధించింది. ఈ క్రమంలోనే అనివార్య పరిస్థితులలో 1948 సెప్టెంబర్ 17న నిజాం లొంగిపోయాడు. హైదరాబాద్ రాష్ట్ర ప్రజానీకం హర్షాతిరేకంతో ఆహ్వానించింది. కానీ, 10 లక్షల ఎకరాల భూమి లేని పేదలు భూమి పొందటానికి కమ్యూనిస్టులు చేసిన త్యాగాన్ని హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు విస్మరించలేదు. భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల నుండి కమ్యూనిస్టు ఉద్యమం పంపిణీ చేసిన భూములు తిరిగి భూస్వామ్య వర్గాలు స్వాధీన పరచుకుంటాయనే ఆందోళన ఒకవైపు హైదరాబాద్ రాష్ట్ర ప్రజలలో వ్యక్తమైంది. ప్రజల భూముల పరిరక్షణకు ప్రభుత్వం నుండి తగు హామి లభించేంతవరకు కమ్యూనిస్టు ఉద్యమం భూస్వామ్య దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా 1951 వరకు పోరుబాట సాగించింది. తెలంగాణ ప్రాంతంలోని భూ సమస్యపై జరిగిన పోరాటం ఐదు సంవత్సరాలపాటు నిజాం ఫ్యూడల్‌కు వ్యతిరేకంగా, భూస్వామ్య దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా కొనసాగింది. ఈ చారిత్రాత్మక సత్యాన్ని వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టారు. భూ సమస్యను ప్రజల ఎజెండాలోకి చేరింది. దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూనే, భూస్వాముల కోటలకు బీటలు గావించడంలో తెభాగా పోరాటం, పునప్రావాయిలార్ పోరాటం, వర్లీ పోరాటాలు ప్రజలకు స్ఫూర్తినిచ్చాయి. భూ పంపిణీ, భూసంస్కరణలు, వెట్టి చాకిరీ నిర్మూలన, పౌర హక్కుల లాంటి విషయాలపై తెలంగాణ ఉద్యమం అనితర సాధ్యమైన విజయాలు సాధించింది.

'నీ కాల్లు మొక్కుతా బాంచెన్ దొర' అనే మాట నుండి తెలంగాణ విముక్తికి ప్రతినబూనిన తెలంగాణ ఉద్యమం చరితార్థమైంది. 1948 సెప్టెంబర్ 17 రాజకీయ బదలాయింపుతో, నిజాం ఫ్యూడల్ పీడన బద్దలైనా నాటి ఫ్యూడల్ విధానం నేటికీ తెలంగాణలో కొనసాగుతున్నది. ఒకవైపు వివక్షత మరొకవైపు ఉపాధిలేమితో కొట్టుమిట్టాడుతున్న తెలంగాణ ప్రజలకు ఫ్యూడల్ వ్యతిరేక పోరుబాట సాగించడానికి సెప్టెంబర్ 17 ప్రతినబూనే దీక్షా దినంగా మారాలి.

ఈ ప్రాతిపదికగానే నవంబర్ ఒకటి ఆంధ్రప్రదేశ్ అవతరణ నిష్పక్షపాతంగా సమీక్షించాలి. ఆలోచించాలి. గత యాభై సంవత్సరాలుగా పాలించి, పాలిస్తున్న ఏ పార్టీలూ భూసంస్కరణల అమలుకు పూనుకోలేదు. కోటి ఇరవై ఐదులక్షల మంది జానెడు భూమి లేని వ్యవసాయ కూలీలు ఉన్నప్పటికీ, ప్రజల మౌలిక సమస్య పరిష్కరించటంలో పాలకులు చొరవ చూపలేదు. దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, బంజర్లు, బినామీ, మిగులు భూములు 55 లక్షల ఎకరాలు ఉన్నప్పటికినీ భూసంస్కరణలు అమలు జరగలేదు. తెలంగాణలో దళితులు, ఆదివాసి, వెనుకబడిన వర్గాలు సామాజిక న్యాయానికి నేటికీ దూరంగా ఉండటం మనం గమనించవచ్చు. తెలంగాణలో అనేక పరిశ్రమలు స్థిరపడినా, అచిరకాలంలోనే కనుమరుగైనాయి. చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలు చాలావరకు మూతపడినాయి. ఉపాధిరంగంలో సహితం పరిశ్రమలలో స్థానికేతరుల ప్రాబల్యమే అధికంగా ఉండటం గమనార్హం. తిరిగి 2001 నుండి తెలంగాణ ఉద్యమం విస్తరిస్తున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆలోచన పెరగటమేగాక ఉద్యమ దృక్పథంతో ముందుకుపోతున్నది. ప్రజలు అడ్డంకులను అధిగమిస్తున్నారు. లక్ష్య సాధన వైపుగా సాగుతున్నారు. కాని ప్రచారాలతో, పడికట్టు పదాలతో, ఛాందస దృక్పథ ప్రభావంతో, తాత్కాలికంగా ఉద్యమం వాయిదాకు గురైనప్పటికీ అంతిమంగా తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్షదే విజయం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సమైక్యంగా కొనసాగాలంటే అభివృద్ధి మంత్రం సరిపోదు. 1956లో చేసుకున్న చారిత్రాత్మక పెద్దమనుషుల ఒప్పందాన్ని అమలు చేయాలి. 610 జిఓని నిర్ణీత సమయంలో అమలు చేయాలి. కృష్ణా, గోదావరి జలాలలో తెలంగాణ వాటా నిర్ణయించి, వినియోగించాలి. విద్య, ఉద్యోగ, పారిశ్రామిక రంగాలలో వివక్షతను తొలగించి, సమన్యాయాన్ని పాటించాలి. ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో తెలంగాణ వారికి రిజర్వేషన్ హామీ కల్పిస్తూ రాజ్యాంగాన్ని సవరించాలి. కోరేంత వరకూ తెలంగాణకిచ్చిన రక్షణలను కొనసాగించాలి. తెలంగాణ ఉద్యోగుల సాధక బాధకాలను పరిశీలించేందుకుగాను ప్రత్యేకంగా తెలంగాణకు అడిషనల్ చీఫ్ సెక్రటరీని నియమించాలి. తెలంగాణకు రక్షణలనేవే లేకపోయినట్లయితే 1956లో తెలుగు ప్రజలందరికీ ఏక రాష్ట్రం ఏర్పడేది కాదు. సమైక్య ఆంధ్రకు ప్రాతిపదికే లేదు. ♦

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీ ఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడం గాని వీలు కావడం లేదు.

ఉన్నత విద్యపై చిన్నచూపు

- కె. వెంకటనారాయణ

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి మనదేశంలో విద్యారంగం పరిమాణాత్మకంగా ఎన్నోరెట్లు విస్తరించింది. ఆనాడు ఉన్నత విద్యారంగంలో 20 విశ్వవిద్యాలయాలు ఉండగా 2005 నాటికి 357కు పెరిగాయి. ఇందులో 20 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 211 రాష్ట్రాల ద్వారా నిర్వహించబడే విశ్వవిద్యాలయాలు, 108 స్వయం ప్రతిపత్తిగల విశ్వవిద్యాలయాలు, 18 జాతీయస్థాయి సంస్థలు ఉన్నాయి. ఇదే కాలంలో ఉన్నత విద్యారంగంలో విద్యార్థుల సంఖ్య 2.3 లక్షల నుండి 104.8 లక్షలకు చేరింది. సంఖ్యాపరంగా ఉన్నత విద్యా వ్యవస్థ ఎంతో వృద్ధి సాధించినా ప్రమాణాల దృష్ట్యా ఆశించినంత స్థాయిలో పురోగతి సాధించలేకపోయామని భారత విశ్వవిద్యాలయాల సంఘం ప్రెసిడెంట్, భారతి విద్యాపీఠ్ విశ్వవిద్యాలయం పూణే, వైస్‌ఛాన్స్‌లర్ ప్రొ. ఎస్.ఎఫ్. పాటిల్ ఆందోళన వ్యక్తం చేసారు.

ఉన్నత విద్యారంగం అనేక రెట్లు విస్తరించినా దేశ సామాజిక-ఆర్థికాభివృద్ధికి అనువైన మానవ వనరులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో మన విశ్వవిద్యాలయాలు సఫలీకృతం కాలేదనే వాదన బలంగా ఉంది. మన దేశంలో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం చాలమటుకు పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి చేయబడేదే. మనం ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానంలో కేవలం 5-10 శాతం మాత్రమే స్వదేశీయం. మనదేశంలో కనుగొనబడిన సాంకేతిక పరిజ్ఞానం విదేశాలకు ఎగుమతి అయ్యేది అంతంత మాత్రమే. ఇన్ని విశ్వవిద్యాలయాలు ఉన్న మనదేశం నుండి నోబెల్ బహుమతి గ్రహీతలెందరు? అంతేగాక శాస్త్ర, సాంకేతిక రంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన శాస్త్రజ్ఞులు బహు కొద్దిమంది మాత్రమే అని చెప్పుకోవలసి వస్తుంది. కాని ప్రపంచంలోని ప్రతి ఆరుగురిలో భారతీయులు ఒకరు.

మనం ప్రగతి సాధించింది కేవలం ఐ.టి. రంగం. ప్రపంచంలోని మూడవ అతిపెద్ద సాంకేతిక నైపుణ్యంగల మానవ వనరులున్న దేశం మనది. అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ మొదలగు దేశాలలో లక్షలాదిమంది భారతీయ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. ఉన్నత విద్యారంగాన్ని నిశితంగా పరిశీలిస్తే విశ్వవిద్యాలయాల ద్వారా ఉత్తీర్ణులౌతున్న విద్యార్థులకు కావలసిన ఉద్యోగాలకు, పారిశ్రామిక, సేవారంగాలకు అవసరమైన మానవ వనరులకు ఎలాంటి పొంతన లేకుండా పోతున్నదని చెప్పకతప్పదు. పి.జి, డిగ్రీ కళాశాలలో అమలులో ఉన్న విద్యకు దేశ అవసరాలకు సంబంధం లేకుండా పోతున్నది. ప్రతి సంవత్సరం ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే 3-4 లక్షలమంది విద్యార్థులు మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో చేరుతారు. ఇందులో 5-6 శాతం మాత్రమే పి.జి. స్థాయికి వెళ్తారు. మిగిలిన యువతీ యువకులు ఉన్నత విద్యకు అవకాశం లభించక, తగిన ఉద్యోగం లభించక స్వంత గ్రామాలలో వ్యవసాయంలోగాని, వ్యవసాయేతర కార్యక్రమాల్లో శ్రమించలేక సమయాన్ని వృథా చేసుకోవడం జరుగుతుంది. ఈ పరిస్థితులను ఆసరాగా తీసుకొని స్థానిక రాజకీయ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిరుద్యోగులకు రకరకాల ఎరవేసి రాజకీయంగా ఉపయోగించుకొని తమ రాజకీయ పబ్బం గడుపుకోవడం సాధారణంగా జరుగుతున్నది.

ప్రపంచీకరణలో భాగంగా కార్పొరేట్ రంగంలో కొద్దిపాటి ఉపాధి అవకాశాలు లభించినా గ్రామీణ ప్రాంతాల్లో, చిన్నచిన్న పట్టణాలలో డిగ్రీ విద్యనభ్యసించిన యువతీ యువకులకు దక్కడం లేదు. కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూ మేనేజ్‌మెంట్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ సరిగా లేవని ఎంపిక చేయబడడంలేదు. ఇటీవల వరంగల్‌లో జాబ్ మేళా పేర ఆర్భాటంతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎనిమిది వేలకు పైగా డిగ్రీ, ఎం.సి.ఎ., ఎం.బి.ఎ. పూర్తిచేసిన విద్యార్థులు హాజరు కాగా కేవలం 72 మంది మాత్రమే ఎంపిక అయినట్లు సమాచారం. కార్పొరేట్ రంగం ప్రమాణాలకు తగినట్లు అభ్యర్థులు లభించడం లేదని కంపెనీల యాజమాన్యాలు అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు.

విశ్వవిద్యాలయాలు విద్య, పరిశోధనలు విస్తరించే స్థాయిలో ఆర్థిక వనరులు సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి. సిబ్బంది వేతనాలు అంతంత మాత్రమే సమకూర్చడానికి అంగీకరిస్తున్నాయి. విశ్వవిద్యాలయాలే స్వయంగా కొత్త కోర్సులు పెట్టి విద్యార్థుల నుండి వసూలు చేసుకొని వచ్చిన డబ్బుతో పరిశోధనలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవాలని- ప్రభుత్వాధికారులిచ్చే ఆదేశాలు శిరోధార్యంగా విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు పరిగణించి, విద్యార్థులపై మోయలేని భారాన్ని మోపి చేతులు దులుపుకొంటున్నారు. బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్ మొదలగు అనేక రాష్ట్రాలలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఆర్థిక వనరులు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయి.

విద్యా ప్రైవేటీకరణ వేగవంతం అయిన తర్వాత ప్రైవేట్ రంగంలో కార్పొరేట్ హంగులతో ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ విద్యా సంస్థలు అనేకం వచ్చాయి. ధనిక వర్గాల విద్యార్థులు ఈ సంస్థల్లో చదివి విదేశాలకు తరలి వెళ్తున్నారు. ప్రైవేట్ కళాశాలలోని ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, బి.ఇడి. కళాశాలల్లో ఏడాదికేడాది ఫీజులు పెంచడం జరుగుతోంది. మనదేశంలో అధికారులకు, రాజకీయ నాయకులకు ప్రైవేట్ సంస్థల యజమానులకు అవినాభావ సంబంధాలు ఉంటాయనేది వేరే చెప్పనక్కరలేదు. ఒకరి రూపంలో ఒకరు కన్పిస్తారు. అన్ని రూపాలు కలిసి ఒకటే రూపం. సాధారణంగా మెరిట్ సీటు ఫీజులు కట్టలేనివారు మన సమాజంలో ఇప్పటికే 60-70 శాతం ఉంటారు. అమలులో ఉన్న ఇరవై శాతం మేనేజ్‌మెంట్ సీట్లు కొనుక్కొనేవారు సమాజంలోని పై 30 శాతంలోనే ఉంటారు. అనధికారికంగా మెడికల్ సీటు రు. 30-50 లక్షలు, ఫార్మసీ 5-8 లక్షలు, ఇంజనీరింగ్ 2-5 లక్షలు, ఎం.బి.ఎ.,

ఎం.సి.ఎ. లు 1.5 లక్షలు, బి.ఇడి. 1.25 లక్షలు చెల్లించి చదువుకొనేవారు వీరే. గ్రామీణ కుటుంబాలలో కేవలం 1-2 శాతం కూడా ఈ కోవకు చెందినవారు ఉండరనేది అతిశయోక్తి కాదు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్ యాజమాన్యాలు, గెజిటెడ్ ఉద్యోగులు కొందరు, లంచగొండి అధికారులు, ఓ స్థాయి నుండి ఆ పై రాజకీయ నాయకులు, బడా వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, మద్యం వ్యాపారస్తులు మాత్రమే తమ పిల్లలు కార్పొరేట్ విద్య చదువు'కొనే' విధంగా వసతి కల్పిస్తున్నారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వెళ్లేవారు కూడా వీరే. దేశంలోని 70 శాతం కుటుంబాలకు కార్పొరేట్ విద్య అందని ద్రాక్షే. ఈ కోవకు చెందిన విద్యార్థులు అరకొర నిధులతో నిర్వహించే రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాల్లో, ప్రభుత్వ కళాశాల్లో, ప్రభుత్వ సహాయ కళాశాలలో ప్రవేశం తీసుకొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోగాని, విశ్వవిద్యాలయాల్లోగాని ప్రవేశం పొందే విద్యార్థుల్లో 90 శాతానికి పైగా బి.సి., ఎస్.సి., ఎస్.టి. వర్గాల విద్యార్థులే. రెవెన్యూ డివిజన్ స్థాయిలో సాధారణంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు అరకొర నిధులతో, అధ్యాపకులతో ఈడ్చుకపోతున్నాయి. సాధారణంగా ఈ సంస్థల్లో సైన్స్ అధ్యాపకుల కొరత ఉంటుంది. లైబ్రరీలు, ల్యాబ్‌లు, చాలినన్ని తరగతి గదులు మొదలగు వాని గురించి ఇక ఆలోచించవద్దు. ఫీజులు తక్కువగా ఉండటం, స్కాలర్‌షిప్పులు వస్తాయని ఆశించి పేదవర్గాల పిల్లలు ఈ కళాశాలలో చేరడానికి ముఖ్య కారణం. తాలూకా కేంద్రాలలో ఏర్పాటు చేయబడిన ప్రైవేట్ కాలేజీల మధ్య ఉన్న బహు పోటీతత్వానికి ఫీజులు విపరీతంగా తగ్గి ఈ సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం కేవలం ఈ కళాశాలలకు అనుమతులు ఇచ్చి విద్యాభివృద్ధి చేసినట్టే అని చేతులు దులుపుకుంటున్నది.

చాలీచాలని సౌకర్యాలు, అరకొర నిధులు, అధ్యాపకుల కొరత మొదలగు సమస్యలు ఎదుర్కొంటున్న కళాశాలల్లో ఉన్నత వర్గాల పిల్లలు చేరడం చాలా అరుదు. తెలంగాణలోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలోని ఒక విద్యాసంస్థలో 2005-06లో బి.ఎ., బి.కాం., బి.ఎస్సీ. మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థుల సామాజిక వివరాల్లోకి వెళితే ఈ విషయం మరింత స్పష్టం అవుతుంది.

విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ కళాశాలలో 93 శాతం పైగా బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నారు. క్రమంగా విశ్వవిద్యాలయాలు ఆర్థికంగా బలహీనమైన ఈ సంస్థలు కేవలం బలహీనవర్గాల వారికే మిగిలాయని ఈ గణాంకాలు తెలియపర్చుతున్నాయి. ఈ సంస్థల్లో నామమాత్రమైన ఫీజులు ఉండటం వలన పేద విద్యార్థులు ఆకర్షించబడుతున్నారు. ధనిక వర్గాల విద్యార్థులు

కోర్సు	ఒ.సి	బి.సి	ఎస్.సి	ఎస్.టి	మొత్తం
బి.ఎ.	15	137	168	47	367
బి.కాం.	20	138	62	23	243
బి.ఎస్సీ. (బి.జెడ్.సి)	18	107	56	20	201
బి.ఎస్సీ. (ఎం.పి.సి.)	21	128	45	13	207
మొత్తం	74	510	331	103	1018

కార్పొరేట్ రంగంలోని విద్యాసంస్థల్లో చేరుతున్నారు. అదే విధంగా నిరాదరణకు గురియైన ఈ విద్యాసంస్థలు విద్యార్థులకు ఉద్యోగ ఉపాధిని అందించే స్థాయికి ఎదగడం లేదు. ప్రపంచీకరణలోని అవకాశాలు అందిపుచ్చుకునే స్థాయిలో విద్యా వ్యాసంగం జరగడంలేదు. స్వంత వనరులు సమకూర్చుకొని అభివృద్ధి పర్చుకోవాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉపకులపతులకు హితోపదేశం చేస్తుంటారు. కాని మన ప్రభుత్వాలు ఈ విద్యాసంస్థలను ఆదరించలేనంత దీనస్థితికి పోలేదు. ప్రస్తుత పాలక పక్షాలకు విద్యాసంస్థల అభివృద్ధి లాభసాటిగా కన్పించటం లేదు. నీటి ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్స్, రింగ్‌రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, నాలుగులైన్ల రోడ్లు మన నాయకులకు తక్షణం ప్రయోజనాలు కల్గిస్తాయి.

విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ కళాశాలల్లో మూడింట ఒక వంతు అధ్యాపకులు కాంట్రాక్టు, పార్ట్‌టైం పద్ధతుల్లో పనిచేస్తున్నారు. ఏ భద్రతలేని ఈ అధ్యాపకులు పరిశోధనలు చేసేదెలా? రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో, ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు అధ్యాపకులు వయస్సు 30-50 సంవత్సరాల మధ్య ఉంటుంది. అనేక సంవత్సరాల నుండి ఉద్యోగంలో ఎదుగుబొదుగు లేకుండా, ఉద్యోగ భద్రతే లేకుండా పనిచేస్తున్నారు. ఈ అధ్యాపకుల వేతనాలు పదివేలకు మించకుండా ఉన్న పరిస్థితులలో బోధన, పరిశోధన వ్యాసంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి నిధులు తేవడంగాని విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడగలిగే వైస్ ఛాన్సలర్స్ కరువైపోతున్నారు. "హుజీ" క్యాటగిరీ పెరిగిపోయింది. వి.సి.లు కూడా రాజకీయ నాయకుల ప్రాపకంతో పాలకపక్షంలో ముఖ్యంగా ప్రధాన సామాజిక వర్గాల నుండి ఎంపికై రావడం ఇటీవలి పరిణామం. సమర్థతగాని, ఎకడమిక్ కెరీర్‌గాని, వ్యక్తిత్వంగాని ఎంపికకు కొలమానాలుగా తీసుకుంటే ఈ విశ్వవిద్యాలయాలు పూర్వ వైభవం కొనసాగించేవి. వి.సి.ల ఎంపికకు సెర్చ్ కమిటీలు సెర్చ్ చేసే బదులు ఈ పదవులు ఆశించిన అభ్యర్థులు సెర్చ్ కమిటీల వెంట సెర్చ్ చేస్తుంటే విశ్వవిద్యాలయాల గతి ఎలా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు. విశ్వవిద్యాలయాల పాలక మండళ్ల నియామకాలలో ప్రైవేట్ యాజమాన్యాలు సింహభాగం కైవసం చేసుకొంటున్నారు. రాజకీయ నాయకులు, ప్రైవేట్ యాజమాన్యాలు పాలక మండళ్లల్లో నిండినాక విశ్వవిద్యాలయాల మనుగడ ఏదిశలో పురోగమిస్తాయో ఆలోచించుకోవచ్చు.

రాష్ట్రంలోని మొత్తం 1723 డిగ్రీ కళాశాలలో కేవలం 179 ప్రభుత్వ యాజమాన్యంలో, 178 ప్రభుత్వ సహాయంతో పనిచేయగా మిగిలిన 1366 కళాశాలలు ప్రైవేట్‌రంగంలో నిర్వహించ బడుతున్నాయి. గత కొన్నేండ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నిర్వహణ బాధ్యతలు పూర్తి అదనపు బాధ్యత, ప్రిన్సిపాల్స్ పై మోపడం జరిగింది. నిర్వహణ, అభివృద్ధి నిర్ణయాలు తీసుకోవడంలో ఈ ప్రిన్సిపాల్స్ వెనుక ముందాడడం సహజం. అరకొర నిధులతో లైబ్రరీలు, ల్యాబ్‌లు నిర్వహించబడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పర్మిషన్స్ పొందిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేసుకోలేక, స్కాలర్‌షిప్స్ మంజూరుగాక నిత్యం అందోళనకు గురికావల్సి వస్తోంది. రాజకీయ వత్తిళ్లకు అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకోవడం జరుగుతున్నది. విశ్వవిద్యాలయాల బోధన - బోధనేతర సిబ్బందిలో చాలాభాగం ఈ ప్రైవేట్ కాలేజీల పర్మిషన్లు,

చదువు'కొనే' 'విశ్వ'విద్యాలయాలు

– ఆదెర్ల నాగేశ్వరరావు

ఉన్నత విద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు దూరం చేసే సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం పథకరచన చేస్తున్నది. ఉన్నత విద్యారంగంలో నూరుశాతం విదేశీ పెట్టుబడులను అనుమతించే అంశంలో కేంద్ర ప్రభుత్వం వైఖరి చివరి అంకానికి చేరుకుంది.

ప్రపంచంలో విశ్వవిద్యాలయాలు అధికంగా కలిగిన దేశాలలో భారత్‌ది రెండవ స్థానం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు సంవత్సరానికి ఐదు విశ్వవిద్యాలయాలు, 268 కళాశాలలు స్థాపించడం జరిగింది. అయినప్పటికీ భారతదేశంలో ఉన్నతవిద్యను పొందుతున్న వారి శాతం పదిహేడు నుండి ఇరవైమూడు శాతానికి పరిమితమైంది. అదే అభివృద్ధి చెందిన దేశాలలో ఇరవై నుండి యాభై శాతం వరకు ఉంది. ఇందుకు గల కారణం మనదేశంలో విద్యార్థులు ప్రాథమిక విద్యనుండి పురిటినొప్పులు పడుతూ, ప్రతి దశలో పద్మవ్యూహాలను ఛేదించలేక చతికిలపడే అభిమన్యులే.

ఉన్నత విద్యలో ఉన్న సమస్యల్లా సంఖ్యాత్మకం కాదు. అది ప్రమాణాల లోపం. దేశంలో ఉన్న ఉన్నతవిద్యా సంస్థల ప్రమాణాలను పరిశీలించి వాటికి వివిధ గ్రేడింగ్ విధానాల్ని కేటాయించడానికి యు.జి.సి 1994లో ఎన్.ఎ.ఎ.సి (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిషన్ కంట్రోల్ (నాక్))ను స్థాపించింది. కాని ఇప్పటి వరకు ఎన్.ఎ.ఎ.సి యంత్రాంగం 347 యూనివర్సిటీలలో 122 యూనివర్సిటీలను, 16,500 కళాశాలలో 2486 కళాశాలలను మాత్రమే పరిశీలించి గ్రేడింగ్ ఇచ్చింది. ఇది ఒక అంశం అయితే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాలలు ప్రమాణాలను గాలికి వదిలేయడం మరొక అంశం. 1997–98లో 1.35 లక్షల మంది విద్యార్థులు పట్టభద్రులుగా బయటకు వస్తే 2002–03లో 3.80 లక్షల మంది ఉత్తీర్ణులు అయ్యారు. కాని దేశంలో ఇంజనీర్ల సేవలు అవసరమైనవి సంవత్సరానికి 50,000లు మాత్రమే. మిగతావారికి సరైన పోస్టు గ్రాడ్యుయేషన్ విద్య అందడంలేదు. అందించే ప్రమాణాలు కూడా సరిగాలేవు. ఈ విధానాన్ని సరిదిద్దడానికి నాలెడ్జ్ కమీషన్ 1500 యూనివర్సిటీలు స్థాపించవల్సిన అవసరముందని నివేదికలు సమర్పించింది. ఇందుకు స్పందించని కేంద్ర ప్రభుత్వం నూరుశాతం విదేశీ పెట్టుబడులను ఉన్నతవిద్యలో అనుమతించేందుకు ఈ బడ్జెట్ సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తుంది. అయితే విద్యావ్యవస్థలో సమగ్ర సంస్కరణలకూ అభివృద్ధికీ చేపట్టే కార్యక్రమాలు సామాజిక అంతరాలను పెంచేవిగా ఉన్నాయి. ఇప్పటికే దేశంలో ప్రాథమికవిద్య, మాధ్యమికవిద్య ప్రైవేట్ మార్గం వైపు వడివడిగా నడుస్తున్నాయి. విద్యారంగంలో తీవ్రమైన సామాజిక అసమానతలు ఏర్పడ్డాయి. ఆర్థికంగా, సామాజికంగా బలహీనమైన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, వెనుకబడిన తరగతుల, అల్పసంఖ్యాక వర్గాల విద్యార్థులు చదువు'కొన'లేక పోతున్నారు. దేశంలో 2001 లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాలలో 3.1 శాతం, షెడ్యూల్డ్ తెగలలో 2.4 శాతం మంది మాత్రమే డిగ్రీల వరకు చదువుకుంటున్నారు. ఇందుకు గల కారణం భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో 0.37 శాతం నిధులను మాత్రమే ఉన్నతవిద్యకు ఖర్చు చేస్తున్నారు. డిగ్రీలు చదివిన వారిలో ఒక్క శాతం మాత్రమే పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరుతున్నారని గణాంకాలు ఘోషిస్తున్నాయి.

ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ సంస్కరణలు

- కొన్ని కళాశాలలను అలాగే వర్సిటీలుగా ఏర్పాటుచేయాలి.
- కొన్ని కళాశాలలను గ్రూపులుగా వర్సిటీలుగా ఏర్పాటు చేయాలి.
- నిరుద్యోగులను తయారు చేసే కళాశాలలను గుర్తించి వాటి ప్రమాణాలను పెంచి, అవసరమైతే నూతన ఉపాధి కల్పన కోర్సులను ఏర్పాటు చేయాలి.
- యూనివర్సిటీలే సొంత గ్రాడ్యుయేట్ కళాశాలలు నెలకొల్పే యంత్రాంగం రూపొందించాలి.
- ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లలో ప్రమాణాలు పెంపొందించేలాగా చర్యలు చేపట్టాలి.
- వర్సిటీలకు సొంత అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలలు స్థాపించుకొనే ఆర్థికసహాయాన్ని అందించాలి.
- కొన్ని కళాశాలలను ఎదగడానికి మార్గదర్శకాలను రూపొందించి ప్రోత్సహించి కొంతకాలం గడువు ఇవ్వాలి.
- హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచస్థాయి ప్రమాణాలుకల యూనివర్సిటీల శాఖలను మనదేశంలోకి అనుమతించాలి.

అకడమిక్ వ్యవహారాలు, పరీక్షల నిర్వహణ మొదలగు విధులకే పరిమితం కావడం విశేషం. ఇక బోధన, పరిశోధన, ఇంకా విశ్వవిద్యాలయం పరిపాలన కొరకు అదనపు అధ్యాపకులనుగాని బోధనేతర సిబ్బందిని గాని ప్రభుత్వం ఇవ్వడం లేదు. అందుచేత ప్రతి విశ్వవిద్యాలయంలో వందలాది మంది పార్ట్‌టైం అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది దినసరి వేతనాల పై పనిచేస్తున్నారు. దాదాపు 40–50 శాతం ఉద్యోగులు దినసరి వేతనం తీసుకొనేవారు ఉన్నారు. నిరాదరణతో, నిధుల కోతతో, సిబ్బంది కొరతతో కునారిల్లుతున్న విశ్వవిద్యాలయాలకు కావల్సిన వసతులు కల్పించడంలో పాలక పక్షాలు కర్తవ్యాన్ని నిర్వర్తించడం లేదని అమర్త్యసేన్ ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో జిల్లాకొక విశ్వవిద్యాలయం స్థాపిస్తామని ప్రభుత్వం ఆలోచించడం మంచిదే కాని ఈ మూలుగుతున్న విద్యాసంస్థలను కూడా పునరుద్ధరించి విద్యా – పరిశోధనలు సాగే విధంగా తీర్చిదిద్దకుంటే తాలూకాకొక విశ్వవిద్యాలయం ఇచ్చినా ఒరిగేదేమీ లేదు. గ్రామాల్లో వసతులులేని ప్రభుత్వ పాఠశాలల వలె, డాక్టర్లు మందులు లేని ప్రాథమిక వైద్యశాలల వలె మిగిలిపోతాయి కాని మానవ వనరుల అభివృద్ధికి దోహదపడవు. ♦

సామాజిక కార్యకర్తలకో చక్కని ఆయుధం సమాచార హక్కు చట్టం

- ఎల్. మల్లిక్

ఈ దేశ పౌరులుగా ప్రతి ఒక్కరికీ దేశ పరిపాలన, అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, విధానాలు, వాటి లబ్ధిదారులు, అమలు ఇలా ప్రతి ఒక్కదాని గూర్చి, ఏవో దేశ రక్షణ వ్యవహారాలకు సంబంధించిన సమాచారం తప్ప, మిగిలిన అన్ని సామాజిక, ఆర్థిక, రాజకీయ సమాచారాలను తెలుసుకొనే హక్కు ఉంది. అగ్గిపుల్ల దగ్గరి నుండి అంబాసిడర్ కారుదాకా ప్రతి వస్తువుపైనా పన్ను చెల్లిస్తున్న ఒక పౌరుడిగా, ఈ సొమ్ము ఎలా ఖర్చు అవుతుంది? ప్రజాభివృద్ధికి ఎంతవరకూ ఉపయోగపడుతుంది? అని తెలుసుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. అయితే గత యాభై ఏళ్లుగా మనం ఈ స్వతంత్ర భారతంలో ఏ ప్రభుత్వ అధికారిని, ఏ సమాచారం అడిగినా, వారి నుండి వచ్చే సమాధానం 'పిడుక్కి, బియ్యానికి ఒకే మంత్రం' అన్నట్లు ఇది 'రహస్య సమాచారం' (కాన్ఫిడెన్షియల్), మీకు ఇవ్వడానికి వీలు కాదనే. ఇంతకాలానికి సమాచార హక్కు చట్టం, అలాంటి సమాధానం చెప్పే అవకాశం అధికారులకు లేకుండా చేసి, దేన్నైనా ప్రశ్నించే హక్కును పౌరులకు కల్పించింది.

వివిధ సామాజిక సేవా సంఘాలు, ప్రగతిశీల కార్యకర్తలు, ప్రజాస్వామ్య వాదులు, మరెందరో మేధావులు ఎంతో కాలంగా జరిపిన కృషి ఫలితంగా ఎట్టకేలకు భారత చట్టసభ 2005లో సమాచార హక్కు చట్టాన్ని ఆమోదించింది. ఆగస్ట్ 12, 2005 నుండి అమలులోకి వచ్చింది. ఒక్క జమ్ము-కాశ్మీర్ మినహా దేశమంతా, ప్రభుత్వ సంస్థలన్నింటికీ (ఇంటిలిజెన్స్, భద్రతా సంస్థలకు తప్పించి) ఈ చట్టం వర్తిస్తుంది. దీని ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజలు ప్రశ్నించడానికీ, సమాచారం ఇమ్మని డిమాండు చేయడానికీ, వారి ఫైళ్లను తనిఖీ చేయడానికి, ప్రభుత్వ డాక్యుమెంట్ల (డిస్క్‌లు, ఫ్లాపీలు, టేపులు, వీడియో క్యాసెట్లు, ఇతర ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సమాచారం కూడా) నకళ్లు తీసుకోవడానికి, చివరకు ప్రభుత్వ పనులను చెకింగ్ చేయడానికి కూడా హక్కుంది. ఉదాహరణకు పరిశ్రమల స్థాపనకు ప్రజల వ్యవసాయ భూములను ఎందుకు తీసుకొంటున్నారు? హోటళ్ల నిర్మాణం కొరకు కోస్తా తీరాన్ని ఎందుకు ఆక్రమిస్తున్నారు? దగ్గర నుండి స్థానిక రోడ్లు ఇంత అధ్వాన్న స్థితిలో ఎందుకు ఉన్నాయి? కుళాయి ఎండిపోవడానికి కారణం ఏమిటి? ఆసుపత్రులలో మందులు ఎందుకులేవు? ప్రజల ఆకలి చావులకు కారణాలు ఏమిటి? ప్రభుత్వ గృహ పథకంలో లబ్ధిదారులు ఎవరు? ఏ ప్రాతిపదికన ఎంపిక చేసారు? ఎంత నిధులు ఖర్చు అయ్యాయి? ఇలాంటి విషయాలు అనేకం నేడు ప్రజలు ప్రశ్నించవచ్చు.

- ❖ నిబంధనలకు అనుగుణంగా స్థాపించే యూనివర్సిటీలకు అనుమతులివ్వాలి.
- ❖ కులపతుల నియామకాలలో రాజకీయ జోక్యాన్ని తొలగించాలి.
- ❖ అధ్యాపకుల, ప్రొఫెసర్ల నియామకంలో స్థానికులనే నియమించాలనే సంస్కృతి తొలగించాలి, విదేశీయులకు ప్రధాన్యమివ్వాలి.

ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. అందుకు విద్యారంగం మినహాయింపుకాదు. కాని భారతదేశంలో విద్య సామాజిక సమస్యలతో సంబంధం కలిగిన విషయం కావున గోరుచుట్టుపై రోకలిపోటులా కాకుండా సంస్కరణల అమలులో ఆచితూచి అడుగులు ముందుకు వేయాలి. ఉపాధి కల్పన పరంగా అభిలషణీయమైన దశకు చేరుకున్నాకే అభివృద్ధి చెందిన దేశాలు విదేశీ ప్రైవేట్ సంస్థలకు అనుమతులు ఇచ్చాయి. దీని ద్వారా మంచి పోటీ వాతావరణం ఏర్పడి మంచి గుణాత్మక విద్య పెంపొందే అవకాశం ఏర్పడింది. కాని నేడు భారతదేశంలో పరిస్థితులు దీనికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. జనాభా విషయంలో భారత్‌తో సారూప్యత కలిగిన చైనా విదేశీ యూనివర్సిటీల ప్రవేశాన్ని అనుమతించినప్పటికీ వాటి నియంత్రణకు, సమగ్రమైన నిర్వహణకు 2003లో ఒక ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. అదే విధంగా బ్రిటన్, అమెరికా, మలేషియా, సింగపూర్‌వంటి దేశాలు కూడా కొన్ని ఆంక్షలు, నియంత్రణ విధానాలు రూపొందించుకున్నాయి. వాటి ప్రకారం విదేశీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను దేశంలో అనుమతించేముందు అనుసరించాల్సిన మార్గదర్శకాలు :

- ❖ మన దేశంలో ప్రవేశించే విదేశీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఇక్కడి విద్యాసంస్థలతో కానీ విశ్వవిద్యాలయాలతో కానీ భాగస్వామ్యం ఏర్పరుచుకోవాలి.
- ❖ విద్యను ఒక వాణిజ్య మాధ్యమంగా లాభార్జనే ధ్యేయంగా నెలకొల్పే విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతులు నిరాకరించాలి.
- ❖ విదేశీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పాలకమండలిలో యాభై ఒక్క శాతం సభ్యులు మనదేశ పౌరులై ఉండాలి.
- ❖ విద్యా సంస్థల అధ్యక్షులు మనదేశ పౌరులై ఉండాలి.
- ❖ బోధనభాషగా ఆంగ్లమాధ్యమాన్ని, అవసరమైన విషయాలలో మాతృభాషకు ప్రధాన్యతను ఇవ్వాలి.
- ❖ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ట్యూషన్ ఫీజులు పెంచటానికి వీలు కల్పించరాదు.
- ❖ విదేశీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ప్రమాణాల పర్యవేక్షణకు ఒక స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలి.

నాణ్యతో కూడిన సంఖ్య కూడా ప్రధానమనే విషయాన్ని గ్రహించి ఉన్నత విద్యకు ఉజ్వల భవిష్యత్తును అందించాలి. అంతేకాని ఉన్నత విద్యా రంగంలో నూరుశాతం పెట్టుబడుల అనుమతే సర్వరోగ నివారిణి అని భావించరాదు. అందుకే చదువు'కొనే' విద్యా సంస్కరణలు కాకుండా చదువుకునే విద్యా సంస్కరణలు ఉన్నతవిద్యకు అవసరం. ♦

చట్టం అమలులోకి వచ్చిన 120 రోజుల లోపు ప్రభుత్వ సంస్థలు, ఆ సంస్థ వివరాలు, విధులు, బాధ్యతలు, అధికారులు, వారి బాధ్యతలు, నిర్ణయ విధానం, పర్యవేక్షణ, నియమాలు, సంస్థలోని రికార్డులు, పత్రాలు, నిర్వహణా కమిటీలు, సమావేశాలు, ప్రజల భాగస్వామ్యానికి గల అవకాశం, ప్రణాళికలు, ఖర్చులు, పౌరసమాచార అధికార్ల జాబితా మొదలైన అంశాలన్నింటినీ ప్రచురించాలి. చట్టంలోని సెక్షన్ 8లో పేర్కొన్న దేశ భద్రతా వ్యవహారాలకు సంబంధించిన సమాచారం మినహా, మిగిలిన సమాచారం అంతా ప్రజలకు ఇవ్వాలి. ఈ చట్టం కింద ప్రభుత్వ సంస్థలన్నీ తమ ప్రతి ఒక్క పరిపాలక యూనిట్ లోనూ ప్రజా సమాచార అధికారి (పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్) ని నియమించాలి. దరఖాస్తు, సమాచార వివరాలు ఇంగ్లీష్, హిందీలేక ప్రాంతీయ అధికార భాషలో లిఖితం, ఎలక్ట్రానిక్ మీడియాలలో కూడా ఉండవచ్చు.

ఈ చట్టం ప్రకారం పౌరులెవరైనా సమాచారం కోరితే? సంబంధిత అధికారి దరఖాస్తు అందిన ముప్పై రోజుల లోపు, దీనిలో మూడవ పార్టీ ప్రయోజనాలు ఇమిడి ఉన్నప్పుడు నలభై రోజుల లోపు తప్పనిసరిగా సమాచారాన్ని ఇవ్వాలి. (నిర్ణీత రుసుం వసూలు చేయవచ్చు) సమాచారం వ్యక్తి జీవన్మరణ సమస్యకు సంబంధించిన దైనప్పుడు నలభై ఎనిమిది గంటలలోపే సమాచారాన్ని ఇవ్వాలి. లేదా ఏ కారణం చేత సమాచారం ఇవ్వడం లేదో తెలియజేయాలి. దీనిపై అప్పీలుకు గడువు, అప్పీలు అధికారి వివరాలను కూడా తెలియజేయాలి. ఇలా సమాచారం పొందలేని పక్షంలో ఫిర్యాది ముప్పై రోజుల లోపు అదే సంస్థలోని ప్రజా సమాచార అధికారి పై హోదాకు ఫిర్యాదు చెయ్యవచ్చు. అక్కడ కూడా ఫలితం లేనప్పుడు రెండవ స్థాయిలో తొంభై రోజుల లోపల రాష్ట్ర జాతీయ సమాచార కమీషన్‌కు అప్పీలు చేయవచ్చు. తాను సమాచారం ఇవ్వకపోవడం, న్యాయబద్ధమైనదేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత ప్రజా సమాచార అధికారిదే. చట్టంను ఉల్లంఘించిన అధికారికి రోజుకు రు. 250 చొప్పున రు. 25,000 వరకు జరిమానాను కేంద్ర రాష్ట్ర సమాచార కమీషన్ విధించవచ్చు.

భారత పార్లమెంట్ ఆమోదించిన ఎంతో ప్రగతిశీల చట్టాలలో ఇది ముఖ్యమైంది. 'పరిపాలనలో పారదర్శకత విషయంలో సమాచార హక్కు చట్టం ఒక మంచి ముందడుగు' అని మన రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాం, ఈ ఏడాది గణతంత్ర వేడుకల సందర్భంగా జనవరి 25న జరిగిన ఒక సమావేశంలో పేర్కొన్నారు. ఇది ఇతర అన్ని సామాజిక సంక్షేమ చట్టాలు, కార్యక్రమాలు, పథకాలను శక్తివంతం చేస్తుంది. పైగా ఇది దేశంలోని ఏదో ఒక వర్గానికి కాకుండా, అన్ని రకాల వర్గాల ప్రజలకు ప్రయోజనాన్ని సమకూర్చుతుంది. ఇంతటి శక్తివంతమైన చట్టాన్ని ప్రజలు ముఖ్యంగా అన్ని సామాజిక సేవా సంస్థలు, కార్యకర్తలు సమర్థవంతంగా ఉపయోగించుకోవలసి ఉంది. ఎన్నో రకాల సమస్యల పరిష్కారానికి ఇది ఒక చక్కని సాధనం. వీరికి ఇది పనికి వస్తుంది. ఉదాహరణకు ఒక ప్రాంతంలో ఒక పర్యాటక రంగాన్నే తీసుకొంటే, దాని వల్ల స్థానిక ప్రజలకు ఒనగూరే ప్రయోజనం, నష్టాలు, పర్యావరణపరంగా వచ్చే మార్పులు మొదలైన వాటి గూర్చి తెలుసుకొని ప్రజలను చైతన్యం చేయవచ్చు.

- ఈ జిల్లాలో ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టులు ఏమిటి?
- ఈ ప్రాజెక్ట్‌ల కింద ఖర్చు చేసే నిధుల వివరాలు?
- టూరిజం ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్రానికి గల మార్గదర్శక సూత్రాలు ఏమిటి? ఇవి అసెంబ్లీలో చర్చించబడి, ఆమోదింప బడ్డాయా, ఆమోదింపబడితే, గజిట్ నోటింగ్స్ రిఫరెన్స్ ఏది?
- ఆమోదించపోతే, ఏ ఆధారం మీద ఈ ప్రాజెక్ట్‌లు అమలు అవుతున్నాయి?
- దీనిలో ఎంత భూమి ఆక్రమింపబడుతుంది? నిర్వాసితులకు ఇచ్చే పునరావాస, నష్టపరిహార వివరాలను తెలపండి?

ఈ విధంగా ప్రాజెక్టులకు సంబంధించిన రుణాల మంజూరు, లబ్దిదారుల ఎంపిక, రేషన్ డిపోల పనితీరు, పనికి ఆహార పథకం అమలు దేని గురించి అయినా కార్యకర్తలు, ప్రజలు నేడు వాస్తవాలను తెలుసుకోవచ్చు.

అయితే విచారింపదగినది ఏమంటే 'పుస్తకంలోని చదువు అక్కరకురాదు' అని ఇది కాగితాలకే పరిమితం అయ్యింది. చట్టం వచ్చి ఇప్పటికి ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకూ ప్రజల సంగతి అటుంచితే, చాలామంది గ్రూప్ 1 స్థాయి అధికార్లకు కూడా ఈ చట్టం పై ఒక మంచి అవగాహన రాలేదు. ప్రభుత్వ అధికారులను, సామాన్యునికి జవాబుదారీని చెయ్యడానికిగాను ఒక మహారాష్ట్రలో మాత్రం కొన్ని ప్రజా సంస్థలు దాదాపుగా 20,000 దరఖాస్తులను పౌరులచే సంవత్సర కాలంలో పెట్టించగలిగాయని ఒక అంచనా. మన రాష్ట్రం సంగతి అంత స్పష్టంగా ఏమీ తెలియదు. ప్రజల సంగతి ఎలా ఉన్నా ఈ చట్టం వచ్చిన దగ్గిర నుండే చాలా మంది అధికార్లలో అసంతృప్తి, ఆందోళన చెలరేగాయి. కొన్ని ప్రభుత్వ శాఖలు, ఉద్యోగ సంఘాలైతే, తాము ఈ సమాచారం ఇవ్వలేమని, తమను మాత్రం ఈ చట్టం నుండి మినహాయించాలని బాహటంగానే ప్రకటించాయి.

'పెరటి చెట్టు బెట్టి పరికింపకుండెనా వెలుగుదాటి తీగ వెళ్లిపోవు' అన్న వేమన సూక్తిని మది నిల్పి గత కృషికి ఫలితం ఉండాలంటే, ప్రజలు, ముఖ్యంగా సామాజిక కార్యకర్తలు, సంస్థలు, ఇతర సంఘశ్రేయోభిలాషులు ప్రధానంగా దృష్టి పెట్టాలి. ఎందుకంటే వివిధ రకాల ఒత్తిడుల కారణంగానైతేనేమి, మరొకటైతేనేమి ఈ చట్టానికి కొన్ని సవరణలు చేయాలన్న ప్రతిపాదనలు ముందుకొస్తున్నాయి. చట్టాన్ని మరింత పదును పెట్టడానికీ, పటిష్ఠం చేయడానికే ఈ సవరణలని ప్రభుత్వం చెబుతుండగా, చట్టాన్ని నిర్వీర్యం చెయ్యడానికే సవరణ తప్ప, మరొకటి కాదనేది ఎందరో సామాజికవేత్తలు, ప్రజా సంస్థల వాదన.

అయితే ఈ ప్రతిపాదిత సవరణలలో ముఖ్యమైనవి కొన్నింటిని పరిశీలిస్తే విషయం కొంత విదితం అవుతుంది. దీనిలో మొదటిది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సామాజికాంశాలపై రూపొందించిన ప్రణాళికలు, పథకాల విషయంలో తప్ప, మిగిలిన వాటి విషయంలో 'ఫైల్ నోటింగ్స్'ను చట్టం నుండి మినహాయించడం (సెక్షన్ 2(1)(డి)). వీటి విషయంలో 'సంతృప్తికరమైన' ఫైల్ నోటింగ్స్‌ను మాత్రమే ఇస్తాం అనడం. అయితే ఎక్కడా 'సంతృప్తికరమైన' అంటే ఏమిటో నిర్వచించకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. రేపు వారికి ఇబ్బంది కలిగే వేటినైనా దీని కిందకి తేవచ్చు కదా! అనేది సంశయం.

రెండవది మంత్రిమండలి నిర్ణయాలు తీసుకోవడానికి ఆధారమైన పత్రాలను సమాచార హక్కు చట్టం నుండి తప్పించడం. ఆధారాలను

పరిశోధన అవసరమైన మీడియా

– నాగసూరి వేణుగోపాల్

తెలుగు జర్నలిజం పరిణామక్రమంలో 2006 నవంబర్ 6 ఒక కీలకమైన తేదీగా గుర్తుండిపోతుందా?

ఇటీవల తన ఆర్థిక సంస్థపై విమర్శలకు వివరణ ఇస్తూ చెరుకూరి రామోజీరావు ఒక విషయం చెప్పారు. అదేమంటే – ఈ విమర్శల కన్నింటికీ సమాధానాలు చెబుతూ ఒక పుస్తకం ప్రచురిస్తున్నట్టు. చాలామంది ఈ విషయాన్ని గమనించి ఉండవచ్చు. రేపు ఆ పుస్తకం వెలువడవచ్చు, లేదా వెలువడకపోవచ్చు. కానీ రాష్ట్రంలో చాలా ఎక్కువప్రతులు అమ్ముడుపోయే పత్రికా యజమాని, తెలుగులో రెండు టీవీ ఛానెళ్లు కలిగి ఉన్న అదే అధిపతి – ఎందుకు పుస్తకం ప్రచురించాలని భావిస్తున్నారు? అంటే పత్రిక ద్వారా, ఛానెళ్ల ద్వారా చెప్పలేని అంశాలు పుస్తకంలో వస్తాయా? లేక పత్రికకంటే, ఛానెళ్లకంటే ఎక్కువమందిని పుస్తకం చేరుతుందా? ఈ విషయం యొక్క సైద్ధాంతిక పార్శ్వం వేరుగా ఉండవచ్చు లేదా ఎవరి అనుభవాలు వారికి వేరుగా అనిపించవచ్చు. ఈ మీమాంస కూడా మనకు అవసరం లేదు. కానీ ఆయనకే పుస్తకం ప్రచురించాలనే ఆలోచన కల్గిందే, అదే ప్రధానం! అటువంటి పరిస్థితికి దారి తీసిన కారణాలు మరీ ముఖ్యం.

ఆయువుపట్టులాంటి అంశాన్ని అరుణ్‌కుమార్ పట్టుకున్నారని ఎంతో మంది భావిస్తున్నారు. కానీ ఇది కొత్త విషయం కాదు. ప్రచారంతో వచ్చిన ప్రతిష్ఠతో విషయం మరుగున పడిపోయింది. కానీ, కొంచెం గుర్తున్నవారికి ఇది తెలియని విషయం కాదు. ముఖ్యమంత్రిగా నాదెండ్ల భాస్కరరావు నెల రోజులు ఉన్న కాలం గుర్తుకు తెచ్చుకోండి. ముప్ఫై రోజులు మార్గదర్శికి సంబంధించి చాలా వార్తలు వచ్చాయి. ఆర్థిక సంస్థలోని అవకతవకలు విమర్శించబడ్డాయి. ఈ విషయం గుర్తున్న వారు మరిన్ని విషయాలు చెప్పగలరు.

రెండు టోపీలు ధరించి రామోజీరావు తిరుగుతున్నారని న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. నిజానికి ఈ అంశంలోని వివరాలు పరిశీలిస్తే వర్తమాన సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే మీడియా, వాణిజ్యం, రాజకీయాల వాస్తవ రూపాలు దర్శనమిస్తాయి. ఇది కేవలం తెలుగు మీడియాకు సంబంధించిన అంశంగానే పరిగణించనక్కర లేదు. ఎందుకంటే ఇటువంటి సంఘటన మన దేశంలో ఇంతవరకు ఏ ఇతర భాషలో కూడా సంభవించలేదు. రకరకాల స్వరూపాలతో సాగిపోయే మీడియాకు సంబంధించిన సంక్లిష్టతత్వాన్ని అవగతం చేసుకోవడానికి ఇది మంచి పరిశోధనాంశం. అంతకుమించి మీడియాతోపాటు, దానితో సంబంధంగల ఇతర రంగాల నగ్న స్వరూపం కూడా ఇక్కడ తేటతెల్లం అవుతుంది. మీడియా అంటే గౌరవం గానీ, నమ్మకం గానీ, భయం గానీ ఉన్న వ్యక్తులు దీని ద్వారా చాలా విషయాలు తెలుసుకోవచ్చు. అలాగే మీడియాలో ఏమి జరుగుతోందనే విషయాన్ని ఆకళింపు చేసుకోవచ్చు. ఇది మరింత పారదర్శకతయే కదా. ప్రపంచంలోని అన్ని విషయాల గురించి పూసగుచ్చినట్టు చెప్పే మీడియా మాత్రం తన అసలు స్వరూపం గురించి తన పాఠకులకూ, వీక్షకులకూ తెలియనివ్వడం లేదనే విమర్శ ఉంది. ఈ రకంగా కూడా కొంత సమాచారం ఇచ్చినట్టు అవుతుంది.

2006 నవంబర్ 6 తర్వాత అసలు విషయం కాకుండా మూడు చిన్న విషయాలు కూడా ఉన్నాయి. 'యాహూ' కార్యక్రమం నకిలీ వజ్రాల గురించిన కేసు న్యాయస్థానం బయట పరిష్కారమైందని వార్తలు రావడం, విశాఖపట్నంలోని ఆ సంస్థ అద్దెకు ఉండే భవనం యజమాని విధిలేక వేలు ఖర్చు పెట్టి మరో ప్రకటన ఇచ్చి తన బాధ ప్రపంచానికి తెలియజేయడం. తమ సంస్థ ఛానల్‌లో, తమ సంస్థ నిర్మించిన సినిమాలు

చూపమన్నప్పుడు, నిర్ణయాలు సరియైనవని ఎలా నమ్మగలం అన్నది పలు ప్రజా సంఘాల వాదన. ఫైల్ నోటింగ్స్ రాసిన వారిని గోప్యంగా ఉంచాలని, చట్టంనుండి పరీక్షలకు, నియామకాలకు, పదోన్నతులకు సంబంధించిన సమాచారంను మినహాయించాలని కూడా ఈ సవరణలలో ఉంది. అదే జరిగితే, సాధారణంగా ఈ వ్యవహారాల్లో జరిగే రాజకీయ బాగోతాలు, అవినీతి, అమ్యామ్యాలు బయటపడే అవకాశమే శాశ్వతంగా పోతుందనేది, అందువల్ల ఇది జరగరాదనేది చాలా మంది విజ్ఞుల అభిప్రాయం.

ఏదైనా ఒక విధానం/నిర్ణయం ఇంకా రూపొందించే క్రమంలోనే ఉన్నప్పుడు తీసుకొనే న్యాయసలహాలు, అభిప్రాయాలు, సూచనలు లాంటివి కూడా ఈ చట్టం నుండి తప్పించాలని మరో సవరణ. మన దేశంలో కొన్నిసార్లు ఒక్కో నిర్ణయానికి పదుల సంవత్సరాల కాలం గడిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. అలాంటప్పుడు అంతకాలం ప్రజలకు ఈ సమాచారం అందకపోవడం అన్యాయం. ఆఖరిది చాలా ముఖ్యమైనది 'కేంద్ర రాష్ట్ర కమీషన్' స్వతంత్ర ప్రతిపత్తిని తొలగించడం. ఇప్పుడున్న చట్టం ప్రకారం 'కమీషన్' నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే పోవలసింది నేరుగా సుప్రీంకోర్టు/హైకోర్టులకే. అయితే ఈ సవరణ ద్వారా అంతిమ నిర్ణయం మరలా ప్రభుత్వాలదే అవుతుంది. అంటే చట్టం 'కరి మింగిన వెలగపండు' సామెతకే వస్తుంది కదా! ఇది ఎంతవరకూ సమంజసం అన్నది ఇక్కడ చర్చనీయాంశం.

చట్టం పై ఇప్పుడిప్పుడే అవగాహన కల్గుతూ, దీని అమలుకు సంబంధించిన ఏర్పాట్లు యంత్రాంగాలు ఇంకా రూపు దాల్చుకుంటున్న దశలోనే, లక్ష్యం నీరుకారకుండా చూడవలసిన బాధ్యత ఉంది. ప్రస్తుతం చట్టం కల్పించిన అవకాశాన్ని నేర్పుగా ఉపయోగించుకోవల్సిన ఆవశ్యకత మనకెంతో ఉంది. సామాజిక కార్యకర్తలు, మానవహక్కుల పరిరక్షణావాదులకు ఈ చట్టం ఒక మంచి ఆయుధం కావాలి. ♦

ప్రచారం చేసిన విషయం సంబంధించి పన్ను కట్టమని కోర్టు కూడా ఆదేశించడం – అనేవి స్వరూప, స్వభావాల విస్తృతిని పట్టి చూపుతాయి.

ఆ సంస్థ చెప్పిన విషయాలకూ, తర్వాత తన పత్రికలోనే వాటినే విబేధించుకుంటూ చాలా వివరమైన, అదే సమయంలో అస్పష్టమైన వార్తలు దర్పణంగానే నిలుస్తాయి. ఈ విషయంలో వారి పత్రికలే సూక్ష్మంగా పరిశీలిస్తే చాలా అంశాలు లోతుగా బోధపడతాయి. సంఘటన తర్వాత వివరంగా విశ్లేషించే వారు – సంఘటన ముందస్తు వ్యూహం విషయంలో ఎలా బోల్తాపడతారో కూడా సులువుగా అర్థమవుతుంది.

ప్రజాభిప్రాయాన్ని పదే పదే చెప్పేవారికి దానిమీద అసలు గౌరవం ఉందా? అనే సందేహం కూడా కలిగే అవకాశం ఉంది. ఇది ఒక సంస్థ, ఒక వ్యక్తి, ఒక పార్టీ అని కాకుండా సర్వత్రా విశ్వరూపం ధరించి ఉందా – అనిపిస్తోంది. అదే సమయంలో కింగ్‌మేకర్లు కింగ్‌లుగా రాణించడం అంత సులువు కాదని కూడా బోధపడుతుంది. అయినా తమకు ప్రచారం తెచ్చిపెట్టగల వారి కోసం పాలు నల్లగా ఉంటాయని ఖరాఖండిగా చెబుతున్న అభిప్రాయ నాయకులు, రాజకీయ నాయకుల గురించి విషాదం కలుగుతోంది. ప్రజాభిప్రాయం అవసరమైన జర్నలిజం, వాణిజ్యం, రాజకీయం సమ్మిళతమై ఆలోచనాపరులకు విపరీతమైన అందోళనను కల్గిస్తున్నాయి.

ప్రతులు బాగా అమ్ముడుపోయే పత్రిక కే పలు టీవీ ఛానళ్లుండే పరిస్థితి మొదట తెరలేపింది ఆంధ్రప్రదేశ్ నుండే. రాష్ట్ర స్థాయినుంచి కేంద్రస్థాయి దాకా అన్ని రకాల పార్టీల నాయకులు ఒకే రకంగా మాట్లాడడం మీడియా అవసరం వల్లనే. నేడు అటువంటి సంస్థల సంఖ్య క్రమంగా పెరగడం ప్రధాన పోకడ. మరి రేపు ఇంకెటువంటి పరిస్థితికి ద్వారాలు తీయగలరని ఎవరూ ఉహించలేక పోతున్నారు. సమాజానికి నియమాలు బోధించే వారు తమ అవసరాలకోసం ఎలా మాటల మాయజాలం వినియోగించుకోగలరో మాత్రం సూచనప్రాయంగా అవగతమవుతోంది.

జాతీయ స్థాయి పత్రికల, ఛానెళ్ల మౌనం ఒక వ్యూహం కాగా, రెండు ఆంగ్ల పత్రికల, ముగ్గురు సంపాదక ప్రముఖుల ధోరణులు మరో వ్యూహంలో భాగం. స్వీయబాధను ఎంత బలవత్తరంగా ప్రపంచ స్థాయి బాధగా లేదా జాతీయ స్థాయి సమస్యగా రూపొందించగలరో ఇక్కడ అర్థం చేసుకోవచ్చు. వాణిజ్య అవసరాలకు జర్నలిజం, రాజకీయం ఎలా ఒదిగిపోతున్నాయో తెలవడమే ఆశ్చర్యం కల్గిస్తోంది. చాలా మంది సంపాదక ప్రముఖుల మౌనం ఎదుటి వారి బుర్రలకు పదును పెడుతోంది.

ఈ నేపథ్యంలో తెలుగు మీడియాను అభినందించాలి. ఎంత విస్తృతి ఉంటే వాస్తవం అంతగా బహిర్గతమవుతుంది. వైవిధ్యం అవసరమని తేటతెల్లం అవుతోంది. ఆంధ్రజ్యోతి, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, హిందూ, క్రానికల్, ఎక్స్‌ప్రెస్ పత్రికల తీరు చూస్తే చాలా ఆసక్తి కలుగుతోంది. వారికి ఉన్న రకరకాల పరిమితులు కూడా తేటతెల్లం అవుతున్నాయి. అలాగే టీవీ ఛానెళ్ల విషయం కూడా! అయితే ఈ మాత్రం కృషి బయటి ఇంగ్లిషు, హిందీ పత్రికలు గానీ, ఛానెళ్లుగానీ చేయలేదు. అయితే హిందూ, ట్రిబ్యూన్ పత్రికలు, సిఎన్ఎన్–ఐబిఎన్ ఒకవైపు సమాచారమే అధికంగా ఇచ్చి తమ పక్షపాత ధోరణిని చూపాయి. మిగతా మీడియా ప్రపంచం మౌనమే శరణ్యం అని భావించింది. ఉత్సాహంలో విజ్ఞత కోల్పోయే అవకాశాలు ఎక్కువ ఉన్నాయనే సమయంలో ఇంత జాగ్రత్త పడటం ఆశ్చర్యకరమే.

రింగ్‌రోడ్డు నుంచి వ్యవహారం వేడెక్కినా – రసకందాయంలో పడింది నవంబరులోనే. ఈ విషయంలో తెలుగు మీడియా స్పందించిన తీరు ఆసక్తిదాయకమే కాదు, ఆలోచనా స్ఫోరకం కూడా. సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా – ఒక్కో దశలో ఒక్కో పత్రిక తనదైన రీతిలో స్పందించింది. ఇలా ప్రతి పత్రిక తీరునూ ఈ విషయం సంబంధించి అధ్యయనం చేయవచ్చు. అంతకుమించి 'ఆంధ్రజ్యోతి' స్పందించిన తీరులో చాలా వైవిధ్యం ఉంది. ఈ పత్రికలోనే మొదటిసారి 'ఆత్మరక్షణలో పడ్డారని' రాసింది. ఇనగంటి వెంకటరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, శ్రీరమణ, ఎన్. వేణుగోపాల్, కె. రామచంద్రమూర్తి, తెలకపల్లి రవి, ఎ.పి. విఠల్ వంటి వాళ్లు ఈ విషయం గురించి విశ్లేషించారు. వీరి విశ్లేషణలలో కూడా విస్తృతమైన వైవిధ్యం కొట్టవచ్చినట్టు కనబడుతుంది. ఇలా విశ్లేషించి చూస్తే ఒక మీడియా సంస్థ తన పరిమితులు తాను నిర్ణయించుకున్నట్టు, విశ్లేషకులు కూడా తమ పరిమితులు తాము నిర్ణయించుకున్నట్టు కనబడుతుంది. ఉన్న అవకాశాలను వినియోగించుకోవడంలో సైతం మీడియా సంస్థలు, వ్యక్తులూ వైరుధ్యాలు చూపడం కూడా అవగతమవుతోంది. మీడియా రంగంతో సంబంధం లేని వ్యక్తులు కూడా – మీడియాలోని వ్యక్తులకంటే విభిన్నంగా స్పందించడం లేదు. ఈ విషయం మీద ఏ పత్రికా సంపాదకీయంగా స్పష్టమైన వ్యాఖ్య చేయలేదని గమనించాలి. అదే సమయంలో పది, పదిహేను సెమినార్లు కానీ, వర్క్‌షాపులు గానీ జరగడం ఇక్కడ గమనార్హం. వీక్షణం, తేజ, పెళ్లి పత్రిక వంటి చిన్న పత్రికలు లోతైన విశ్లేషణలు ఇవ్వడం విశేషం.

అదే సమయంలో ఏపి మీడియా బ్లాగ్ స్పాట్ చేసిన కృషి ప్రత్యేకంగా చెప్పుకో దగ్గదీ, అభినందించ దగ్గదీ. ఇక్కడ ప్రధానంగా ఉన్న మేలు ఏమిటంటే, సంస్థలకున్న పరిమితులు లేకపోవడంతో అభిప్రాయాలకు స్పష్టత ఉండటం. గాంభీర్యంగా, మంచి పరిశోధన, హేతబద్ధమైన వాదనతో చాలా అంశాలు ఇందులో వచ్చాయి. దీని మీద చాలా మంది స్పందించారు కూడా. ఇవన్నీ శ్రమ లేకుండా నెట్‌తో అందుబాటులోకి రావడం – టెక్నాలజీ తెచ్చిన సమాంతర వేదిక. తెలుగునాట కేవలం మాట స్థాయివరకే చర్చింపబడే సీరియస్ విషయాలు ఇక్కడ స్పష్టంగా చర్చకు రావడం చాలా అవసరం, ఆరోగ్యకరం. ఇప్పటికీ దీనిని ఎవరు నిర్వహిస్తున్నారో బయటకు తెలియడం లేదు. అలాగే ఫిబ్రవరి, మార్చ్ మాసాలలో డా. ఎబికె ప్రసాద్ ఈ నేపథ్యంలో 'ఆంధ్రప్రభ'లో రాసిన మూడు సుదీర్ఘ వ్యాసాలు గురించి ప్రత్యేకంగా పేర్కోవాలి. ఈ ప్రయత్నం ఎబికె ప్రతిష్ఠను పెంచింది. ఈ వ్యాసాలు త్వరలో చిరు పుస్తకంగా వస్తున్నాయని తెలుస్తోంది. అలాగే ఏపి మీడియా బ్లాగ్‌లోని ఈ అంశాలు సైతం పుస్తకంగా వస్తే మంచిది. ఇంకా ఎవరైనా ఈ విషయం మీద పత్రికలలో వచ్చిన విశ్లేషణలు అన్నీ ఒక సంకలనంగా తెస్తే రేపటి పరిశోధకులకూ, పాత్రికేయులకు దోహదకారిగా ఉంటుంది.

ఏది ఏమైనా అదృశ్యంగా ఉన్న సంక్లిష్ట పరిస్థితి వెలుగులోకి వచ్చింది. జర్నలిజంతో పాటు రాజకీయ, సామాజిక శాస్త్రాలలో కూడా

రాష్ట్ర బడ్జెట్ 2007-08

- ఎన్. శ్రీదేవి

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఫిబ్రవరి 19 2007న రాబోయే ఆర్థిక సంవత్సరానికిగాను (2007-08) బడ్జెట్‌ను శాసనసభలో సమర్పించారు. మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సుషుప్తావస్థ నుండి సుభిక్ష స్థితికి చేర్చడంలో విజయం సాధించామన్నారు. అందుకు నిదర్శనం ఏటా బడ్జెట్ వ్యయం పెరుగుతున్నా రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు తగ్గుముఖం పట్టడం అని ఉదహరించారు. ఆయన మాటల్లోని వాస్తవికతను అంకెల రూపంలో చూపారు.

పట్టిక 1

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల సారాంశం

(రు. కోట్లలో)

	రెవెన్యూ లోటు	ద్రవ్య లోటు	ప్రాథమిక లోటు
2005-06			
బడ్జెట్ అంచనా	1401.38	8379.85	456.64
రెవెన్యూ అంచనా	1117.95	8190.02	1131.98
వాస్తవ అంచనా	64.11	8299.85	1291.75
2006-07			
బడ్జెట్ అంచనా	995.84	8147.20	164.20
రెవెన్యూ అంచనా	53.54	7903.99	79.19
2007-08			
బడ్జెట్ అంచనా	36.48	8620.64	7.99

మూలం : రాష్ట్ర బడ్జెట్ సంక్షిప్తంగా, 2007-08

2005-06 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటు రు. 1401 కోట్లుగా బడ్జెట్ అంచనా వేసినా, దాని రు. 1118 కోట్లు సవరించిన అంచనాల్లో చూపి వాస్తవ సంఖ్యల్లో దాని రు. 64 కోట్లకు కుదించారు. ఇదే రెవెన్యూ లోటును 2007-08కి గాను రు. 36 కోట్లకు తగ్గించగలమని వక్కాణించారు (పట్టిక 1). (అదే విధంగా ద్రవ్యలోటు ఈ దిశలో తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నారు). ప్రస్తుతం రెవెన్యూలోటు మీద దృష్టి సారిద్దాం.

ఏ ప్రభుత్వానికైనా రెవెన్యూ లోటు తగ్గించాలంటే ఉండే మార్గాలు రెండు. ఒకటి రెవెన్యూ ఆదాయం పెంచడం, రెండవది రెవెన్యూ వ్యయం తగ్గించడం. మొదటి మార్గమైన 'రెవెన్యూ ఆదాయం పెంచడం' కోసం పన్ను రేట్లను పెంచకుండా పన్ను వసూళ్లను పెంచుకోవాలన్నదే వారి లక్ష్యం. వీరి లక్ష్యానికి నిలకడగా ఉన్న ఆర్థిక వ్యవస్థ తోడై రాష్ట్ర రెవెన్యూ ఆదాయం బాగా పెరిగింది. ఇదే పరిస్థితి రాబోయే సంవత్సరం కొనసాగుతుందన్న ఆలోచనతో రెవెన్యూ ఆదాయాన్ని ఇరవై నాలుగు శాతం పెరుగుతుందని అంచనా వేశారు. కానీ రెవెన్యూ వ్యయం పెరుగుదల ఇరవై ఒక్క శాతంగా (రెవెన్యూ ఆదాయం కన్న తక్కువగా) అంచనా వేయడం వల్ల (పట్టిక 2) 2007-08 రెవెన్యూ లోటు (అంచనా) తగ్గింది.

రూపాయి రాక, పోక (పట్టిక 3,4)

మన రాష్ట్ర బడ్జెట్‌ను రు. 80 వేల కోట్లకు అంచనా వేయగా అందుకు గాను సమకూర్చుకున్న నిధుల్లో అరవై ఎనిమిది శాతం రెవెన్యూ ఆదాయం ద్వారా, అప్పుల ద్వారా పదిహేను శాతం, వివిధ పెట్టుబడులపై రాబడుల ద్వారా సుమారు పన్నెండు శాతం, మిగిలిన ఐదు శాతం పబ్లిక్ అకౌంట్ నుండి అని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో కుతూహలం కలిగించే అంశం ఏమిటంటే వివిధ పెట్టుబడులపై రాబడులు 2006-07 కన్నా 2007-08 లో మూడు రెట్లు అంచనా వేయడం. వేచి చూడాల్సిన విషయం ఇది.

ఇక ఈ మొత్తాన్ని ఎలా ఖర్చు పెట్టాలనుకున్నారంటే, అరవై ఎనిమిది శాతం రెవెన్యూ వ్యయం (ఇందులో పదకొండు శాతం వడ్డీ చెల్లింపులకు), రుణాల చెల్లింపులు పది శాతం (అంటే చేసిన అప్పులో చెల్లింపులు అరవై మూడు శాతం కాగా మిగిలిన ముప్పై ఏడు శాతం ఆర్థికాభివృద్ధి కన్నమాట) గా ఉంది. అంటే కేవలం ఇరవైరెండు శాతం మాత్రమే పెట్టుబడి వ్యయం అన్నమాట. ఇందులో లోన్స్ అండ్ అడ్వాన్స్ కూడా కలపాలి. ఎందుకంటే ఇవి కూడా ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతాయి కాబట్టి.

రెవెన్యూ వ్యయంలో సహకార సేవలు, ఆర్థిక సేవల శాతం పెరుగుతూ ఉండడం హర్షించదగ్గ విషయం. (పట్టిక 5) సామాజిక, ఆర్థిక రంగాలను స్థూలంగా చూసినా (పట్టిక 5) సూక్ష్మంగా అంటే వివిధ పద్దులను చూసినా కేటాయింపులు ఆశాజనకంగానే ఉన్నాయి (రాష్ట్ర బడ్జెట్ సంక్షిప్తంగా, 2007-08). ఎటొచ్చీ రాష్ట్ర ప్రభుత్వం తలచినదే, దైవం తలచిన రాష్ట్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ కసరత్తుకు తగిన ఫలం. ఇక సామాజికాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి తదుపరి చర్చలో విశ్లేషించవచ్చు.

ఈ విషయం మీద విస్తృత పరిశోధన శీఘ్రంగా చేపట్టాలి. ఎందుకంటే అనేక ఛానెళ్లు, పెద్ద పత్రికల సమూహం గల ఒక యజమాని నమ్మకం సన్నగిల్లి పుస్తకం ప్రచురించుకుని తన వాదన వినిపించుకోవాలని భావించడం అనేది ఖచ్చితంగా ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తోంది. అటువంటి పరిస్థితికి దారి తీసింది 2006 నవంబర్ 6వ తేది సంఘటన. అందుకే ఇప్పుడు ఈ తేదికి ముందు, తర్వాత అని మీడియా రంగాన్ని విశ్లేషించుకునే పరిస్థితి ముందు ముందు ఉంటుంది. దీనికి సంబంధించి ఇవి చాలా స్థూలంగా కనబడే విషయాలు. ఇంతకుమించి సూక్ష్మ అంశాలు చాల పెద్ద ఎత్తున ఉన్నాయి. అందుకే పరిశోధన అవసరమని చెబుతోంది. ♦

పట్టిక 2

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల సారాంశం

	ముందు సంవత్సరంతో పోలుస్తూ – శాతంలో				(2007–08 బ.అ.)
	2005–06 అకౌంట్స్	2006–07 బడ్జెట్ అంచనా	2006–07 రెవెన్యూ అంచనా	2007–08 బడ్జెట్ అంచనా రెవెన్యూ అంచనాతో	2006–07 బడ్జెట్ అంచనా తో పోలుస్తూ
మొత్తం వసూళ్లు					
రెవెన్యూ వసూళ్లు		27.20	1.84	21.72	23.95
మూలధన వసూళ్లు		0.00	0.00	208.20	208.20
పెరిగిన ప్రజా రుణం		135.41	–15.65	55.54	31.15
బాకీ వసూళ్లు		542.55	–47.15	–55.48	–76.47
డిపాజిట్ లావాదేవీలు (పబ్లిక్ అకౌంట్)		–39.50	–12.68	–15.34	–26.07
మొత్తం వసూళ్లు		31.59	–3.01	31.56	27.60
మొత్తం ఖర్చు					
రెవెన్యూ ఖర్చు		29.82	–0.28	21.65	21.31
మూలధన ఖర్చు		31.37	1.45	26.02	27.86
ప్రజా రుణ చెల్లింపులు		28.94	–29.20	60.35	13.53
అప్పులు, అడ్వాన్స్‌లు		72.93	0.00	312.08	312.08
మొత్తం ఖర్చు		30.64	–3.11	31.59	27.50

మూలం : పట్టిక 1 ఆధారంగా లెక్కించబడినది

పట్టిక 3

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల సారాంశం

(రు. కోట్లలో)

	2005–06 అకౌంట్స్	2006–07 బడ్జెట్ అంచనా	2006–07 రెవెన్యూ అంచనా	2007–08 బడ్జెట్ అంచనా
మొత్తం వసూళ్లు				
రెవెన్యూ వసూళ్లు	34851.19	44331.17	45145.98	54949.58
మూలధన వసూళ్లు	0.00	3050.00	3050.00	9400.00
పెరిగిన ప్రజా రుణం	3970.72	9347.61	7881.54	12259.00
బాకీ వసూళ్లు	182.43	1172.21	619.47	275.80
డిపాజిట్ లావాదేవీలు (పబ్లిక్ అకౌంట్)	9249.59	5596.45	4886.78	4137.23
మొత్తం వసూళ్లు	48253.93	63497.44	61583.77	81021.61
మొత్తం ఖర్చు				
రెవెన్యూ ఖర్చు	34915.30	45327.02	45199.52	54986.07
మూలధన ఖర్చు	7661.68	10065.35	10211.69	12869.07
ప్రజా రుణ చెల్లింపులు	5294.74	6827.16	4833.52	7750.58
అప్పులు, అడ్వాన్స్‌లు	756.49	1308.23	1308.23	5390.89
మొత్తం ఖర్చు	48628.21	63527.76	61552.96	80996.61
సంఘటిత నిధులు (నికర)	**–374.28**	**–30.32**	**30.81**	**25.00**

మూలం : పట్టిక 1 ఆధారంగా లెక్కించబడినది

పట్టిక 4
రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల సారాంశం

(శాతం)

	2005-06 అకౌంట్స్	2006-07 బడ్జెట్ అంచనా	2006-07 రెవెన్యూ అంచనా	2007-08 బడ్జెట్ అంచనా
మొత్తం వసూళ్లు				
రెవెన్యూ వసూళ్లు	72.22	69.82	73.31	67.82
మూలధన వసూళ్లు	0.00	4.80	4.95	11.60
పెరిగిన ప్రజా రుణం	8.23	14.72	12.80	15.13
బాకీ వసూళ్లు	0.38	1.85	1.01	0.34
డిపాజిట్ లావాదేవీలు (పబ్లిక్ అకౌంట్)	19.17	8.81	7.94	5.11
మొత్తం వసూళ్లు	100.00	100.00	100.00	100.00
మొత్తం ఖర్చు				
రెవెన్యూ ఖర్చు	71.80	71.35	73.43	67.89
మూలధన ఖర్చు	15.76	15.84	16.59	15.89
ప్రజా రుణ చెల్లింపులు	10.89	10.75	7.85	9.57
అప్పులు, అడ్వాన్సులు	1.56	2.06	2.13	6.66
మొత్తం ఖర్చు	100.00	100.00	100.00	100.00

మూలం : పట్టిక 1 ఆధారంగా లెక్కించబడినది

పట్టిక 5
సామాజిక సేవల పై రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు

(శాతం)

	మొత్తం సామాజిక సేవలు	ఆర్థిక సేవలు	సాధారణ సేవలు	మొత్తం కేటాయింపులు	
రెవెన్యూ ఖర్చు					
2005-06	34.82	25.89	38.64	0.65	100.00
2006-07	37.28	26.99	35.15	0.58	100.00
2007-08	37.25	27.96	34.28	0.51	100.00
మూలధన ఖర్చు					
2005-06	2.03	97.63	0.34	0.00	100.00
2006-07	5.22	93.94	0.84	0.00	100.00
2007-08	4.57	94.56	0.87	0.00	100.00
మొత్తం ఖర్చు (రెవెన్యూ + మూలధనం)					
2005-06	28.92	38.80	31.75	0.53	100.00
2006-07	31.37	39.33	28.83	0.47	100.00
2007-08	31.05	40.59	27.94	0.41	100.00

మూలం : పట్టిక 1 ఆధారంగా లెక్కించబడినది

♦

రెండు బడ్జెట్‌లు - నాలుగు చింతలు

- ఎం.ఎల్. కాంతారావు

2007-08 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 19న బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను ఫిబ్రవరి 28న ప్రవేశపెట్టారు. దేశంలో ఫిబ్రవరి నెల ప్రభుత్వ బడ్జెట్‌ల మాసం, పన్నులు విధించే వేళ కాబట్టి, ఈ తంతులో ప్రత్యేకత ఏమీ లేదు. అయితే వీటిని ప్రవేశపెట్టిన సుమారు, మూడు నాలుగు వారాల తర్వాత తీరిగ్గా కూర్చుని, ఈ బడ్జెట్‌ల ప్రభావ పరిణామాలపై విహంగ వీక్షణం చేస్తే, విశ్లేషణ చేస్తే, ఏమున్నది గర్వకారణం అన్న మహాకవి వాక్యమే గుర్తుకొస్తుంది.

ప్రజలు ఏమి ఆశించారు ?

బడ్జెట్‌లలో వివిధ రంగాలకు ఎంతెంత కేటాయించారు అనే అంశాన్ని నిశితంగా పరిశీలించే కన్నా, ఆ కేటాయింపుల వల్ల ప్రజలకు ఒనగూడే లాభనష్టాలు బేరీజు వేసుకోడం (ఔట్‌కం బడ్జెట్) అభిలషణీయమని చిదంబరం అనేక సందర్భాలలో తెలియచేశారు. నిజానికి వంటవారి పాకశాస్త్రప్రావీణ్య పటిమకు మన్నన లభించాలంటే, ఆ వంటకాలను అన్నార్తులు ఇష్టంగా ఆరగించగలిగి ఉండాలి. బడ్జెట్‌లలోని ప్రతిపాదనలు జనానికి మింగుడుపడాలి. బడ్జెట్‌లలో వివిధ ప్రతిపాదనలను ప్రజానీకం జీర్ణించుకొని, ఆరోగ్య వృద్ధి చేసుకోగలిగి ఉండాలి. ఆర్థిక మంత్రులు తాము నిలుచున్న చెట్టు కొమ్మలను, తామే ఖండించరాదనే హెచ్చరిక భారతదేశంలో శతాబ్దాల క్రితం చేయబడింది. పుష్పాలకు హానికలుగకుండా, తేనెటీగలు మధువును సేకరించినట్లు ఆర్థిక మంత్రులు కూడా ఆర్థిక వ్యవస్థకు హాని కలగని రీతిలో, పన్నులను సేకరించాలి. ఈ ప్రాథమిక సూత్రాలను మనం ఎంతవరకు పాటించాం అన్నది ఈ వ్యాస లక్ష్యం.

పన్నుల రాబడి - ప్రజలపై భారం

యు.పి.ఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు సంవత్సరంలో, అంటే 2003-04 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి 27 లక్షల 67 వేల కోట్ల రూపాయలు (సుమారుగా) అది 2005-06 వర్తమాన ధరలలో రు. 35 లక్షల 29 వేల కోట్లకు పెరిగినట్లు అంచనా. అంటే రెండేళ్లలో పెరుగుదల సుమారు 28 శాతం కాగా, కేంద్ర ప్రభుత్వానికి పన్నుల ద్వారా చేకూరిన నికర రాబడి ఒక లక్షా 87 వేల కోట్ల నుండి 2005-06 నాటికి రు. 2 లక్షల 70 వేల కోట్లకు పెరిగినట్లు అంచనా. అంటే పెరుగుదల 44 శాతం. గత సంవత్సరాంతానికి అంటే 2006-07 ఆర్థిక సంవత్సరానికి కేంద్రానికి నికరంగా చేకూరిన పన్నుల రాబడి, రు. 3 లక్షల 60 వేల కోట్లు. పన్నుల పెరుగుదల శాతం మూడేళ్లలో 93 శాతం. అంటే స్థూల దేశీయోత్పత్తిలోని పెరుగుదల కంటే, తలసరి ఆదాయాల పెరుగుదల కంటే గత మూడు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం పన్నుల ద్వారా సేకరించిన పన్నుల రాబడి పెరుగుదల శాతం హెచ్చుగా ఉన్నందున, సాధారణ పౌరుడిపై పన్నుల భారం బాగా పెరిగిందనేది నిర్వివాద అంశం.

ఆదాయపు పన్ను

కాగా, పన్నుల రాబడిలో గణనీయమైన పెరుగుదల ఉన్నప్పటికీ, 2007-08 బడ్జెట్ ప్రతిపాదనలలో సామాన్య పన్ను చెల్లింపుదారునికి, ఆదాయపు పన్ను మినహాయింపు స్థాయిలో ఆశించిన మేరకు రిలీఫ్ - రాయితీ లభించలేదు. కలల బడ్జెట్ వస్తుందన్న కలలు కన్న వారికి, చేదు వాస్తవాలే మిగిలాయి. ఆశా నిరాశేనా మిగిలేది చింతేనా అని అనుకోవాల్సి వచ్చింది. ఆదాయపు పన్ను చెల్లింపు కనీస స్థాయిని మినహాయింపు వివిధ వర్గాలకు కేవలం రు. 10,000 మాత్రమే హెచ్చించారు. దీని వల్ల సాధారణ పన్ను చెల్లింపుదార్లకు పన్ను చెల్లింపు కనీస స్థాయి రు. 1,10,000కు పెరగగా, స్త్రీలకు 1,45,000 రూపాయలకు, సీనియర్ సిటిజన్‌లకు రు.1,95,000కు పెరిగింది. ఇది ఏ విధంగానూ సమర్థనీయం కాని ప్రతిపాదన. ఎందువల్ల అంటే, ప్రభుత్వ లెక్కల ప్రకారంకూడా, ద్రవ్యోల్బణం రేటు సుమారు 6.5 శాతం ఉంది. ఆ మేరకు ప్రభుత్వ గణాంకాల ప్రకారం కూడా కొనుగోలు శక్తిలో కోత ఏర్పడిందన్నమాట. వాస్తవానికి బజార్‌లో సామాన్యులు నిత్యావసర వస్తువుల పై చెల్లించే ధరలు మరింత హెచ్చుగానే ఉన్నాయి. అంతే గాక పన్నుల పై చెల్లించాల్సిన సెస్ (విద్యపన్ను) కూడా 2 శాతం నుండి 3 శాతానికి పెంచారు. ఆర్థికాభివృద్ధి ఫలాలను సామాన్యులకు అందించే ఆలోచన లేదన్నమాట. ప్రజలు ఖర్చుపెట్టుకోగల వ్యయార్హ ఆదాయంలో మరింత కోత పడిందన్నమాట. ఇలాంటి పరిస్థితులలో దీనిని కలల బడ్జెట్ అందామా? లేక నిదుర చెడగొట్టి మరింత చింతాక్రాంతులను చేసే బడ్జెట్ అందామా? ప్రైవేట్ ఫైనాన్స్‌లో వాస్తవాదాయం ఈ విధంగా తగ్గినప్పటికీ, ఏలినవారి పబ్లిక్ ఫైనాన్స్‌లో మాత్రం పన్నుల రాబడి గణనీయంగా పెరిగిందని సంతోషిద్దామా? స్థూల జాతీయోత్పత్తిలో పొదుపు శాతం సుమారు 32 గా ఉన్నప్పటికీ, ఇది చైనాలో కంటే తక్కువగా ఉందని గమనించాలి.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్

మరి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ పరిణామాలు గూడా గమనించండి. పన్నుల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 2003-04లో చేకూరిన స్వంత పన్నుల రాబడి రు. 13,806 కోట్లు. (స్టేట్స్ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ) 2004లో అధికారానికి వచ్చిన ప్రభుత్వం మేము కొత్తగా పన్నులను విధించడం లేదని ఘనంగా చెప్పినప్పటికీ, పన్నుల రాబడి 2006-07లో రు. 25,256 కోట్లు, 2007-08లో రు. 31,399 కోట్లు ఉండవచ్చని అంచనా. అంటే 2003-04లో కంటే 2006-07లో రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులలో వృద్ధి శాతం 83. ఇది 2007-08 అంచనాల ప్రకారం 127 శాతానికి పెరుగుతుంది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రజల తలసరి సగటు ఆదాయం 2003-04లో రు.18,961 కాగా 2006-07 నాటికి రు.22,521 అంటే పెరుగుదల శాతం 18 మాత్రమే. అంటే

రాష్ట్రంలో కూడా ప్రజల తలసరి ఆదాయపు పెరుగుదల కంటే ప్రభుత్వ రాబడి పెరుగుదల మాత్రమే హెచ్చు. అందువల్ల టాక్స్ జిడిపి రేషియో రాష్ట్రీయోత్పత్తిలో పన్నుల రాబడి శాతం పెరిగిందని అధికారంలో ఉన్నవారు సంబర పడుతుంటారు. అయితే ఈ పెరిగిన పన్నుల రాబడి సద్వినియోగం అయ్యి, ప్రజోపయోగమైన రంగాలలో ఖర్చు పెడితేనే సార్థకత ఏర్పడుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో విద్యకై చేసే వ్యయాన్ని పరిశీలించండి. సాధారణ విద్యకై చేసే వ్యయం 2003-04లో రు. 4667 కోట్లు. ఇది 2006-07లో రు. 7049 కోట్లకు పెరిగి, 2007-08లో రు. 8060 కోట్ల స్థాయి చేరవచ్చునని అంచనా. అంటే పెరుగుదల శాతం 2006-07 నాటికి 51 శాతం, 2007-08 నాటికి 73 శాతం అయినప్పటికీ పెరిగిన రాష్ట్రీయోత్పత్తిలో శాతంగా గణిస్తే

2003-04 4667 / 190881 = 2.44%

2006-07 7049 / 260734 = 2.70%

జిడిపిలో విద్యావ్యయం

విద్యకై యూనియన్ ప్రభుత్వ కేటాయింపు సుమారు రు. 32,250 కోట్లని చెప్పినప్పటికీ ఇది జాతీయోత్పత్తిలో సుమారు ఒక శాతం మాత్రమే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకై చేసే వ్యయం శాతం స్థూల జాతీయోత్పత్తిలో 3 నుండి 6 శాతానికి పెంచాలనే (సిఎంపి) లక్ష్యానికి మనం ఎంత దూరంలో ఉన్నామో పై గణాంకాలు తెల్పుతాయి.

వైద్యం పై ఖర్చు

విద్య, వైద్యం మానవాభివృద్ధికి ప్రముఖంగా దోహదం చేసే అంశాలని అందరికీ తెలుసు. ఆరోగ్య రంగానికి కేంద్రం చేసిన కేటాయింపు సుమారు రు. 15,291 కోట్లు. అంటే స్థూల దేశీయోత్పత్తిలో ఇది 0.5 శాతం మాత్రమే. 2006-07 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఖర్చు సవరించిన అంచనాల ప్రకారం వైద్యరంగానికి రు. 1643 కోట్లు. అంటే ఇది రాష్ట్రీయోత్పత్తిలో 0.63 శాతం మాత్రమే. వైద్యరంగంపై ప్రభుత్వ ఖర్చు ఒక శాతం నుండి రెండు శాతానికి పెంచాలనేది లక్ష్యం. అయినప్పటికీ వైద్య రంగంపై ఖర్చు లక్ష్యం మేరకు లేదనేది పై గణాంకాలు తెలుపుతాయి. ప్రజారోగ్యంపై భారత ప్రభుత్వం చేసే వ్యయం ప్రపంచ దేశాలతో పోల్చితే చాలా తక్కువ.

ఉపాధి హామీ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరో 130 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు చిదంబరం ప్రకటించారు. ఈ పథకం కింద ఇచ్చే రోజువారి కూలి మొత్తానికి 100 రూపాయల గరిష్ట పరిమితి కూడా విధించారు. కాగా ఈ పథకం ప్రస్తుతం 200 జిల్లాలో అమలులో ఉంది. అంటే 2007-08లో మొత్తం 330 జిల్లాల్లో అమలు కాబోతుంది. అయితే గత సంవత్సరం అమలు అనుభవం దృష్ట్యా వాస్తవాలు ఇలా ఉన్నాయి. కోటి 50 లక్షల మంది ఉపాధి హామీకై దరఖాస్తు చేసుకొన్నారు. అయితే కోటి 47 లక్షల మందికి పని చూపించినా, 33 శాతం మందికి మాత్రమే 100 రోజులకు పూర్తిగా పని కల్పించగలిగారు. 40 కోట్ల శ్రామిక శక్తి గల ఈ దేశంలో 53 లక్షలకు పని కల్పించడం వల్ల సమస్య ఏ మేరకు పరిష్కరింప బడగలదో విశ్లేషించుకోవాలి. ఈ పథకానికి చేసిన అదనపు కేటాయింపు రు. 1200 కోట్లు. మరో అంశం. ఇటీవలి గణాంకాల ప్రకారం ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్‌లలో తమ పేర్లను నమోదు చేసుకొన్న వారి సంఖ్య సుమారు 4 కోట్ల 20 లక్షలు.

ద్రవ్యోల్బణం

'ద్రవ్యోల్బణాన్ని కనీస స్థాయికి తీసుకొస్తాం - ద్రవ్యోల్బణ నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వాలకూ పాత్ర ఉంది" - ఇవి చిదంబరం బడ్జెట్ ప్రకటనలు. కాని మార్చ్ 3, 2007తో అంతమైన వారంలో ద్రవ్యోల్బణం రేటు 6.10 నుండి 6.46 కు పెరిగింది. సిమెంట్ ధరల నియంత్రణకు సంబంధించి అవలంబించిన వ్యూహం బెడిసికొట్టి, సిమెంట్ ధరలు బాగా పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా టమాటాలకు గిట్టుబాటు ధర పలకక మదనపల్లిలో 25 పైసలకే కిలో అమ్ముకోవలసి వస్తే వినియోగదారులు మాత్రం అధిక ధరలు చెల్లించాల్సి వస్తున్నది. సప్లయ్-డిమాండ్‌ల మధ్య సమతౌల్యం లేకపోవడం, మార్కెట్ యంత్రాంగంలోని వికృత పోకడలు ఉత్పత్తిదారులను, వినియోగదారులను దోపిడీకి గురిచేస్తున్నాయి. బడ్జెట్‌లలోని ప్రకటనలకు వాస్తవాలకు మధ్యగల అంతరాలను ఈ సంఘటన విశదీకరిస్తోంది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతూనే, వృద్ధిరేటును 9 శాతానికి పెంచగల శక్తి భారత్‌కు ఉందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు అహ్లువాలియా భరోసా ఇస్తారు. ట్యాక్స్ ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ - టి.ఐ.ఎన్ ద్వారా ప్రభుత్వ రాబడులు పెంచుకో గలిగిన పరిస్థితులలో సమాచార లోపాలకు స్వస్తిచెప్పి, అత్యవసర వస్తువుల అక్రమ నిల్వలను అరికట్టి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయాల్సిన అవసరం ఉంది. ధరల పెరుగుదలకు సంబంధించిన చింతను తొలగించకుంటే ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో మరింత చింతకు లోనైతాయి. వెనుక చింతించుట వెర్రితనమన్నది ఆర్యోక్తి. 2003-04లో టాక్స్, జిడిపి రేషియో స్థూల రాష్ట్రీయోత్పత్తిలో పన్నుల సేకరణ శాతం 9.2గా ఉండేది. దానిని 2006-07 నాటికి కేంద్ర ప్రభుత్వం 11.4 శాతానికి పెంచుకొని తన ఆర్థిక పరిస్థితి పెంచుకొంది. అదే విధంగా ఆదాయాల పెంపుదల ద్వారా, ధరల పెరుగుదలను నియంత్రించడం ద్వారా సామాన్యుల కొనుగోలు శక్తి పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

ఇటీవల కేంద్రం నుండి రాష్ట్రాలకు బదిలీ అయిన నిధులు గూడా బాగా పెరిగాయి. సవరించిన అంచనాల ప్రకారం 2006-07లో రాష్ట్రాలకు బదిలీ అయిన పన్నుల వాటా రు. 1,20,377 కోట్లు కాగా, 2007-08లో రు. 1,42,450 కోట్లు బదిలీ కావచ్చని అంచనా. అంతే గాక వివిధ రకాల కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రాలకు నిధులు బదిలీ అయినాయి. గ్రామీణ రోడ్లు, సర్వశిక్షా అభియాన్, గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకం, సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన, ఇందిరా ఆవాస్ యోజన మొదలైనవి. ఈ పథకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి మెరుగుపడే వీలు చిక్కింది. అయితే ఈ రకమైన పథకాలను క్షేత్రస్థాయిలో అమలుపర్చాల్సిన బాధ్యత రాష్ట్రానిది. చాలా రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనా

ఎం.వి. తిరుపతయ్య



తెలుగు సాహితీలోకానికి బతుకు, జీవనసమరం వంటి నవలలు; న్యాయం, పునాదిరాళ్లు వంటి కథలు అందించిన సాహిత్యకారుడు, 1969-70లో ఎందరో యువకులకు ప్రేరణగా నిలిచిన 'విద్యుల్లత' మాస పత్రిక చోదకశక్తి సాహిత్యకారులు ఎం.వి. తిరుపతయ్య, మార్చ్ 11 రాత్రి హనుమకొండ టీచర్స్ కాలనీలో మరణించారు. ఆయన గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు.

తిరుపతయ్య 1945లో ఓ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆయన స్వస్థలం కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ధర్మారం గ్రామం.

కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో తొలి విప్లవోద్యమ భావాలు నాటిన మేధావులలో ఒకరుగా ఆయన ప్రభుత్వం చేతిలో తీవ్ర నిర్బంధానికి గురయ్యారు. 1975లో ఎమర్జెన్సీలో ఇరవై ఆరు రోజులపాటు అక్రమ నిర్బంధంలో చిత్రహింసలు అనుభవించారు. అంపశయ్య నవీన్ నవల 'చీకటిరోజులు' తిరుపతయ్య నిర్బంధం గురించి రాసినదే.

ఆయన వృత్తిరీత్యా తెలుగు ఉపన్యాసకునిగా జమ్మికుంటలోని డిగ్రీ కళాశాలలో పనిచేసారు. తరువాత ఖమ్మంలోనూ, వరంగల్‌లోని ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాలలోనూ పనిచేసి, వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగళి కళాశాల ప్రిన్సిపాల్‌గా 1998లో పదవీ విరమణ చేసారు.

ఆయన విద్యార్థి దశనుంచే కథలు, కవితలు రాయడం ఆరంభించారు. ముఖ్యంగా తెలంగాణ బతుకు చిత్రాన్ని తనదైన శైలిలో అద్భుతంగా చిత్రించిన 'బతుకు' నవల ఆయనకు సాహిత్యకారునిగా, నవలాకారునిగా మంచి పేరు తెచ్చింది. తీవ్ర అనారోగ్యంతోనే, పడకమీదనే 'జీవనసమరం' నవలను పూర్తిచేసి పుస్తకావిష్కరణ కూడా ఇటీవలే జరుపుకున్నారు. తెలుగు సమాజానికీ, సాహిత్యానికీ తిరుపతయ్య అందించిన సేవలను 'వీక్షణం' వినమ్రంగా సంస్మరించుకుంటోంది. ♦

సామర్థ్యం అనేక సందర్భాలలో వెలుగులోకి వచ్చింది. అందువల్ల నిధుల కేటాయింపుకు, ప్రభుత్వ వ్యయం వల్ల చేకూరాల్సిన ప్రయోజనాలకు మధ్య అంతరం హెచ్చుగా ఉంటున్నది. ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. పథకాల అమలు చూచిన తర్వాత భ్రాంతి కలుగుతుందా, శాశ్వత ఉపయోగం కలిగించే నిశ్శబ్ద క్రాంతి ఏర్పడుతుందా వేచిచూడాలి.

చిదంబరం తన బడ్జెట్ ప్రసంగంలో ఎలుగెత్తి చాటిన అంశాలలో ప్రముఖమైనది రెండవ హరిత విప్లవం, వ్యవసాయరంగ అభివృద్ధి, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేటట్లు చూడడం. సాగునీటి ప్రాజెక్టులకు, నీటి సముదాయాల పరిరక్షణకు వేలాది కోట్ల రూపాయల కేటాయింపులు జరిగినా ఫలితాలు ప్రశ్నార్థకంగా ఉంటున్నాయి. ఈ రంగంలో జవాబుదారీతనం, పారదర్శకత క్షేత్రస్థాయిలో లోపిస్తున్నాయి.

ప్రతి సంవత్సరం చిదంబరం తన బడ్జెట్‌లో ప్రతిపాదించే ఒక్కో పన్ను వివాదాస్పదం అవుతుంటుంది. ఒక సంవత్సరం సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్, మరో సంవత్సరం ఫ్రింజ్ బెనిఫిట్ టాక్స్ - క్యాష్ విత్‌డ్రాయల్ టాక్స్. నేడు ఉద్యోగుల స్టాక్ ఆప్షన్స్ పై పన్ను (ఇఎస్ఒపిఎస్). అయితే ఈ పన్నులన్నీ కూడా కొనసాగుతుండడం విశేషం. ప్రతి పన్ను చెల్లింపు మినహాయింపుకూ ఒక తండ్రి, ఓ తాత, పెంపుడు తండ్రి, గార్డియన్ ఉంటారని చిదంబరం రహస్యాన్ని వెల్లడించారు. పన్నుల సేకరణలో ఎక్సంప్షన్ రాజ్‌కి తావులేదని, విజయ్‌కేల్కర్ వర్ణన నేపథ్యంలో చిదంబరం మాటలను విశ్లేషించాలి. రానున్న కాలాన్ని గ్రహించాలి.

మంచి నీటి సరఫరాకు లక్ష్యంగా పెట్టుకొన్న 73,120 నివాస క్షేత్రాలలో, 55,512 నివాస క్షేత్రాలకు మాత్రమే త్రాగు నీటి సదుపాయం కలిగించామనడం ఒక విశేషం. వార్షిక బడ్జెట్‌లు ప్రగతి బాటలో ఒక్కొక్క అడుగు మాత్రమే. అయితే ఇది ముందడుగుగా ప్రభవిస్తుందా, వెనకడుగుగా రూపాంతరం చెందుతుందా అనేది కాలమాన పరిస్థితులపైనా, అభివృద్ధి వ్యూహం మీద ఆధారపడుతుంది. గత అనుభవాల దృష్ట్యా వ్యూహాలు మార్చుకోవడం, తప్పులు సరిదిద్దుకోవడం విజ్ఞుల బాధ్యత. చిదంబరం 2007-08 సంవత్సరపు బడ్జెట్ ఆశించిన మేరకు రూపు దిద్దుకున్నట్లు కనిపించదు. కొత్త పుంతలకు, వింతలకు చోటివ్వకపోయినా, ప్రజానీకపు చింతలకు మాత్రం దోహదం చేసింది. 2007-08లో కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వ్యయం రు. 6,80,521 కోట్లు కాగా, 2006-07లో వ్యయం రు. 5,81,637 కోట్లు. అంటే 2006-07లో సుమారు 112 కోట్ల జనాభాకి రు. 5,81,637 కోట్లు ఖర్చు పెట్టారంటే, సగటున ఒక్కొక్క పౌరుడిపై రోజువారి వ్యయం 14 రూపాయల 17 పైసలు. ఇది ఎంతవరకు సద్వినియోగం అయిందని పరిశీలించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

మరో అంశం, కేంద్ర ప్రభుత్వానికి చేకూరే ప్రతి రూపాయి రాబడిలో కొత్త అప్పుల శాతం 19 కాగా ప్రభుత్వం చేసే ప్రతి రూపాయి ఖర్చులో వడ్డీ చెల్లింపుల వాటా 20 పైసలు. మరో విషయం ఆర్థికాభివృద్ధి రేటులో పెరుగుదల ఉన్నా పేదరిక నిర్మూలన రేటులో ప్రగతి లేదు. ఆదాయపు పన్ను విధింపుకై 'ఆదాయాని'కి సంబంధించిన నిర్వచనాన్ని విస్తృత పరచనున్నారు. కాబట్టి మనలో చాలా మంది మనకు తెలియకుండానే ఆదాయపు పన్ను చెల్లింపుదార్ల జాబితాలో చేరిపోవచ్చు. ♦

2007-08 బడ్జెట్
భారత్ నిర్మాణ్ కాదు, మార్కెట్ నిర్మాణ్

- ఎన్. వేణుగోపాల్

బడ్జెట్ గురించి అంత తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం లేని సమయం వచ్చింది. ప్రభుత్వ పాలన గురించీ, ఆర్థిక వ్యవహారాలను గురించీ, జమాఖర్చులను గురించీ, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరే అప్పుల గురించీ, పన్నుల గురించీ, ప్రభుత్వం నిధులు వెచ్చించే పథకాల గురించీ కూడ బడ్జెట్‌లో మాత్రమే ప్రస్తావించాలనే నియమానికి మన పాలకులు ఎప్పుడో స్వస్తి చెప్పారు. దాదాపు ప్రతిరోజూ అటువంటి ప్రకటన ఏదో ఒకటి వస్తూనే ఉంది. ప్రజాధనం ఆదాయ వ్యయాలు ప్రతిరోజూ నిర్ణయమవుతూనే ఉన్నాయి. ఆ ఆదాయ వ్యయాల విధానాన్ని ప్రజా ప్రతినిధుల ముందర ఏడాదిలో ఒకసారి బడ్జెట్ రూపంలో ప్రతిపాదించాలని, ఆ ప్రతిపాదనల పైన వారాల తరబడి చర్చలు జరగాలని, సభ ఆమోదించిన పద్ధతిలోనే జమాఖర్చులు కొనసాగాలని అర్థశాస్త్ర పుస్తకాలు చెప్పే బడ్జెట్ సంప్రదాయం ఎప్పుడో నీరుగారి పోయింది.

అటువంటి సమయంలో ఒక రాష్ట్ర బడ్జెట్ గురించో, కేంద్ర బడ్జెట్ గురించో చర్చించడం దాదాపు అనవసరమే అవుతుంది. ఎందువల్లనంటే ఆ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్న మంత్రులే దాన్ని సర్వస్వమని, అనుల్లంఘనీయమని, కనీసం ఏడాదిపాటు తాము పాటించవలసిన విధాన నిర్ణయమని అనుకోవడం లేదు. ఇప్పుడిక బడ్జెట్ గతంలో లాగ అంకెల గారడీలాగ కూడ మిగలలేదు. ఇక ఆ అంకెలను పట్టుకుని, వాటిని కచ్చితంగా అమలు చేస్తారనుకుని ప్రశంసించడానికి, విమర్శించడానికి కూడ ఏమీలేదు. అసలు అంకెలు ప్రకటించకనే పోయి ఉండవచ్చు. ప్రకటించిన అంకెలు నిజమైన అబద్ధాలో అర్ధసత్యాలో కావచ్చు. ఆ అంకెలు ఏ విదేశీ రుణం తాకిడికో, ఏ ఆకస్మిక సర్‌చార్జి దెబ్బకో మారిపోవచ్చు. ఏడాది తిరిగినాక ప్రవేశపెట్టే మరొక బడ్జెట్‌లో, ఈ బడ్జెట్ సవరించిన అంచనాలు పోలిక పట్టలేనంతగా మారిపోయి ఉండవచ్చు.

ఆధునిక భారత పాలకులు, ఆర్థిక మంత్రులు విజయవంతంగా సాధించిన ఇంద్రజాల క్రీడ ఇది. వారు ఒకమాట చెప్పి ఆ మాటకు కట్టుబడి ఉంటారనుకుంటే, ఆ మాట న్యాయమనో అన్యాయమనో వాదించవచ్చు. అసలు చేసేదంతా, చేయదలచుకున్నదంతా చెప్పకనేపోతే, చెప్పినదంతా చేయకుండా ఉంటే, విషగుళికల మీద పంచదార పూతలు అద్దుతూ ఉంటే, విమర్శ ఎక్కడి నుంచి మొదలు పెట్టాలి? ఏ భాగాన్ని విమర్శించాలి?

ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం, రాష్ట్ర ఆర్థిక మంత్రి కె. రోశయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌ల మీద పరామర్శ రాయదలచినప్పుడు ముప్పిరిగొన్న భావాలివి. బడ్జెట్‌కు ఏదో లేని పవిత్రత ఆపాదించి దాన్ని వివరంగా, సూక్ష్మంగా పరిశీలించడం తగునా? మరి భారత ప్రజానీకమంతటి మీద అపారమైన ప్రభావాన్ని వేయబోయే బడ్జెట్‌ను పూర్తిగా విస్మరించడం సాధ్యమవుతుందా? బడ్జెట్‌కు బైట, ముందూ వెనుకా కూడా పాలకులు బడ్జెట్‌లో చెప్పవలసిన విషయాలు అమలు పరుస్తూ ఉండవచ్చు. అయినా సరే, బడ్జెట్ దానికదిగా ఒక ముఖ్యమైన రాజకీయార్థిక విధాన ప్రకటన గదా, దాన్ని పరిశీలించకుండా ఉండడం ఎట్లా?

బడ్జెట్ ప్రతిపాదనలలో ఏయే పద్దుకింద కేటాయింపులు ఎంత పెరిగాయో, ఎంత తగ్గాయో, ఏయే పద్దులకు ప్రాధాన్యత పెరిగిందో, లేదా తగ్గిందో పరిశీలించడం ద్వారా బడ్జెట్లను విశ్లేషించడం ఒక పద్ధతి. ఈ పద్ధతిలో సాధారణంగా గత సంవత్సరంతో, లేదా అంతకు ముందరి సంవత్సరంతో పోలిక మాత్రమే సాధ్యమవుతుంది. ఆయా పద్దులు మామూలు మనుషుల అవసరాలను ఎంత మేరకు తీరుస్తాయో, మామూలు మనుషుల మీద ఎటువంటి ప్రభావం వేస్తాయో విశ్లేషించడం కుదరదు. ఉదాహరణకు తాగునీటి సౌకర్యాల కల్పన మీద గత సంవత్సరం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించగా, ఈ సంవత్సరం రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించారనుకోండి. అంకెలు మాత్రమే చూసే వారు తాగునీటి కేటాయింపులలో వంద శాతం పెరుగుదల అని అది ఒక గొప్ప విషయమైనట్టు ప్రకటించగలరు. అసలు దేశంలో తాగునీటి సౌకర్యం లేని, అవసరమైన గ్రామాలు ఎన్ని, ప్రజలు ఎందరు, వారిలో ఎందరి అవసరాలను ఈ వెయ్యి కోట్లో, రెండు వేల కోట్లో తీరుస్తాయి, అందులోనూ అవసరమైన యంత్రసామాగ్రి వ్యయం ఎంత, పైపులైన్ల వ్యయం ఎంత, కన్సల్టెన్సీ వ్యయం ఎంత, ఉద్యోగుల జీతభత్యాలెంత అని లెక్కలు విడదీసి చూస్తేగాని అసలు విషయం అర్థం కాదు.

బడ్జెట్ మీద విశ్లేషణల్లో సాధారణంగా ఈ అంకెల ఆధారంగా జరిగే విశ్లేషణలే ఎక్కువ. అవి సాధారణ పాఠకులను గందరగోళంలోనైనా ముంచుతాయి, ఏదో జరిగి పోతున్నదనే భ్రమనైనా కలిగిస్తాయి.

మరొక రకం బడ్జెట్ విశ్లేషణలకు బడ్జెట్‌లో వాస్తవంగా ఏమి ఉన్నదో అవసరం లేదు. మధ్యతరగతి బడ్జెట్, జనాకర్షక బడ్జెట్, దివాళాకోరు బడ్జెట్, పేదవాడి నడ్డివిరిచే బడ్జెట్, సాధారణ గృహిణిని ఆకర్షించే బడ్జెట్ అని పడికట్టు మాటలు కొన్ని ఉంటాయి. బడ్జెట్ ప్రసంగం అయిపోగానే అన్ని రాజకీయ పార్టీల ప్రధాన వ్యాఖ్యాతలు ఈ మాటల్లో ఏదో ఒక మాటతో బడ్జెట్‌ను వ్యాఖ్యానిస్తారు. సాధారణంగా ప్రచార సాధనాలన్నీ ఈ మాటలను ప్రచారం చేసి ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేస్తాయి.

నిజానికి బడ్జెట్ అనేది ఒక కలగూరగంప. దానిలో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో కొంత ఉపయోగకరమైనదీ ఉంటుంది. ఎంతో కొంత హానికరమైనదీ ఉంటుంది. వాటిని వేరు చేసి చూడగలిగితే గాని బడ్జెట్ మీద విశ్లేషణ సవ్యంగా సాగదు. దానికన్న ముఖ్యంగా ప్రతి బడ్జెట్‌కూ ఒక దిశ ఉంటుంది. సాధారణంగా నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన నాటినుంచీ, అంటే గత పదిహేను సంవత్సరాలుగా బడ్జెట్ దిశ ఒకటే. అది బహుళజాతి సంస్థల మార్కెట్ విస్తరణకు వీలు కల్పించడం, సంపన్నులకు ఎక్కువ సౌకర్యాలు అందజేయడం, ప్రజాభిప్రాయాన్ని

సానుకూలం చేసుకునేందుకు వీలుగా మధ్యతరగతికి కొన్ని రాయితీలు కలిగించడం, నిరుపేద ప్రజానీకానికి గతంలో అందుతుండిన నామమాత్రపు సౌకర్యాలను కూడ తగ్గిస్తూపోవడం, నిరుపేద ప్రజానీకంలో, అట్టడుగు వర్గాలలో అసంతృప్తి పెరిగిపోకుండా ఏవో కొన్ని అరకొర రాయితీలు విదిల్చడం – ఈ పదిహేను సంవత్సరాల బడ్జెట్‌ల దిశ ఇది. కాకపోతే ఈ దిశలో తయారయ్యే బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం వేరువేరు రసాయన సమ్మేళనాలను ప్రయోగించడం జరుగుతోంది.

ఈ సంవత్సరం బడ్జెట్‌ను ఈ నేపథ్యంలో – దాని స్థూల దిశ నేపథ్యంలోనూ, ఈ సంవత్సరపు ప్రత్యేకతల నేపథ్యంలోనూ – అర్థం చేసుకోవాలి.

సాధారణంగా బడ్జెట్ దృక్పథాన్ని ఆర్థిక మంత్రి ప్రసంగం సూచిస్తుంది. కేంద్ర బడ్జెట్‌లోనయితే వేలాది పేజీల పత్రాలుంటాయి. వాటిలో పార్ట్ ఎ పేరుతో ప్రభుత్వ అవగాహన, పార్ట్ బి పేరుతో పన్నుల ప్రతిపాదనలను మాత్రం ఆర్థిక మంత్రి లోక్‌సభలో చదివి వినిపిస్తారు. వీటిలో పార్ట్ ఎ ప్రభుత్వ ప్రాధాన్యతలను, ఆలోచనలను, భవిష్యత్ ప్రణాళికలను తెలియజేస్తుంది. దానిలో ప్రభుత్వం ఎన్ని అబద్ధాలు, వక్రీకరణలు, దొంగచాటు వ్యక్తీకరణలు, ఆడంబరపు వాగ్దానాలు చేసినప్పటికీ, వాటిని విశ్లేషించడం ద్వారా బడ్జెట్ లక్ష్యాలను కనిపెట్టవచ్చు.

ఈ సంవత్సరపు బడ్జెట్ ప్రసంగాన్నే తీసుకుంటే, యు.పి.ఎ. ప్రభుత్వం ఐదు సంవత్సరాల పదవీ కాలంలో సరిగ్గా సగాన్ని ఇటీవలే పూర్తి చేసుకున్నదని, అందువల్ల మధ్యంతర ప్రగతి నివేదికను ప్రకటించవచ్చునని, అందులో "చాల అనుకూలాంశాలు, కొన్ని ప్రతికూలాంశాలు" ఉన్నాయని చిదంబరం తన ప్రసంగం ప్రారంభించారు. జాతీయాదాయం పెరుగుదల రేటు, ఉత్పత్తి రంగం పెరుగుగల రేటు, సేవారంగం పెరుగుదల రేటు, తలసరి ఆదాయం, పొదుపురేటు, మదుపురేటు అన్నీ పైపైకి వెళుతున్నాయని, వ్యవసాయం పెరుగుదల రేటులో మాత్రం కావలసినంత పురోగతి లేదని, ద్రవ్యోల్బణం కూడ ఎక్కువగా ఉన్నదని ఆయన అన్నారు.

అసలు అంకెల్లో పెరుగుదలను ప్రజాజీవితంలో అభివృద్ధిగా చూడవచ్చునా అనే ప్రశ్న ఎట్లాగూ ఉంటుంది. దేశంలో ఒక పిడికెడు మంది ఆదాయాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగినందువల్ల జాతీయాదాయంలో పెరుగుదల కనబడవచ్చు. దానితో కోట్లాది పేద ప్రజానీకానికి ఎటువంటి సంబంధం ఉండకపోవచ్చు. ఆర్థికమంత్రి అనుకూలాంశాలుగా ప్రకటించిన ప్రతి అంకెతోనూ ఆ సమస్య ఉంది.

ఇక ప్రతికూలాంశాలుగా చెప్పిన వ్యవసాయం పెరుగుదల రేటు తగ్గిపోవడం, ద్రవ్యోల్బణం అనేది కూడ అంకెలలో మాత్రమే చూడకుండా ప్రజాజీవితంలో అవి వేసే ప్రభావం వైపు నుంచి చూడవలసి ఉంటుంది. వ్యవసాయంలో వెనుకబాటుతనానికి ఒక సూచికగా వ్యవసాయరంగంలో విపరీతంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోతున్నదనడానికి సూచికగా ధరల పెరుగుదల ప్రజాజీవితాన్ని అల్లకల్లోలం చేస్తోంది.

ఈ పరిణామాలకు అసలు కారణాలేమిటో, వాటిని ఈ ప్రభుత్వం ఏ విధంగా తొలగించదలచుకున్నదో, ఆ సమస్యల పరిష్కారానికి ఏ అదనపు నిధులు కేటాయించదలిచారో బడ్జెట్‌లో మాట మాత్రం కూడ లేదు.

పైగా, ప్రసంగం ప్రారంభమైన తొలి మూడు నిమిషాలలోనే "యుపిఎ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలకు తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నది" అని చిదంబరం అన్నారు. అంటే ఏకారణాల వల్లనైతే వ్యవసాయరంగ సంక్షోభం, ద్రవ్యోల్బణం కొనసాగుతున్నాయో, ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమవుతున్నదో ఆ కారణాలను మరింత బలోపేతం చేస్తామని అన్నారన్నమాట. ఆ మాట అన్న తర్వాత ఇంక ఏ దుష్ఫలితాల గురించి ఎన్ని బుడిబుడి రాగాలు తీసినా ప్రయోజనం లేదు.

ప్రగతి నివేదికతో ప్రారంభించి, ఆర్థిక సంస్కరణలకు నిబద్ధతను పునరుద్ఘాటించిన తర్వాత చిదంబరం ప్రస్తావించిన అంశం భారత్ నిర్మాణ్. గతంలో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆర్థిక మంత్రి మళ్లీ చెప్పారు. ఈ కార్యక్రమం కింద సాగునీటి సౌకర్యాల కల్పన, తాగునీటి సౌకర్యాల కల్పన, గ్రామీణ రహదారులు, గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణం, గ్రామీణ విద్యుదీకరణ, గ్రామీణ ప్రాంతాలలో టెలిఫోన్ సౌకర్యాల కల్పన వంటివి ఉన్నాయి. ఈ పనులన్నీ గ్రామీణ ప్రజాజీవితాన్ని ఏ మేరకు మెరుగు పరుస్తాయో తెలియదుగాని బహుళజాతి సంస్థల సరుకులకు గ్రామీణ మార్కెట్లను నిర్మించడంలో మాత్రం పెద్దఎత్తున ఉపయోగపడతాయి. ఆ క్రమంలో గ్రామీణ జనాభాలో ఏ కొందరికో మేలు కూడ కలగవచ్చు గాని ప్రధానమైన లక్ష్యం మాత్రం భారత్ నిర్మాణ్ కాదు, బహుళజాతి సంస్థల మార్కెట్ నిర్మాణ్.

ఆ తర్వాత కూడ ఆర్థిక మంత్రి ప్రసంగంలో ప్రైవేట్ రంగానికి అవకాశాలు కల్పించడం గురించీ, రాయితీలు ఇవ్వడం గురించీ ఉన్న ప్రతిపాదనలు చూస్తే భారత్ నిర్మాణ్ అనే పేరుతో సాగుతున్నది సంపన్నుల మార్కెట్ నిర్మాణమేనని తేటతెల్లమవుతుంది.

మౌలిక సాధన సంపత్తిలో విద్యుత్తు గురించి మాట్లాడుతూ ఇప్పటికే రెండు అతి భారీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రైవేట్‌రంగంలో ఆమోదించడం జరిగిందని, మరొక రెండు కేంద్రాలను 2007 జులైకల్లా ఆమోదించవచ్చునని, అవి మాత్రమే కాక ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలకు విద్యుదుత్పత్తిలో, సరఫరాలో భాగం కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

మొత్తంగా ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం గురించి మాట్లాడుతూ, లాభసాటిగా నడవడంలో తేడా ఉంటే ఆ తేడాను (వయబిలిటీ గ్యాప్) ప్రైవేట్ వ్యాపారవేత్తలకు ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, దాదాపు రు. 2521 కోట్లు అలా ఇవ్వనున్నామని ఆర్థిక మంత్రి అన్నారు. అంటే ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలు దొంగ లెక్కలు చూపి తమ భాగస్వామ్యం లాభసాటిగా లేదని, ఆ కొరతను ప్రభుత్వమే పూడ్చాలని కోరి, ఆ మేరకు వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని కైంకర్యం చేయవచ్చునన్నమాట. అది కూడ ఎంత పెద్ద మొత్తమంటే దేశంలో వందకోట్ల మందికి సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం వెచ్చించే మొత్తం రు. 9321 కోట్లు కాగా, కేవలం 21 మంది పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ఈ తేడా రు. 2521 కోట్లు.

అట్లాగే దేశంలోపలా, సముద్ర జలాలలోనూ ఉన్న చమురు, సహజ వాయు నిక్షేపాలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే విధానానిన మరింత విస్తరిస్తామని కూడ ఆర్థికమంత్రి అన్నారు.

బతుకు (రుణ) భారమైన హలధారి

డా. ఎం. శ్రీకాంత్ రెడ్డి

గత ఆరు నెలల కాలంలో యాభై మంది అన్నదాతలు ఒక్క కరీంనగర్ జిల్లాలోనే రుణభారం భరించలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మాహుతికి పాల్పడ్డారు. హైటెక్ ముఖ్యమంత్రి నుండి రైతు క్షేమమే ఎజెండాగా రాజశేఖరుడి ప్రభుత్వం గద్దెకెక్కినా రైతన్న పరిస్థితిలో మార్పు లేకపోవడమే పై దుస్థితికి అద్దం పడుతుంది. 'వ్యవసాయ ప్రపంచీకరణవల్ల అందరి ఆదాయాలు పెరుగుతాయి. రైతు పండించే ఉత్పత్తులకి తగిన ప్రతిఫలం లభించి, రైతు జీవితం ఆనంద భరితమౌతుంది' అన్నవాదన ఎంత అర్థరహితమో మనకు కండ్లకు కట్టినట్టు కనపడుతుంది.

నేషనల్ సాంపుల్ సర్వే అధ్యయనంలో బయల్పడిన వాస్తవాలు గమనిస్తే మన రైతన్న ఎంతటి సంక్షోభంలో కూరుకొనిపోయాడో అర్థం అవుతుంది. ఈ సర్వే ప్రకారం మన రాష్ట్రంలో దాదాపు 83 శాతం రైతులు రుణభారంతో సతమతమౌతున్నారు. 40 శాతం రైతులు వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకొని జీవిస్తుంటే, మరో 40 శాతం వ్యవసాయదారులు వేరే వ్యాపకం లభిస్తే వ్యవసాయం వీడడానికి సిద్ధంగా ఉన్నారని ఈ సర్వే వివరిస్తుంది. స్థిరత్వంలేని పంటల ధరవరలు, పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, వ్యవసాయం వాణిజ్య పంటల పరమవ్వడం, ఆధునిక జీవితంలో పెరిగిన కుటుంబ ఖర్చులు కలిసి రైతులోకాన్ని అస్తవ్యస్తం చేసి ఆత్మహత్యలవైపు పురికొల్పుతున్నాయి. గత పది పదిహేను సంవత్సరాల వ్యవధిని కొలమానంగా తీసికొని విశ్లేషించినట్లైతే కొంత వరకు ప్రస్తుత సంక్షుభిత వ్యవసాయ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి అవకాశం లభిస్తుంది.

1. తగ్గిన ప్రభుత్వరంగ అభివృద్ధి పెట్టుబడులు
2. పెరిగిన వ్యవసాయరంగ నిరుద్యోగం
3. పెరిగిన తలసరి వ్యయం
4. శాస్త్రీయత లేని గిట్టుబాటు ధరలు

తగ్గిన ప్రభుత్వ రంగ పెట్టుబడులు

1981 నుండి 1995 కాలంలో మన వ్యవసాయరంగ అభివృద్ధి 3.2 శాతం రికార్డయితే తరువాత దశకం అనగా 1995 నుండి 2004-05 వరకు చూసినట్లయితే అభివృద్ధి 1.5 శాతానికి పడిపోయింది. దీనికి గల కారణాలను విశ్లేషించినట్లయితే ముఖ్యంగా మన పంటల సరళిలో వచ్చిన మార్పులు, అధిక, అసమంజస వ్యవసాయ పెట్టుబడులు ముఖ్యకారణంగా పేర్కొనవచ్చును. ప్రపంచీకరణ వల్ల ముఖ్యంగా ఆహారేతర పంటల ధరలు పడిపోతూ వచ్చాయి. మరో పక్క సంస్థాగత రుణ సదుపాయం తగ్గిపోయింది, అందువల్ల ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వ్యవస్థ బలపడి వీరి జోక్యంతో వాణిజ్య పంటల వైపు రైతు మొగ్గు చూపడం జరిగింది. ఒక విచిత్రమైన విషయం కూడా మనకు పై పరిస్థితి వల్ల గోచరిస్తుంది. 1990 నుండి 2004 సంవత్సరాల కాలంలో వాణిజ్య పంటల ధరలు గణనీయంగా తగ్గిపోతున్నా పై పంటల ఉత్పత్తి, విస్తీర్ణంలో పెరుగుదల కనపడుతుంది. ఈ పరిస్థితుల వల్ల రైతాంగం తీవ్రమైన ఆదాయ/వ్యయాలను భరించవలసి రావడంతో వందలాది మంది రైతులు ఆత్మహత్యల పాలయ్యారు. ప్రభుత్వ పాలక నిర్లక్ష్యం కూడా పై పరిస్థితికి అద్దం పడుతుంది. 1990-91లో మన స్థూల జాతీయ ఉత్పత్తిలో రెండు శాతం పైగా వ్యవసాయ రంగంపై పెట్టుబడి పెట్టడం జరిగితే 2004-05 వచ్చేసరికి ఈ పెట్టుబడి 1.3

ఇక రక్షణశాఖ వ్యయాన్ని గత సంవత్సరంతో పోలిస్తే ఏకంగా రు. 7000 కోట్లు పెంచివేసి, ఈ సారి రు. 96,000 కోట్లు కేటాయించారు. అందుల్లో రు. 41,922 కోట్లు సైనిక పరికరాలు, యుద్ధ సామగ్రి కొనడానికి కేటాయించారు. ఇది దేశ ప్రజలందరి విద్యా, వైద్య ఆరోగ్య సమాచార సేవల మీద పెట్టే ఖర్చుకు నాలుగు రెట్లు. దీన్ని బట్టే ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో అర్థమవుతుంది. పైగా ఆయుధాల కొనుగోలుకు వెచ్చించే మొత్తంలో నూటికి తొంభైవంతులు బహుళజాతి సంస్థలకే చేరుతాయి.

ఇలా చెపుతూ పోతే, ఒక్కొక్క రంగంలోనూ ఈ బడ్జెట్ ప్రతిపాదనలు ఏ రకంగా బహుళజాతి సంస్థలకు మార్కెట్లు సంపాదించి పెట్టడానికి, లాభాలు సమకూర్చడానికి తోడ్పడతాయో చెప్పవచ్చు. ఈ దేశ ప్రజలు ఆరుగాలం శ్రమతో తమనెత్తుటిని చెమటగా మార్చి సృష్టిస్తున్న లక్షలకోట్ల రూపాయల జాతీయాదాయంలో అత్యధిక భాగాన్ని విదేశీ సంపన్నులకు, బహుళజాతి సంస్థలకు వారి దళారీలైన ఈ దేశపు సంపన్నులకు సమకూర్చి పెట్టే కుట్రకు మరో పేరే బడ్జెట్. అందుకే ఆర్థిక మంత్రి స్వయంగా ఈ బడ్జెట్ ఉపన్యాసం లోనే జాతీయాదాయం పెరుగుదల రేటు కన్న భారత విదేశీ వాణిజ్య పెరుగుదల రేటు రెట్టింపు ఉన్నదని అన్నారు.

ఇక చివరగా, ఇటీవలి కాలంలో ఆర్థిక మంత్రులందరికీ మన ప్రాచీన రచయితల నుంచి, కవుల నుంచి ఏవో సూక్తుల ఉటంకించడం, వాటిని అర్థరహితంగా ప్రస్తావించడం అలవాటయింది. అదే పద్ధతిలో చిదంబరం తమిళ మహాకవి తిరువళ్ళువర్ పద్యాన్ని (కురళ్) ప్రస్తావించారు. ఆ పద్యంలో ఆయన 'నాగలిపట్టే వాడి చేతులు నిర్వ్యాపకంగా ఉన్న రోజున నిర్వాణం పొందిన మహర్షికి కూడ మోక్షం దొరకదు' అనే హెచ్చరిక చేశారట. అందువల్ల వ్యవసాయరంగాన్నీ, రైతునూ కాపాడడానికి తన ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చిదంబరం అన్నారు. రైతులు చేతులు ముడుచుకుని కూచునేలా, ఉరిపోసుకు చనిపోయేలా చేసినదెవరు? దేశాన్ని తాకట్టు పెట్టి, అమ్మివేసి మోక్షం సంపాదించుకుంటున్నదెవరు! ♦

శాతానికి పడిపోయింది. కానీ వాణిజ్య పంటల విస్తీర్ణం పెరిగి వ్యయాలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం జరిగింది. అదే విధంగా 1990-91లో బ్యాంకులు మొత్తం రుణంలో 15.5 శాతం వ్యవసాయరంగ అభివృద్ధికై అందిస్తే 2003-04లో రుణవితరణ 11.85 శాతానికి మించి ఇవ్వకపోవడం గమనార్హం.

వ్యవసాయ రంగ నిరుద్యోగం

వ్యవసాయ రంగం ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 70 శాతం పనివారికి భృతి కల్పిస్తోంది. ఇది అసలే అంతంత మాత్రంగా ఉన్న వ్యవసాయరంగం పై తీవ్రమైన ప్రభావం చూపుతూ ఉంది. వ్యవసాయ ఉద్యోగ భృతి రేటును గమనించినట్లయితే 1977-87 దశకంలో 1.6 శాతం ఉండగా 1987-97 దశకంలో అది 1.15 శాతానికి పడిపోయింది. అదే విధంగా గ్రామీణ వ్యవసాయేతర భృతి శాతం కూడా పైన పేర్కొన్న దశకాలలో 4.3 శాతం నుండి 2.1 శాతానికి పతనమైంది. పై కాలంలోనే రైతు ఆదాయ పెరుగుదలలో స్తబ్ధత ఏర్పడి సగటు ఉత్పత్తి వ్యయం పెరుగుతూ వచ్చింది.

పట్టిక 1లో వివరాలను గమనించినట్లయితే కొన్ని గ్రామీణ వాస్తవాలు కళ్లకు కట్టినట్టు కానవస్తాయి. 1971లో 80.1 శాతంగా ఉన్న గ్రామీణ జనాభా 2001 సంవత్సరానికల్లా 72.2 శాతానికి పడిపోయింది. ఇది గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు జనాభా వలసను సూచిస్తుంది. అదే విధంగా వ్యవసాయదారుల శాతం 1971లో 62.2 శాతం నుండి 2001 సంవత్సరానికి 54.4 శాతం తగ్గడం, వ్యవసాయ కూలీల శాతం అదే కాలంలో 37.8 శాతం నుండి 45.6 శాతానికి పెరగడం గమనిస్తే వ్యవసాయదారులు కాలక్రమేణా వ్యవసాయ కూలీలుగా రూపాంతరం చెందడం కొట్టొచ్చినట్లు కనిపించే వాస్తవం అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

పైన పేర్కొన్న కారణాల వల్ల రైతులే కాక వ్యవసాయ కూలీలు, గ్రామీణ పని వృత్తుల వారు పట్టణాల వలస పట్టవలసిన అగత్యం ఏర్పడింది. చిన్నకారు, సన్నకారు, చేతి వృత్తుల వారికి బ్యాంకు రుణం దొరకడమే గగనమై సంస్థాగత పరపతి వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు కూడా లాభాల కోసమై ప్రాకులాడుతూ నూటికి నూరుపాళ్లూ బలహీన వర్గాలకు అందించవలసిన రుణాలను 10 శాతం మేరకు కుదించడం జరిగింది. సూక్ష్మరుణ సంస్థలు ఆవిర్భవించి వడ్డీ వ్యాపారులను మించి రుణగ్రహీతల నుండి ముక్కుపిండి వడ్డీ వసూలు చేసే వెసులుబాటు కల్పించడం వల్ల చిన్న, సన్నకారు వృత్తులు గ్రామీణ వాతావరణంలో జీవనం సాగించలేక రోడ్డున పడడం జరిగింది. పై కారణాలన్నీ వ్యవసాయ నిరుద్యోగానికి ఇతోధికంగా తోడ్పడ్డాయనడంలో సందేహం లేదు.

పెరిగిన రైతు తలసరి వ్యయం

ఒకప్పటి రైతు జీవన విధానానికి, నేటి ఆధునిక యుగంలో రైతు జీవన శైలికి హస్తిమశకాంతరం కనపడుతోంది. ఆధునిక జీవన విధానంలో రైతు, రైతు కుటుంబం పెను మార్పులకు లోనవుతూ అధిక తలసరి వ్యయం చేయవలసిన పరిస్థితులు ఎదుర్కొంటున్నది.

పట్టిక 2 ను గమనించినట్లయితే అన్ని తరగతుల రైతులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారి తలసరి వ్యయం పెరగడం జరిగింది. కాని తదనుగుణంగా వారి ఆదాయ వనరుల్లో మాత్రం మార్పురాలేదు. ఎన్.ఎస్.ఎస్.ఒ. (నేషనల్ సాంపిల్ సర్వే) ఆధారంగా మన రాష్ట్ర రైతు సాలీనా తలసరి ఆదాయం రు. 9,000 ఉంటే, తలసరి వ్యవసాయ వ్యయం రు. 12,000లు, అంటే సాలీనా రు. 3,000 నష్టంతో నిర్వహించవలసి వస్తోంది. అదే విధంగా తలసరి రైతు కుటుంబ వ్యయం సాలీనా రు. 28,600 ఉంటే అతని సాలీనా ఆదాయం మాత్రం రు. 19,600లే, అంటే రు. 9,000 తన ఆదాయం కంటే ఎక్కువగా ఖర్చు చేస్తున్నాడన్నమాట.

రాష్ట్ర తలసరి పౌరుని ఆదాయం రు. 23,201 (2000 సంవత్సర ప్రాతిపదిక) అదే కాలానికి పట్టణ వాసుల సాలీనా వ్యయం రు. 1,22,446 గా పరిగణించబడింది. ఇటువంటి పరిస్థితుల్లో రైతు ఎంతకాలమని తన మనుగడ సాగించగలడు. పరిస్థితులకు ఎదురీదలేక కడకు ఆత్మహత్యనే శరణ్యంగా భావించడం వల్ల వేల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడడంలో ఆశ్చర్యం లేదు.

పట్టిక 1

గ్రామీణ, పట్టణ జనాభాలో వ్యత్యాసాలు (1971 నుండి 2001 వరకు)

(మిలియన్లలో)

సంవత్సరం	మొత్తం జనాభా	గ్రామీణ జనాభా	వ్యవసాయ దారులు	వ్యవసాయ కూలీలు	మొత్తం గ్రామీణ వ్యవసాయ పనివారు
1971	548.2	439.0	78.2	47.5	125.7
	(100.0)	(80.1)	(62.2)	(37.8)	(100.0)
1981	683.3	523.9	92.5	55.5	148.0
	(100.0)	(76.7)	(62.5)	(37.5)	(100.0)
1991	846.4	628.9	110.7	74.6	185.3
	(100.0)	(74.3)	(59.7)	(40.3)	(100.0)
2001	1028.7	742.6	127.3	106.8	234.1
	(100.0)	(72.2)	(54.4)	(45.6)	(100.0)

బ్రాకెట్లలో ఆయా జనాభా శాతాన్ని సూచించడం జరిగింది

ఆధారం : వ్యవసాయ గణాంక రిపోర్టు 2005 (డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటస్టిక్స్, భారత ప్రభుత్వం)

శాస్త్రీయత లేని గిట్టుబాటు ధరలు

కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో రైతుల పంటలకు గిట్టుబాటు ధర లభించడానికి వ్యవసాయ ధరల నిర్ణాయక కమిటీ (సి.ఎ.సి.పి.) ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ రైతుల వ్యవసాయ పెట్టుబడులను, ప్రస్తుత వ్యవసాయ ఉత్పాదకాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమైన పంటల గిట్టుబాటు ధరలను నిర్ణయించడం జరగాలి. కానీ ఈ నిర్ణాయక కమిటీ వ్యవసాయాన్ని

పట్టిక 2 గ్రామీణ రంగంలో తలసరి వ్యయాలు (రోజుకు రూపాయలలో)			
తలసరి	1983-84	1993-94	2003-04
పెద్దరైతు	51.61	83.18	197.64
మధ్యరైతు	35.19	42.95	168.30
చిన్నరైతు	27.20	33.80	158.80
వ్యవసాయ కూలి	24.64	40.43	140.43
స్వయం ఉపాధి	45.07	45.01	165.21

ఆధారం : గ్రామీణ ఉపాధి పై జిల్లా వ్యవసాయ బులెటిన్, భారత ప్రభుత్వం, వివిధ వ్యవసాయ సర్వేలు

ప్రభావితం చేస్తున్న వివిధ అంశాలను పరిగణనలోకి తీసికోవడం లేదు. ముఖ్యంగా ఈ గిట్టుబాటు ధరలను రైతు పంటలను విత్తే ముందుగా (ఖరీఫ్, రబీ పంటల ప్రారంభంలో) తెలియజేయడం జరగాలి. కానీ పంట విత్తిన తర్వాత అంటే ఆగస్ట్, నవంబర్ కాలంలో ప్రకటించడం వల్ల రైతుకు ఒనగూడే లాభం అంతంత మాత్రమే. వాణిజ్య ఉత్పత్తుల నిర్ధారణలో ఉత్పత్తిదారులు అన్ని రకాల నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. కాని వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణయంపై వ్యయాలేవో పరిగణించకపోవడం అన్నదాతను చిన్నచూపు చూడడమే.

పైన వివరించిన పరిస్థితుల ప్రాబల్యం నుండి రైతన్నలను వెలికి తీసుకొని రావలసిన ఆవశ్యకత ఎంతయినా ఉంది. లేకుంటే వ్యవసాయం వృత్తిగా స్వీకరించే వారే లేక మన ఆహార లభ్యత కోసం మరలా విదేశాలను యాచించవలసిన అగత్యం ఏర్పడుతుంది. ఇందుకు ముఖ్యంగా దీర్ఘకాలిక ప్రణాళిక ఆవశ్యకతను మన ప్రజాప్రతినిధులు, పాలకులు గుర్తించడం ఎంతో అవసరం. ప్రస్తుత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ దిశగా దృష్టి సారించి నీటి పారుదల రంగంపై అత్యధిక బడ్జెట్ కేటాయించడం జరిగింది. అదే విధంగా రు. 13 వేల కోట్ల రుణ ప్యాకేజీ వ్యవసాయరంగం ఎదుగుదలకు కేటాయిచడం జరిగింది. పై చర్యలు కొంత వరకు రైతు కంటి తుడుపు చర్యలుగా పేర్కొనవచ్చు. కాని సమస్య మూలాల్ని ప్రభావితం చేయగల చర్యలు చాలా చేపట్టవలసి ఉంది. స్థూలంగా అవి :

పట్టిక 3 1980-2004 మధ్య వ్యవసాయ కూలీల నిజవేతనాల పెరుగుదల		
వ్యవధి	వేతనాల పెరుగుదల శాతం	
	పురుషులు	స్త్రీలు
1980-89	4.70	4.50
1990-99	1.50	1.41
2000-04	0.10	0.10

ఆధారం : సి.ఎ.సి.పి. రిపోర్ట్ అండ్ ఎన్.ఎస్.ఎస్.ఒ ఎకనామిక్ ప్లానింగ్ ఇన్ ఇండియా, 1991-52 నుండి 2006-07 వరకు

1. రైతుకు సామాజిక భద్రత కల్పించడం

దీనిలో పేర్కొనతగినవి రైతులకు ఆరోగ్య బీమా కల్పించడం, కర్షక వృత్తి చేపట్టిన పట్టభద్రులందరికీ తగిన పెన్షన్ స్కీమ్ పథకాలను అమలు పర్చడం, వారి సంతానానికి తగిన విద్యావకాశాలు, స్కాలర్‌షిప్స్ కల్పించి, విద్య వ్యయ భారాన్ని తగ్గించి ప్రోత్సహించడం. పైన పేర్కొన్న పథకాల అమలుకు ఒక రైతు సామాజిక భద్రత బోర్డును స్థాపించి, దానికి రైతు సంక్షేమం కోరే వ్యవసాయ పట్టభద్రులను నియమించితే కొంత వరకు రైతుకు న్యాయం జరుగుతుంది. ఈ దిశలో జాతీయ రైతు కమీషన్ చేసిన సిఫారసులను యధావిధిగా అమలు పరచవలసిన అవసరం ఉంది.

2. గ్రామీణ సౌకర్యాల మెరుగుదల

నేటి అత్యాధునిక కంప్యూటర్ యుగంలో కూడా అనేక గ్రామాల్లో కనీస పౌర సదుపాయాలు కల్పించడంలో మన ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. రక్షిత మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు, రవాణా సౌకర్యాలు, మార్కెటింగ్ వ్యవస్థ, విద్యాలయాలు, వైద్యశాలలు ప్రతి గ్రామానికి అందుబాటులో ఉండాలి. పై సౌకర్యాలన్ని పరోక్షంగా, ప్రత్యక్షంగా అత్యుత్తమ మానవ వనరుల్ని సృష్టించేందుకు, తద్వారా కర్షక లోక అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడగలవనుటలో ఎలాంటి సందేహం లేదు.

3. గ్రామీణ రంగం విద్యుత్ సరఫరాలో సంస్కరణలు

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా మనదేశంలో ఎన్నో గ్రామాలు నిరంతర విద్యుత్ సరఫరాకు నోచుకోలేదు. కనీసం 6 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కూడా కొన్ని గ్రామాల్లో జరగడం లేదు. గ్రామీణ రంగంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు విద్యుత్ సరఫరా అత్యావశ్యకం. కనీస పక్షంలో 12 నుండి 15 గంటల నిరంతర విద్యుత్ సరఫరా మన ప్రస్తుత గ్రామీణ రంగ అభివృద్ధికి అత్యవసరం.

4. నీటి వనరుల పునరుద్ధరణ

తక్కువ వ్యయ నిర్వహణ గల గ్రామీణ నీటి వనరుల పునరుద్ధరణ, సమష్టి బాధ్యత గల నిర్వహణ వ్యవసాయ పురోభివృద్ధికి అత్యవసరం. ఒక ఆర్థిక సర్వే ప్రకారం ఒక ఎకరానికి నీరందించడానికి భారీ ప్రాజెక్టు వ్యయం సరాసరి లక్ష రూపాయలైతే, గ్రామీణ నీటి వనరుల అభివృద్ధితో అదే ఎకరానికి రు. 200 కన్నా ఎక్కువ ఖర్చుకాదు అని నిర్ధారించబడింది.

5. శాస్త్రీయ పద్ధతుల్లో మద్దతు ధర నిర్ణయం

నిరంతరం శ్రమించే కర్షకునికి కంటి తుడుపు సబ్సిడీల కన్నా న్యాయ సమ్మతమైన గిట్టుబాటు ధర శాస్త్రీయ పద్ధతుల్లో అమలు చేయడం అన్నింటి కన్నా ముఖ్యం. ప్రస్తుత పద్ధతుల్లో వ్యవసాయ ఉత్పత్తులకు నిర్ణయిస్తున్న కనీస మద్దతు ధర రాజకీయ ప్రేరితమైనది. ఏ పంట ఉత్పత్తికైనా అయ్యే సగటు వ్యయం పై యాభై శాతం అధికంగా పంట మద్దతు ధర లభించాలి. పదేళ్లకాలంలో మెరుగైన దిగుబడి వచ్చిన మూడేళ్ల సగటును సాధారణ దిగుబడిగా పరిగణనలోకి తీసుకోవడం జరగాలి. రైతులకు గిట్టుబాటు ధరలు లభించాలంటే ఆహార ధాన్య నిల్వ సదుపాయాలను ప్రైవేట్ రంగంలో కూడా భారీగా ప్రోత్సహించాలి. పలు పంటలలో మిగులు ఉత్పత్తి నమోదవుతున్నా ప్రభుత్వం వాటి

స్వాతంత్ర్యానంతరం టెక్నాలజీ, గ్రామీణాభివృద్ధి

– డా. తోట సత్యనారాయణ, బండి శ్రీనివాస్

(ఫిబ్రవరి 2007 నుంచి సీరియల్‌గా వస్తున్న ఈ వ్యాస సహ రచయిత బండి శ్రీనివాస్ పేరు గత సంచికలలో పొరపాటున అచ్చుకాలేదు, గమనించగలరు. – సం.)

(గత సంచిక తరువాయి..)

పార్ట్ – 4

శ్వేత విప్లవం – టెక్నాలజీ

అంతర్జాతీయ ప్రభుత్వ పరమైన వ్యవస్థలు, మూడవ ప్రపంచ ప్రభుత్వాలు కలిసి మరో ముఖ్యమైన అభివృద్ధి వ్యూహాన్ని శ్వేత విప్లవ టెక్నాలజీతో ప్రపంచంలోని పేదలకు ఆహారం, ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో ఈ టెక్నాలజీని అభివృద్ధి చేశాయి. 1975 సంవత్సరంలో ఆపరేషన్ ఫ్లడ్–ఒకటి (ఒ.ఎఫ్–I)ను యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ వారి ఆర్థిక, సాంకేతిక సహాయంతో భారతదేశంలో ప్రపంచ ఆహార కార్యక్రమం కింద ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యం, మెరుగైన జీవనాన్ని, అదనపు ఉపాధిని, పోషక విలువలుగల ఆహారాన్ని (పేదలకు, చిన్న, సన్నకారు రైతులకు) సరఫరా చేసేందుకు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ఉద్దేశ్యాల్ని పూర్తి చేసేందుకు జాతీయ డైరీ అభివృద్ధి బోర్డు (ఎన్.డి.డి.బి), కేంద్ర ప్రభుత్వం స్వయంప్రతిపత్తితో జాతీయ స్థాయిలో, ఆనంద్‌మిల్క్ లిమిటెడ్‌ను డైరీ పరిశ్రమలో నెలకొల్పినారు. దీనికి అదనంగా ఇండియన్ డైరీ కార్పొరేషన్ (ఐ.డి.సి) నేషనల్ మిల్క్ గ్రిడ్ (ఎన్.ఎం.జి.) ను అమూల్ లిమిటెడ్ పద్ధతిలోనే వివిధ రాష్ట్రాల్లో వివిధ పాల సమాఖ్య సొసైటీల్లో సమీకృత ఉత్పత్తి ప్రక్రియల్లో, మార్కెటింగ్, పాల ఉత్పాదకాల్లో వీటి ద్వారా అభివృద్ధి పరుస్తారు. వీటి ఫలితంగా, ఆపరేషన్ ఫ్లడ్ ఒకటిలో పాల ఉత్పత్తి, సేకరణ, మార్కెటింగ్ చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. యూనియన్ ఇంటర్ ఏజెన్సీ మిషన్ ఆపరేషన్ ఫ్లడ్–1 సామర్థ్యాన్ని సమీక్షించి భారతదేశంలో పాల ఉత్పత్తిలో శక్తివంతమైన పరికరంగా ఉంది అని పేర్కొంది. అంతే కాకుండా, వివిధ కుటుంబ యాజమాన్యాలలో వీటి ఉత్పత్తుల ద్వారా ఉపాధి, ఆదాయం సమకూర్చుకుంటున్నాయని ఇంకొక అధ్యయనం పేర్కొంది.

ఇదే తరహాలో 1979, 1985లో భారత ప్రభుత్వం ఆపరేషన్ ఫ్లడ్ రెండు (ఒ.ఎఫ్–II), ఆపరేషన్ ఫ్లడ్ మూడు (ఒ.ఎఫ్–III) కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. ఆపరేషన్ ఒ.ఎఫ్. I & ఒ.ఎఫ్. II కార్యక్రమాలు అమూల్ తరహాలో ఉత్పత్తి ప్రక్రియలో ఉద్యోగిత, ఆదాయాన్ని రైతుల్లో పెంచగలిగిస్థాయి. ఈ కార్యక్రమాల ద్వారా దేశంలో సామాజిక, ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు దోహదపడినాయి. ఆపరేషన్ I, II, III కార్యక్రమాలు అత్యంత విజయవంతంగా, అర్థవంతంగా, సహకారంగా కొనసాగినాయి. అది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్.డి.డి.బి, ఐ.డి.సి, రూరల్ ప్రొడ్యూసర్స్ కోపరేటివ్ యూనియన్, ఫెడరేషన్, ఐ.జి.ఓ అనేక డైరీ కోపరేటివ్ సొసైటీలు, డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్స్ ద్వారా శ్వేత విప్లవ టెక్నాలజీ మిషన్ కింద పాల ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతిని సాధించాయు. వీటితో పాటు ఐ.ఆర్.డి.పి. పథకం కింద, అనేక వేల మంది పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు, జెర్సీ ఆవులను, ముర్రాజాతి బర్రెలను, గొర్రెలను అందజేసి, వాటి ద్వారా పాల ఉత్పత్తులను పెంచగలిగారు.

డైరీ కోపరేటివ్ సొసైటీలు, డైరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్స్ ద్వారా ఇటు వినియోగదారులకు, అటు పాల ఉత్పత్తిదారులకు సహాయకారిగా ఉన్నాయి. పశు సంవర్ధక పథకాలు ఐ.ఆర్.డి.పి. కింద మధ్య, చిన్న రైతులకు భూమిని, ఆస్తులను సమకూర్చకోవడానికి ఈ పథకాలు ఎంతో లాభాన్ని గడించిపెట్టాయి. ఈ పథకాల ఉపయోగాలు పేదలకు తెలియకపోవడం, లబ్దిదారుల సామాజిక ఆర్థిక పరిస్థితుల కారణంగా,

---

దిగుమతుల్ని ప్రోత్సహించడం మనం గమనిస్తూ ఉన్నాం. ఇటువంటి రాజకీయ, స్వప్రయోజన అడ్డదారుల్ని మానుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల్ని సమీక్షించేలా ధరల నిర్ణాయక సంఘానికి (సి.ఎ.సి.పి.) కొత్త రూపునివ్వాలి.

6. జాతీయ విత్తన విధానం రూపకల్పన

నమ్మకమైన, మెరుగైన దిగుబడినిచ్చే విత్తనం లభించడం నాటికీ, నేటికీ రైతులకు కలలో మాటే. ప్రస్తుత జన్యుమార్పిడి విత్తనం (బిటి కాటన్) అనేక రాష్ట్రాల్లో పత్తి రైతుల ఆత్మహత్యలకు ఒక ముఖ్యకారణమైన విషయం మరువలేం. విత్తన లోపాల వల్ల ఏటా రైతులు కొన్ని వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారన్నది పచ్చినిజం. నష్టపోయిన రైతన్నలకు సరైన పరిహారం ఇచ్చేందుకు ఉద్దేశించిన విత్తన చట్టం – 2004 కేంద్రం అనుమతికై ఎదురుచూపులు చూస్తుంది. దీనిపై ఏర్పడ్డ కమిటీ పదిసార్లు సమావేశమైనా ఏ నిర్ణయం వెలువరించలేదు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాల ధరకు బహిరంగ మార్కెట్ ధరకు పెద్ద వ్యత్యాసం లేకపోవడం గమనార్హం. విత్తన గ్రామ పథకం ద్వారా రైతు పొలాల్లో విత్తనోత్పత్తి వ్యాపారుల నుండి కొనుగోలు చేసే విత్తనం కన్నా శ్రేష్ఠమైనది. రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత విత్తన కంపెనీల అవగాహన ఒప్పందానికి చట్ట బద్ధత కల్పించి నియంత్రించడం అత్యావశ్యకం. కఠినమైన చట్టాల్ని తయారు చేసి విత్తన పురుగు మందుల ధరలను అదుపులో తేవడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.

ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించి, పై చర్యలన్నీ చేతల్లో చూపి, తమకు అధికారం వస్తే మరొక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోకుండా ఆపుతానన్న డా. రాజశేఖరరెడ్డి అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీని క్రియ రూపకంలో చూపితే తప్ప, రైతు తలెత్తుకు తిరిగే పరిస్థితి సమకాలీన పరిస్థితుల్లో రాదని ఘంటాపథంగా చెప్పగలం. ♦

పథకాల ఎంపికలో లబ్ధిదారులకు స్వేచ్ఛ లేకపోవడం, పేదల పట్ల వ్యతిరేక దృక్పథం కలిగిన అధికారులు, పథకాల అమలులో పైరవీకారులు పాల్గొనడం, పేదలకు, రైతులకు నియమ నిబంధనలు తెలియకపోవడం, ఈ పథకాల రూపకల్పన మొదలగు అంశాల అమలులో బలహీనతలు వలన ఇవి అంతగా విజయాలను సాధించలేకపోయాయి. ఇంకొక కారణమేమంటే శ్వేత విప్లవ టెక్నాలజీ వలన గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సంబంధాలు దెబ్బతిన్నాయి. డైరీ టెక్నాలజీ వల్ల పాలు, నెయ్యి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండక అధిక ధరలతో లభ్యమౌతున్నాయి.

డైరీ టెక్నాలజీ వలన అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. పాలను నిల్వ చేసుకోవడం, పాలనుండి వెన్నను వేరు చేయడం, వీటి ఉత్పత్తి ద్వారా అనేక ఇతర ఉత్పత్తులను అనగా పాల పొడి, నెయ్యి, బేబి ఫుడ్స్, స్కిమ్మడ్ మిల్క్, బిస్కెట్లు, చాక్‌లెట్లు, ఐస్‌క్రీంలు మొదలగు తయారు చేసుకోవచ్చు.

భారత పారిశ్రామిక వేత్తలు, బహుళజాతి సంస్థలు ఆపరేషన్ I, II, III కార్యక్రమాల కింద 2,600 కంపెనీలను స్థాపించారు. ఈ కంపెనీలు అనగా గ్లాస్కో, నెస్లిల్, క్యాడ్‌బరీస్, నోబుల్ సోయా, క్వాలిటీ ఐస్‌క్రీం, కిసాన్ ఫుడ్స్, ఎచ్.ఎం.ఎం. లిమిటెడ్ (హార్లిక్స్), జనరల్ ఫుడ్స్, రేమండ్స్ వులెన్, ఆపిల్ ఇండస్ట్రీస్, ఆదీ గొద్రెజ్ మొదలగు వాటి ద్వారా ఉత్పత్తులను అందిస్తున్నాయి. వీటి ఉత్పత్తుల వల్ల పేద ప్రజలకు ప్రయోజనం చేకూర్చలేక పోతున్నాయి. కానీ, బహుళ జాతి సంస్థలకు మార్కెట్లను విస్తరింపజేసి అధిక లాభాలను గడించి పెడుతున్నాయి.

బయోటెక్నాలజీ – విప్లవం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అంతర్జాతీయ సంస్థలైన యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఇంటర్ నేషనల్ డెవలప్‌మెంట్ (యు.ఎస్.ఎ.ఐ.డి), అనేక బహుళజాతి సంస్థలు కలిసి వ్యవసాయ పరమైన బయోటెక్నాలజీ పరిశోధన, అధ్యయనాలను ప్రోత్సహిస్తున్నాయి. పెరుగుతున్న జనాభా ఒత్తిడులకు అనుగుణంగా భూమిని ఉపయోగించే పద్ధతులను, సాంకేతిక ఆర్థిక సంబంధాలను సంక్లిష్టతను, ప్రపంచ ఆర్థిక సరళీకరణను దృష్టియందుంచుకొని బయోటెక్నాలజీ ప్యాకేజీ కార్యక్రమాలను చేపట్టినాయి. ఈ ప్యాకేజీ కింద వ్యవసాయంలో ప్లాంట్ బయోటెక్నాలజీల సంవృద్ధిని పెంపొందించే శిల్ప పద్ధతుల స్థాయిలను పెంచడం, ఉత్పత్తుల్లో రోగ నిరోధక క్లోన్స్ ఉత్పత్తి చేయడం, హైబ్రిడైజేషన్, డి.ఎన్.ఎ. టెక్నిక్స్‌ను వృద్ధి చేయడం మొదలైనవి.

భారతదేశంలో 1980 నుండి పంచవర్షప్రణాళికల్లో వ్యవసాయ పరమైన బయోటెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యతనివ్వడం జరిగింది. ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా హైబ్రిడ్ విత్తనాలు, ప్లాంట్స్, భూవినియోగంలో పద్ధతులను తెలియపర్చడం ద్వారా ఉత్పత్తి ప్రక్రియల్లో అనేక మార్పులు చోటు చేకుసున్నాయి. అనేక పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో బయోటెక్నాలజీ ప్యాకేజీకి అధిక ప్రాధాన్యతనివ్వడం జరిగింది. విత్తన ప్లాంట్స్‌ను చిన్న, ఉపాంత రైతులకు సరఫరా చేయడం, ఏది ఏమైనప్పటికీ బహుళజాతి కంపెనీలు, ప్రైవేట్ కంపెనీలు గుత్తాధిపత్యం కలిగి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా విత్తనాలను, మొక్కలను ప్రత్యక్షంగా రైతులకు సరఫరా చేస్తున్నాయి. ప్రభుత్వ ఎజెన్సీలు వ్యవసాయ శాఖ, వ్యవసాయ పరిశోధన ఏజెన్సీలు బయో టెక్నాలజీ ప్యాకేజీలో విఫలం చెందాయి. అనేక పరిశోధనలు, అధ్యయనాలు ఈ విషయాన్ని వెల్లడించినాయి. ప్రస్తుతం అనేక బహుళజాతి సంస్థలు బయోటెక్నాలజీలో మేధోపరమైన యాజమాన్య హక్కులను కలిగి ఉండి, ఆధిపత్యాన్ని వహిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయ బయోటెక్నాలజీతో నూతన సమాచారాన్ని, శాస్త్రీయమైన పద్ధతిలో చిన్న రైతులకు అందుబాటులో లేక సమస్యల పరిష్కారం తెలియక సాంకేతిక మార్పులు – రైతులకు మధ్య సాంకేతికపరమైన విజ్ఞానం లేక సాంకేతిక అంతరాలు ఏర్పడుతున్నాయి.

భారతదేశంలో బయోటెక్నాలజీ, బయో డైవర్సిటీ విప్లవాల ఫలితాలు బహుళజాతి సంస్థల మార్కెట్‌ను విస్తరింపజేసుకొవడానికి దోహదపడుతున్నాయి. కూరగాయలు, పండ్ల విత్తనాలు, అధిక దిగుబడి నిచ్చే స్థానికేతర వంగడాలు మొదలగు వాటిల్లో అనేక రకాలైన రోగాలకు గురవుతున్నాయి. వాటిని సంరక్షించుకునేందుకు ఎరువులు, పురుగుమందులను వాడుతున్నారు. వ్యవసాయరంగంలో 70–80 శాతం ఎరువులు, పురుగుమందులను బహుళజాతి సంస్థల ద్వారానే సమకూర్చబడుతున్నాయి. రైతులు ఈ సంస్థల ద్వారా పొందిన కల్తీ రసాయనాలు, పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు మొదలగునవి వాడటం వలన పంటలను నాశనం చేస్తున్నాయి. పైగా పంటలపై పెట్టుబడులను హెచ్చించి వడ్డీ వ్యాపారస్తుల నుంచి అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని వ్యవసాయంలో వయ్యం చేస్తున్నారు. కానీ రైతులకు సరైనా గిట్టుబాటు లేక, తిరిగి రుణాలు తీర్చలేక పోతున్నారు. ఫలితంగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బయోటెక్నాలజీ విప్లవం వలన అనేక బడా రైతులే ప్రయోజనాలు పొందుతున్నారు. చిన్న, సన్నకారు, ఉపాంత రైతులు అంతంత మాత్రంగానే ప్రయోజనాలు పొందగలుగుతున్నారు. ఈ పరిస్థితి వల్ల ప్రగతిశీల రైతులకు, పేద రైతులకు మధ్య విపరీతమైన అంతరం ఏర్పడుతుంది.

విమర్శనాత్మక పరిశీలన

ప్రపంచీకరణ క్రమం ఆవిష్కరణలో భాగంగా అభివృద్ధికి సంబంధించిన ప్రాపంచిక దృక్పథంపై రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో మూడు దశాబ్దాలుగా తృతీయ ప్రపంచ దేశాల ప్రధాన స్రవంతి అభివృద్ధి సిద్ధాంతాలు, వ్యూహాలు పునాదిగా నిలిచిన సంస్థాపరమైన వాదనలపై తీవ్రస్థాయిలో దాడి జరుగుతుంది. అభివృద్ధికి సంబంధించిన ఇమేజ్ లేక ప్రపంచ దృక్పథం లేక అభివృద్ధి స్వప్నం పాశ్చాత్య దేశాల తరహాకు మారుపోవడంగా చూడబడుతుండేది. మానవ అభివృద్ధి సిద్ధాంతం ప్రజావనరులపై పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

1970లో ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ప్రభుత్వ పరవ్యవస్థ ప్రతిపాదించిన అభివృద్ధి సిద్ధాంతాల్లో పాశ్చాత్య నమూనాలు, పేదరికంపై ప్రత్యక్ష చర్యలకు పూనుకొనేవి. కాని ప్రస్తుతం (ఐ.జి.ఒ) ఇచ్చే సలహాల్లో సమానత్వం, గ్రామీణ పేదలు అభివృద్ధి ప్రక్రియల్లో పాల్గొనేటట్లు చేయడం అంతేకాక, అందుబాటులో ఉన్న సాంకేతిక లేక ఇన్‌పుట్స్‌ను టార్గెట్ గ్రూపుకు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

కొత్త సరళీకృత చర్యలకు ప్రపంచ బ్యాంకు ద్వారా తిరిగి పెట్టుబడులు, టెక్నాలజీని బదిలీ చేయడం, అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ (ఐ.ఎల్.ఒ) ద్వారా మౌళిక అవసరాలను కల్పించడం, సంపూర్ణ ఉద్యోగితను కల్పించడం, ఆహారం, వ్యవసాయ వ్యవస్థ (ఎఫ్.ఎ.ఒ) ద్వారా వ్యవసాయ సంస్కరణలు చేపట్టడం, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎ.డి.బి) ద్వారా సమీకృత గ్రామీణాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఎడిబి ద్వారా సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది.

1978-79 లో దంతెవాల కమిటీ సూచన ఆధారంగా రూపొందించబడ్డదే సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ముఖ్యంగా గ్రామీణ పేద ప్రజల ఆదాయం, జీవన ప్రమాణం మెరుగు పర్చుటకు, ప్రగతి సాధనాల్లో, ప్రక్రియల్లో పాల్గొనేందుకు వీలుగా సమాజంలోని భౌతిక, మానవ వనరులను పూర్తిగా వినియోగించుకోవాలనే అంతిమ ఉద్దేశ్యంతో, వ్యవసాయం, అడవుల పెంపకం, చేపల వృద్ధి, గ్రామీణ చేతి వృత్తులు మొదలగు వాటితో పాటు సాంఘిక, ఆర్థిక సముదాయక నిర్మాణాలను పటిష్ఠవంత చేయడానికి కావల్సిన అభివృద్ధి వ్యూహాలను, విధానాలను, కార్యక్రమాలను రూపొందించుటయే సమగ్ర గ్రామీణాభివృద్ధి భావనగా పేర్కొన్నారు.

సమగ్ర గ్రామీణాభివృద్ధి భావనను వివరిస్తూ ప్రపంచబ్యాంక్ మరొక సులభతరమైన భావనను ముందుంచింది. బ్యాంక్ దృష్టిలో గ్రామీణ ప్రాంతాల్లో నివసించే తక్కువ ఆదాయం గల ప్రజానీకం యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రయత్నిస్తూ ప్రజల్ని స్వయం పోషక స్థాయికి ఎదిగేట్టుగా రూపొందించడమే సమగ్ర గ్రామీణాభివృద్ధి తెలిపింది.

సమగ్ర గ్రామీణాభివృద్ధి లోని ముఖ్యమైన అంశాలు.

- ❖ సహజవనరులను శాస్త్రీయంగా, క్రమబద్ధంగా వినియోగించుకోవడం.
- ❖ అన్ని రకాల వనరులను వినియోగించుకునేటప్పుడు వాటి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించడం.
- ❖ ఉత్పాదక శక్తిని పెంచడానికి అందరికి పని చేసే అవకాశం కల్పించడం.
- ❖ బడుగువర్గాల, అల్ప ఆదాయవర్గాలను, జీవన ప్రమాణాన్ని పెంచి వారి ఆరోగ్య, విద్యా, నివాస అవసరాలను తీర్చేందుకు వీలుగా సేవల సామర్థ్యాన్ని పెంచడం.
- ❖ పట్టణ గ్రామీణ ప్రాంతాల మధ్య పేద, ధనిక వర్గాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించి అందరికీ సమాన అవకాశాలను కల్పించడం.
- ❖ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని స్వయం పోషక స్థాయికి తీసుకువెళ్లడం.
- ❖ సమాజం వృద్ధి చెందడానికి శాస్త్రీయ, సాంకేతిక ఉత్పత్తిని పెంచి ప్రజల కనీస అవసరాలు తీరేటట్లు చూడడం.
- ❖ ప్రగతి ప్రక్రియల్లో ప్రతి ఒక్కరూ చైతన్యవంతంగా పాల్గొనేందుకు అవకాశాలు కల్పించడం.

గత ఐదు దశాబ్దాల భారతదేశ గ్రామీణాభివృద్ధి వ్యూహాల అమలులో జరిగేటటువంటి అనుభవాలను సమతౌల్యంగా అంచనా వేసి పరిశీలిస్తే ఈ కింది లోపాలను గుర్తించవచ్చు.

- ❖ అభివృద్ధి కార్యకలాపాల రూపకల్పన – అమలు దశల్లో ఉద్యోగ స్వామ్య ప్రమేయం అధికంగా ఉండడం.
- ❖ అభివృద్ధి ప్రక్రియను ఒక ప్రభుత్వ విధానంగా రూపొందించే క్రమంలో గ్రామస్థాయి ఆశ్రితుల భాగస్వామ్యం అతి తక్కువ స్థాయిలో ఉండటం.
- ❖ రాజకీయ ప్రాతినిథ్యాన్ని వహించే గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రతినిధులు పాక్షికమైన గ్రూపు ప్రయోజనాలను సాధించుకునే స్వభావాన్ని కలిగి ఉండి సమిష్టి ప్రయోజనాలను విస్మరించడం.
- ❖ గ్రామీణాభివృద్ధి స్థితిగతులపై జరిపిన శాస్త్రీయ అధ్యయనాలు, కమిటీల నివేదికల సారాంశాలకు ప్రభుత్వ విధాన ప్రక్రియకు ఉండవలసినంత సహాయ సంబంధం ఉండకపోవడం.
- ❖ బుద్ధి జీవుల ఆధిపత్యంలో కొనసాగిన అభివృద్ధి సంస్థా నిర్మాణాలు మధ్య తరగతి ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకునే విధంగా మల్చబడి, అభివృద్ధి నిధులలో అధిక శాతం సంస్థాపక, నిర్మాణ వ్యయానికి హెచ్చింపబడడం.
- ❖ గ్రామీణాభివృద్ధి వ్యూహాలు వనరుల వినియోగానికి ఇచ్చిన ప్రాధాన్యత గ్రామీణ సమాజ సంబంధాలను మార్చడంపైన ఇవ్వలేదు.
- ❖ గ్రామీణాభివృద్ధికి మూలం వ్యవసాయ రంగంలో ఏర్పడిన వినూత్న పరిశోధన ఫలితాల అన్వయింపు. వ్యవసాయరంగంలో వంగడాలపై కొల్లలుగా పరిశోధన అధ్యయనాలు చేపట్టబడ్డాయి. కానీ అవస్థాపక రంగాన్ని వృద్ధి చేయడంలో మాత్రం వెనుకంజనే వేసారు. ధాన్యపు నిల్వలకు సంబంధించి, ఆర్థిక దళారుల బెడదను తప్పించడానికి ప్రత్యామ్నాయ రైతాంగ స్ఫూర్తి కలిగిన సహకార మార్కెట్ విధానాన్ని ప్రోత్సహించలేక పోయాయి. దీనివల్ల రైతుకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొందగలిగే అవకాశాలు సన్నగిల్లాయి. ఉద్యోగి బృందంపై ఆధారపడే పరాధీనత పెరిగింది. వ్యవసాయ సాంకేతికరంగం పాక్షికంగా వృద్ధి చెందడం, వంగడాల పరిశోధన, దిగుబడులు అధికం కావడం భారతదేశ గ్రామీణాభివృద్ధి వ్యూహాలు సాధించిన సాపేక్షిక ప్రయోజనాలు.

సరళీకరణకు మానవతా దృష్టిని జోడించే తీరిక, సరళీకరణ మార్గాన పయనించే దేశానికి ఉండదు. ఆ మార్గం నుంచి వైదొలగవలసి ఉంటుంది. అది జరగాలంటే ఆ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్తున్న శక్తులకు వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో వివిధ వర్గాలను సమీకరించాలి.

ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలైన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు అమల్లోకి వచ్చాయి. లాభాపేక్ష మినహా ప్రజాహితం పట్టని, మానవీయ కోణంలేని ఈ ఆర్థిక విధానాలు సామాన్య ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. దీని వల్ల ఉపాధి అవకాశాలు దారుణంగా తగ్గాయి. ప్రభుత్వం వ్యవసాయరంగానికి నిధులు కేటాయించక పెట్టుబడులు తగ్గాయి. మూలఆస్తులు పెరగకపోవడం, రైతాంగానికి అందించాల్సిన ఉత్పాదకాల సరఫరాలో

ప్రభుత్వ వాటా తగ్గిపోవడం, వీటి కోసం ప్రైవేట్ వ్యాపారస్తులు కార్పొరేట్ రంగంపై ఆధారపడి వారి దోపిడీకి గురౌతున్నారు.

కార్పొరేట్ వ్యవసాయం/కాంట్రాక్ట్ వ్యవసాయం వ్యవసాయం గాదు. భారీ పెట్టుబడులు యంత్రాల ద్వారా వేలాది ఎకరాల్లో సాగే కార్పొరేట్ లేదా కాంట్రాక్ట్ వ్యవసాయంలో మానవ శ్రమ చాలా తక్కువగా ఉంటుంది. దీంతో వారు ఉపాధి కోల్పోతారు. సరళీకరణ విధానాల మూలంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు వగైరా ధరలు పెరుగుతున్నాయి. నీటితీరువా, విద్యుత్ రేట్లు పెరుగుతున్నాయి. కౌలుదార్లు భూముల నుండి దూరమైపోతున్నారు. అభివృద్ధి చెందిన శాస్త్ర పరిజ్ఞానం, హెచ్చు ఉత్పాదకత, అధిక లాభాలు సాధించడానికి సింఫోనిక్ అగ్రి కల్చరల్ సిస్టమ్స్ కావాలనీ ప్రభుత్వ విధానంలో ప్రకటించారు. అంటే ఉత్పత్తి ప్రాసెసింగ్ నుండీ మార్కెటింగ్ వరకు ఒక సంస్థ ద్వారా సాగించాలని ప్రతిపాదించారు. కార్పొరేట్ కంపెనీ ఉత్పత్తి నుండి అమ్మకం వరకు ప్రవేశం ఉంటుంది. నేడు విదేశీ పెట్టుబడులతో వ్యవసాయాభివృద్ధి గావించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అందుకుగాను, పెప్సీ కంపెనీ వ్యవసాయ రంగంలోకి తన పెట్టుబడిని మళ్లిస్తుంది. కార్పొరేట్ కంపెనీల దృష్టి బాసుమతి బియ్యంపై పడింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో బాసుమతి బియ్యం పండించబడుతున్నవి. అమెరికా, యూరోపియన్, గల్ఫ్ దేశాల్లో ఈ బియ్యానికి మంచి మార్కెట్ ఉంది. ఈ సంవత్సరం పంజాబ్‌లో ఐదు లక్షల ఎకరాల్లో బాసుమతి ఉత్పత్తి చేయడానికి రైతాంగంతో పెప్సీఫుడ్స్ కంపెనీ కాంట్రాక్టు కుదుర్చుకుంది. రైతాంగానికి కావలసిన ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతర అవసరమైన పెట్టుబడులు, పెప్సీ కంపెనీ అందజేస్తుంది. ఉత్పత్తి అయిన బాసుమతి బియ్యం పెప్సీకి అమ్మాలి. పెప్సీ ఫుడ్స్ సంస్థ ఉత్పత్తిలో ప్రవేశించి ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేస్తుంది.

అలాగే, కార్పొరేట్ కంపెనీలను మనదేశ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంలోకి అనుమతించే విధానాలు ధరలు విపరీతంగా పెరగడానికి దారి తీస్తాయి. లిబరలైజేషన్ విధానాలతో పాటే, 'మెక్ కార్మిక్' అనే కార్పొరేట్ కంపెనీ భారతదేశంలోని ఎ.వి. థామస్ అనే దేశీయ కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్ ప్రారంభించింది. మెక్ కార్మిక్ సంస్థ అంతర్జాతీయ సుగంధ ద్రవ్యాల వ్యాపారంలో 100 సంవత్సరాల అనుభవం కలిగి ప్రపంచంలో మొదటి సంస్థగా ఉంది. అలాగే, దేశీయ సుగంధ ద్రవ్యాల వ్యాపారంలో ఎ.వి. థామస్ సంస్థ 70 ఏళ్ల అనుభవం కలిగి ఉంది. వీరి జాయింట్ వెంచర్, అలాగే, కొచ్చిన్ స్పైసెస్ అనే మరో బహుళజాతి సంస్థ రెండూ కలిసి ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు కేంద్రంగా సాగే మిర్చి వ్యాపారంలో 70 శాతం హస్తగతం చేసుకున్నాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే మిర్చిలో 44 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉత్పత్తి అవుతుంది. దీనిలో 70 శాతం ఈ రెండు బహుళజాతి సంస్థలు కొనుగోలు చేసి గుంటూరు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వలు చేశాయి. దీంతో ధరలు పెరుగుతాయి.

సరళీకరణ విధానాల మూలంగా ఉద్యోగాలు కోల్పోయినవారు, భూములు కోల్పోయిన వృత్తిదారులు కొత్తగా పేదల్లో చేరుతున్నారు. ధరల పెరుగుదల మూలంగా నిజ వేతనాలు పడిపోయి అనేక మంది దారిద్ర్య రేఖకు దిగువన చేరుతున్నారు. సర్దుబాటు విధానాల్లో భాగంగా భూపంపకాన్ని తిరస్కరించి కార్పొరేట్ వ్యవసాయం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల, భూముల పంపకం జరగపోతే ప్రయోజనం కోల్పోయే తరగతుల్లో 90 శాతం మంది సామాజికంగా వెనుకబడ్డ వారే అసైన్‌మెంట్ రూల్స్ ప్రకారం పంచే భూమిలో 50 శాతం దళితులకే పంచాలి. భూపంపకాల్ని నిరాకరిస్తున్నందున ఈ రిజర్వేషన్ సైతం నిరుపయోగం అవుతుంది.

లిబరలైజేషన్ విధానాల వల్ల సమాచార సాధనాల ప్రభావం విశృంఖలంగా పెరిగి జానపద సంస్కృతి దెబ్బతింటోంది. భూ కేంద్రీకరణను బలపర్చే భూస్వామ్య వ్యవస్థ ప్రచార సాధనాల్ని ఎదుర్కొవడానికి అభ్యుదయ, జానపద సంస్కృతి అభివృద్ధే ప్రత్యామ్నాయం. నూతన ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ ద్వారా సామాజిక న్యాయాన్ని మరింత బలహీనపరుస్తోంది.

ఉదారవాద ఆర్థిక విధానాల మూలంగా, సామాన్య ప్రజలు నష్టపోతారని నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతోందని ప్రపంచబ్యాంక్ గమనించింది. దీంతో ప్రపంచబ్యాంక్ తన వ్యూహాన్ని ప్రారంభించింది. 1990 ప్రపంచ అభివృద్ధి నివేదికను ప్రత్యేకంగా దారిద్ర్యం అనే అంశానికి కేటాయించింది. ఈ నివేదికలో సర్దుబాటు కార్యక్రమాల మూలంగా సామాన్య ప్రజలపై భారం పడుతుందని అంగీకరించింది. అయితే, దీనికి పరిష్కారం సర్దుబాటు విధానాలు వదులుకోవడం లేదని దారిద్ర్యాన్ని తగ్గించే కార్యక్రమాలను అదనంగా చేపట్టడం జరిగింది. అప్పటి నుండి దారిద్ర్య ఉపశమన కార్యక్రమాన్ని కూడా సర్దుబాటు విధానాల్లో పొందుపరిచారు. ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడి, నియంత్రణలేని ఆర్థిక వ్యవస్థ కలిగిన మన దేశంలో పేదరికాన్ని అంచనా కట్టడం అంత తేలికైన విషయం కాదు. సరళీకరణ విధానాల్లో భాగంగా ద్రవ్యలోటు తగ్గించుకోవడానికి దారిద్ర్య ఉపశమన, ఇతర పథకాలకు నిధుల కేటాయింపును కూడా తగ్గించారు.

ఈ రోజు ప్రైవేటీకరణ అన్ని రంగాల్లో ప్రవేశించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ విధానంలో, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పరపతి, విత్తనాలు, సరఫరా అభివృద్ధి, రసాయన ఎరువులు, పురుగుమందులు, నీటి వనరులు, విద్యుత్, పరికరాలు, వీటిని ఇక ముందు ప్రభుత్వ మద్దతుతో ప్రైవేటీకరిస్తారు.

ముగింపు

గత యాభై ఏళ్లకాలాన్ని వ్యవసాయాభివృద్ధికి సంబంధించినవి ప్రధానంగా టెక్నాలజీ బదిలీ సమాజాభివృద్ధి కార్యక్రమం, విస్తరణ శిక్షణ, సేవా కార్యక్రమం, హరితవిప్లవ టెక్నాలజీ నమూనాలు, పేదరిక నిర్మూలన వ్యూహాలు, క్షేత్రస్థాయి సందర్శన విధానం, శ్వేత, బయోటెక్నాలజీ నమూనాలు, సరళీకృత వ్యూహం మొదలగు అంశాలు వివిధ సామాజిక వర్గాల ప్రజలపై, ఆర్థికాభివృద్ధిపై ప్రభావం చూపుతున్న విషయ విశ్లేషణ అవసరం. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం అనేక నూతన సవాళ్లను ఎదుర్కొనేందుకు అనేక సామాజిక, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. 19వ శతాబ్దంలో మూడవ ప్రపంచ దేశాల్లో వ్యవసాయాభివృద్ధిలో అనేకమైన ప్రభావిత అంశాలు చోటు చేసుకున్నాయి.

భారత ప్రభుత్వానికి నూతన సాంకేతిక పద్ధతులతో కూడిన ఒక వ్యవసాయక వ్యూహాన్ని రూపొందించింది. అదే హరితవిప్లవంగా చెప్పుకుంటున్నాం. దీంతో భూమివినియోగంలో ఎన్నో మార్పులను తెచ్చింది.

1980 నుంచి అధిక ఉత్పాదక వ్యవసాయంలోకి అడ్డుపెట్టాల్సి వచ్చింది. ఒకేసారి వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, వనరుల సంబంధిత మార్పులు, సంస్థాగత మార్పులు చోటు చేసుకున్నాయి. వ్యవసాయం మొత్తంగా సంప్రదాయ వంగడాల నుండి అధిక దిగుబడి వంగడాలకు హైబ్రిడ్ విత్తనాలకు, చివరికి, జన్యుపరంగా ఆధునీకరించబడిన వంగడాలకు మారిపోవడం జరిగింది. దీంతో విత్తనం మార్కెట్‌పై ఆధారపడే పరిస్థితి పెరిగింది. ఈ ప్రత్యేక విత్తనాన్ని పేటెంట్లతో కలిపి ఎక్కువ ధరకు కొనుక్కోవలసి వస్తోంది. ఎక్కువ జ్ఞానంతో కూడిన వ్యవసాయ సమాచారం కావలసివస్తోంది. ఆహారపు అలవాట్లు పంటల సరళిని మార్చేస్తున్నాయి. వ్యవసాయ వనరులపై కలుగుతున్న దుష్ఫలితాలను అరికట్టడానికి ఒత్తిడి పెరుగుతోంది. అన్నిటికన్నా తీవ్ర జల వనరుల సమస్య ఎదురౌతోంది. సంస్థాగత రుణాలు, సహకార సంస్థల ద్వారా అందే ఎరువులు, పురుగుమందులు, విత్తనాల లభ్యత రానురాను తగ్గిపోతున్నాయి. రైతులు నియంత్రణ లేది మోసపూరిత వ్యాపారులపై ఆధారపడుతున్నారు.

సన్నకారు రైతులు కేవలం వ్యవసాయం నుంచే కాక వ్యవసాయేతర మార్గాల నుండి దాదాపు సగం వరకు ఆదాయాన్ని సమకూర్చుకుంటేనే బతుకు సాధ్యమౌతుంది. దీన్ని విధానకర్తలు, గ్రామీణాభివృద్ధి వ్యూహంలోకి పరిగణనలోకి తీసుకోవాలి. స్వేచ్ఛా వాణిజ్య ప్రేరిత వ్యవసాయం వైపు మారే క్రమం డబ్ల్యు.టి.ఒ. వ్యవసాయ ఒప్పందం కూడా సహకార సంస్థల రద్దును కోరడం లేదు.

పై నేపథ్య క్రమానికి, వ్యవసాయరంగం నిర్లక్ష్యానికి సంకేతాలను త్వరిత గతిన తగ్గించుకుంటూ వచ్చిన వ్యవసాయరంగ పెట్టుబడులను చూస్తే మనకే అర్థం అవుతుంది. కాబట్టి, రైతులకు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవడమే మిగిలిన మార్గం. వ్యవసాయ వ్యవసాయేతర రంగాలలో ఉత్పాదకతను పెంచడమే మార్గం. ఉత్పాదకత పెరగాలంటే వ్యవసాయ కుటుంబాల నైపుణ్యం పెరగాలి. దాంతోపాటు మౌలిక వసతులు కల్పించాలి. చిన్న, సన్నకారు రైతుల వ్యవసాయాన్ని నిలబెట్టాలంటే విద్య, ఆరోగ్య, గృహ అవసరాలను తీర్చాలి. ఎక్కువగా జ్ఞాన ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పుడే సాధ్యమౌవుతుంది. భూసంస్కరణలు విఫలమవ్వడం, పేదరిక నిర్మూలన కార్యక్రమాల వైఫల్యం, వ్యవసాయ వేతనాల పెరుగుదల లేకపోవడం వలన గ్రామీణ రంగంలో కొనుగోలుశక్తి తగ్గి వ్యవసాయం మీద డిమాండ్ తగ్గుతోంది. వ్యవసాయ విస్తరణ సేవలు నుండి ప్రభుత్వం పూర్తిగా తప్పుకునే పరిస్థితి వచ్చింది. కార్పొరేట్ వ్యవసాయానికి అనుగుణంగా నూతన వ్యవసాయ విధానం అమలులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

దేశంలో రెండో హరిత విప్లవాన్ని సాధించడానికి ఏడు సూత్రాల వ్యూహాన్ని ప్రధాని మన్మోహన్ సింగ్ 'ఆహారం పౌష్టికాహార భద్రత, గ్రామీణాభివృద్ధి కోసం వ్యవసాయం' అనే అంశం పై జరిగిన అంతర్జాతీయ సదస్సులో పేర్కొన్నారు. దేశంలో రెండో హరిత విప్లవాన్ని సాధించడానికి భూసారం, నీటి సంరక్షణ, సమర్థమైన రుణ పంపిణీ వ్యవస్థ, పశు సంపద వృద్ధికి ఆధునిక పరిజ్ఞానం అందించే అంశాల్లో మెరుగైన ఫలితాలను సాధించాల్సిన అవసరం ఉందన్నారు.


బయోటెక్నాలజీ లాంటి కీలక రంగాల్లో భారత ట్రాక్ రికార్డ్ మెరుగ్గా ఉన్నప్పటికీ ప్లాంట్ టెక్నాలజీలో వ్యూహాత్మక పరిశోధనపై మరింత దృష్టి కేంద్రీకరించాలి. పరిశోధనాలయాల్లో కనుగొన్న అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రైతుల పంట పొలాల్లోకి చేరడానికి శాస్త్రవేత్తలు, మేధావులు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు, కార్పొరేట్ సంస్థలతో కలిసి కృషి చేయాలి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో వచ్చిన విప్లవం వలన కొత్త అవకాశాలు పుట్టుకొచ్చాయని, దీంతో పరిజ్ఞానాన్ని వినియోగదారుని వరకు బదిలీ చేయడం సులువైంది. దేశీయ వ్యవసాయ రంగానికి కొత్త పెట్టుబడులు, టెక్నాలజీ, కొత్తరకం ఔత్సాహికుల అవసరం ఉండాలి. రైతుల అవసరాలు తీర్చేలా వ్యవసాయ రుణ పరపతి విధానం ఉండాలి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉంది. అధిక ఆర్థిక వృద్ధిరేటును నిలుపుకోవడానికి, ఆర్థికాభివృద్ధిలో అందరూ సమానంగా పాలు పంచుకోవడానికి వృద్ధి ప్రక్రియ మరింత విస్తృతంగా ఉండాలి. భారతీయ వ్యవసాయ రంగానికి బి.పి. పాల్, ఎం.ఎస్. స్వామినాథన్ అందించిన సేవలే ఈనాడు వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధికి కారణం. ♦

వచ్చే సంచికలో...

- **ఫోకస్ - ఇరవై ఐదు సంవత్సరాల తెలుగుదేశం - ఒక ప్రాంతీయ పార్టీ జయాపజయాలు**
- **అమిత వస్త్రోత్పత్తితో ప్రమాదం - పులుగుజ్జు సురేష్**
- **మార్క్సిస్టు మేధావి డా. కె.బి. కృష్ణ - ఇమ్మానేని సత్యసుందరం**
- **ద్రవ్యోల్బణం - ఒక పరిశీలన - కోమటి లక్ష్మీనారాయణ**
- **2007-08 కేంద్ర బడ్జెట్ - వి. చలపతిరావు**

మానవ హక్కుల హననం

– దుప్పల రవికుమార్



మన దేశంలోనే కాదు, మనుషులున్న ప్రతి చోటా అధికారం కాపాడుకోవడానికి పాలకులు చట్టాన్ని తమ గుప్పిట్లోకి తీసుకుంటారు. ఇది దాదాపు ప్రతి కాలంలోనూ, ప్రతి ప్రాంతంలోనూ జరిగిందే. జరుగుతున్నదే. మన దేశంలో ఎమర్జెన్సీ కాలాన్ని చీకటి రోజులతో పోల్చవచ్చు. ఇందిరాగాంధీ కొన్ని అనవసర భయాలు, తర్కరహిత కారణాలతో దేశంలో పెట్టిన అత్యయిక పాలనకు స్వయానా తన కొడుకే కొత్త భాష్యాలు చెప్పడంతో దేశమంతా పోలీసులు పెట్రేగిపోయారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు వికటాట్టహాసం చేస్తూ దురంతాలకు పాల్పడితే, అడ్డుకోవాల్సిన అధికారులు, కాపాడాల్సిన నాయకులు, న్యాయం చెప్పాల్సిన కోర్టులూ ఏవీ కిమ్మనకుండా ఊరుకున్నాయి. కనీస మాత్రంగానైనా ఎదురు చెప్పలేని నిస్సహాయ పరిస్థితిలో ప్రజలు నానాయాతనలు పడ్డారు. బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు దేశమంతటా చేసినప్పుడు మారుమూలనున్న శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని కస్తూరిపాడు తాలుకాలో కొబ్బరిచెట్లపేట అనే అరవై వాకిళ్ల అతి చిన్న పల్లెలో బొడ్డేపల్లి పాపయ్య అనే రైతు కూడా తప్పించుకోలేకపోవడం ఆ దుస్థితి తీవ్రతకు నిదర్శనం. పోలీసులు, అధికారులు, రాజకీయగణాలు చేసిన ఓవర్ యాక్షన్‌కు ఇలాంటి వందలు వేలాది కథలు దృష్టాంతాలుగా నిలుస్తాయి. వీటికి విరుగుడుగా నిలవాల్సిన ప్రజాచైతన్యం కొరవడడం, ప్రజా ఆందోళనలు జరగకపోవడం, ప్రజాఉద్యమాలు సాగకపోవడంతో పాటు ఎక్కడైనా చిన్న ఎత్తున బయలుదేరిన నిరసనలను సైతం అధికారం ఉక్కుపాదంతో అణచివేయడంతో ఆ చీకటి రోజుల గాయాలు ఇప్పటికీ అందరినీ తీవ్రంగా సలుపుతున్నాయి. పోలీసులు అదే మొండిధైర్యాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. మనిషి ప్రాణం వారి దృష్టిలో విలువ లేనిదయింది. జీవించే హక్కును కాలరాయడం వారి హక్కు భుక్తమయింది. కనీస మాత్రంగానైనా హక్కుల స్పృహ భారతదేశంలో పోలీసులకు కొరవడింది. ఒకవైపు అస్సాంలోనూ, మరో వైపు కాశ్మీరంలోనూ, ఇంకోవైపు మన రాష్ట్రంలోనూ జరుగుతున్న దమనకాండను మనం నిస్సహాయంగా చూస్తున్నాం. పోలీసు ఉద్యోగమంటేనే తల్లులూ, పిల్లలూ హడలిచచ్చే రోజులివి.

నిరుడు మన దేశంలో జరిగిన ఒక తంతును గమనించండి. పదేళ్ల కిందటి కేసుల విషయంలో అధికారం అడ్డదిడ్డమైన సాక్ష్యాలతో కోర్టు తీర్పులను తమకు అనుకూలంగా మలచుకోగలిగింది – ప్రియదర్శిని కేసులో, జెస్సికా లాల్ కేసులో. నిస్సహాయ స్థితిలో ఉన్న వారి బంధువుల ఆవేదనకు ఎన్‌డిటివి, తెహల్కా వంటి ప్రసార మాధ్యమాల కృషి తోడై, జనమంతా సామూహికంగా గళం విప్పడం వల్ల కేసులు తిరగదోడి నిందితులకు కఠిన శిక్షలు వేయించగలిగాం. కాని ఎమర్జెన్సీ రోజులు వేరు. ఆనాటి పరిస్థితులు వేరు.

అధికారం చేసే ఈ మూర్ఖపు వికృత కరాళ నృత్యంలో పాలుపంచుకోవడానికి రాజకీయ పార్టీలేవీ మినహాయింపులు కావని ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్న ఆ చీకటిరోజుల దారుణ వ్యధార్థగాథలు నిరూపిస్తున్నాయి. దాదాపు మూడు దశాబ్దాలు పోరాడి నిలువునీరైన ఓ తండ్రి వేదనను ఇటీవల 'నాన్న' పేరుతో హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురించింది. ఇది కేరళ రాష్ట్రంలోని త్రిచూర్‌లో హిందీ ప్రొఫెసరైన టి.వి. ఈచర వారియర్ మలయాళంలో వెలువరించిన ఆవేదనా భరిత కథ.

1979 ఫిబ్రవరి 29న నక్సలైట్లు కాయన్న పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. ఈ దాడిని పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. మందీమార్బలంతో ఊరిమీద పడ్డారు. కాలికట్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి మీద విరుచుకుపడ్డారు. దొరికిన వారిని దొరికినట్టు పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. ప్రొఫెసర్ ఈచర వారియర్ ఒక్కగానొక్క కొడుకు రాజన్ కూడా అదే కాలేజీలో ఫైనలియర్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రాజన్‌ను కూడా పోలీసులు నిర్బంధించారు. అప్పటినుంచి ఇప్పటిదాకా రాజన్ ఆచూకీ లేదు. రాజన్ ఏమయ్యాడో ఇటు తల్లిదండ్రులకు గానీ, అటు కోర్టుకు గానీ ఇంతవరకు పోలీసులు తెలియజెప్పలేకపోయారు. జయరాం పడిక్కాల్, పులిక్కోడన్ నారాయణన్ అనే ఇద్దరు పోలీసు అధికారులు పెట్టిన చిత్రహింసలు తాళలేక రాజన్ మరణించాడు. లేదా ఆ వాక్యాన్ని ఇలా చెప్పవచ్చు. ఆ ఇద్దరు పోలీసు అధికారుల చేతుల్లో రాజన్ హత్యకు గురయ్యాడు. అంతే, పోలీసులకు సంబంధించిన వరకు రాజన్ కథ అలా సమాప్తమైంది. రాజన్ శవం ఎముకలు కూడా కనిపించకుండా ఉండేందుకు పంచదార వేసి గోనెసంచిలో కుక్కి కాల్చేశారు. ఈ పనిచేసింది చట్ట విద్రోహులు కారు. రౌడీషీటర్లు కానే కారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు. అదే భారతదేశంలో హక్కుల చరిత్రలో దారుణాతిదారుణమైన సంగతి.

అక్కడ నుంచి రాజన్ తండ్రి ఈచర వారియర్ అంతులేని పోరాటం ప్రారంభమవుతుంది. సాయం కోసం కేరళ రాజకీయ నాయకులను కలవాలని వారియర్ బయలుదేరుతారు. కరుణాకరన్, అచ్యుతమీనన్‌లాంటి నాయకులు, బూర్జువా దినపత్రికల సంపాదకులు కూడా అత్యంత అవమానకరంగా అతనికి మొండిచేయి చూపించడం మరో బాధించే అంశం. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వహబుద్దీన్ మాత్రం కోర్టు గుమ్మం ఎక్కి దిగడానికే కాదు, మరెన్నో విధాలా ఆ తండ్రికి సాయపడతాడు. ఎ.కె. గోపాలన్, విశ్వనాథమీనన్

లాంటి రాజకీయులు నాణేనికి రెండోవైపు వారు. వారియర్‌కు సహకరించడానికి సిద్ధపడ్డారు.

1977 ఫిబ్రవరి 22న ఎమర్జెన్సీ తొలగిన తర్వాత వారియర్ అందరికీ వినతిపత్రాలు ఇవ్వడం మానుకుని కోర్టును ఆశ్రయించారు. న్యాయవాది రామ్‌కుమార్ సహాయంతో కేసును కోర్టుకు తీసుకెళ్లిన వారియర్ కోర్టుతీర్పుల్లోనే ఊరట పొందగలిగారు. ఎక్కడికక్కడ పోలీసుల దుర్మార్గాలకు వంత పాడుతున్న పాలకవర్గంతో వీరోచితంగా పోరాడుతూ అడుగులు ముందుకు వేయడంలో ఈ ముసలి ప్రొఫెసర్ ఈచర వారియర్‌లో నిజంగా మనకో యుద్ధవీరుడే (వారియర్) దర్శనమిస్తాడు. కేరళ హైకోర్టులో హెబియస్ పిటిషన్ వేసిన వారియర్‌కు అనుకూలంగా తీర్పు రావడం గొప్ప విషయం. రాజన్‌ను కోర్టుముందు హాజరు పర్చాలని చెప్పిన హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు సుప్రీం గుమ్మమెక్కారు. భారత అత్యున్నత న్యాయస్థానం కూడా రాజన్‌ను పోలీసులు అరెస్టు చేశారని విశ్వసించి అతడిని కోర్టుకు అప్పజెప్పాలని ఆదేశించింది. దాంతో అప్పటి కేరళ ముఖ్యమంత్రి కరుణాకరన్ తన పదవికి రాజీనామా చేయాల్సిరావడం జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం.

తరువాత ముఖ్యమంత్రి ఎ.కె. ఆంటోనీ హైకోర్టు తీర్పుమీద కేరళ ప్రభుత్వం చేత ఒక విచారణ కమీషన్‌ను నియమించారు. దాంతో మళ్లీ కేసు తప్పుదోవ పట్టించడానికి వీలైంది. కొంతకాలం నడిచి సుప్రీం కోర్టులో మూలపడ్డ కేసులో వారియర్ తన కొడుకు మరణాన్ని జీర్ణించుకుని నష్టపరిహారం కోరడం అతడి అన్నకే కాదు రాజన్ మిత్రులకు కూడా చాలా కోపం తెప్పించింది. రాజన్ స్మృతి చిహ్నంగా జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ వార్డు పేరుతో ఒక ప్రత్యేక వార్డు నిర్మాణానికి ఉపక్రమించారు. తరువాత రాజన్ మిత్రుల చొరవతో పూర్తి చేస్తే అది ప్రజలకు ఉపయోగపడుతోంది.

వారియర్ తన కుమారుడి ఆచూకీ తెలుసుకునే ప్రయత్నంలో నిజాన్ని చెప్పలేక తన భార్యను పోగొట్టుకుంటారు. వ్యక్తిగత సంబంధాలను తృణప్రాయంగా అలక్ష్యం చేస్తారు. ప్రజలను సమీకరిస్తారు. ఉద్యమాన్ని లేవదీస్తారు. కానీ దళసరి చర్మపు పోలీసు వ్యవస్థకు ఇవేవీ పట్టవు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కూడా కాలరాయాలనుకోవడం క్షమించరాని నేరం.

పుస్తకం చదవడం పూర్తిచేశాక మనమంతా అంతులేని దుఃఖంలో కూరుకుపోతాం. వారియర్ చెప్పిన కథనంలోని 'ఎవరి మీదా ద్వేషం లేదు' అన్న అధ్యాయం మన కంట నీరు తెప్పిస్తుంది. ఒక్కసారి కదిలిపోతాం. ఇదే అధ్యాయంలో వారియర్ చెప్పిన మాటలు మనను ఆలోచనలో పడేస్తాయి. 'రాజన్ మృతికి కారకులైన ఆ పోలీసాఫీసర్ల మీద పగ తీర్చుకోవాలని నాకుందా, లేదా అనే ప్రశ్న చాలాసార్లు ఎదురైంది. ఆ ప్రశ్న నన్ను అనుమానంలో పడేసేది. నేను హిందూ మత విశ్వాసాల మధ్య పెరిగాను. గుడి, ప్రార్థనలు, నైవేద్యాలు, మతాచారాలు నిండి ఉండే ఇంటిలో మెలిగిన వాడికి ప్రతీకార వాంఛ అసహజమైంది. కానీ ఒంపు తిరిగిన మీసాలు అటూ ఇటూ కదులుతుండగా ఉద్రిక్తంగా వాదించే పులిక్కోడన్ నారాయణన్‌ను టెలివిజన్‌లో చూసినప్పుడల్లా నా మనసులో ప్రతీకార వాంఛ మెరిసేది. నా కొడుకుకు ఎదురైన అసహాయ వేదనామయక్షణాలు నాకు గుర్తొచ్చేవి. అసంకల్పితంగానే లెక్కలు తీర్చుకోవడం గురించి నేనాలోచించేవాడిని. అంతకు ముందెన్నడూ ఎరగని ఆగ్రహం నా మనసులో ప్రవేశించేది. ప్రతి ఒక్కటీ మరచిపోయానని నాకనిపించినప్పుడల్లా దాన్ని మరింత స్పష్టంగా గుర్తు తెచ్చుకునేవాడిని' – తన కన్న కొడుకును పొట్టన పెట్టుకున్నా ప్రతీకారవాంఛతో రగిలిపోకుండా, న్యాయపోరాటం చేశాడా సామాన్య వృద్ధ పౌరుడు. అధికారం ఉండీ ఆ మాత్రం ఇంగితం కూడా లేకుండా ప్రవర్తిసుంటారు మన పోలీసులు. సరిగ్గా ఇక్కడే జీవన పోరాటం గురించి, హక్కుల పోరాటాల గురించీ ఈచర వారియర్ రూపంలో మనకు కొత్త కొత్త పాఠాలు తెలిసివస్తున్నాయి.

నలభై రెండు పేజీల ఈ చిన్న పుస్తకం 'నాన్న'లో పోలీస్ కస్టడీలో మరణించిన తన కొడుకు ఆచూకీ కోసం ఓ తండ్రిగా పడ్డ తపనను అక్షరం అక్షరం రాసుకుంటూ పోతూ ఈచర వారియర్ మనకు అందించారు. దీనిని సి. వనజ తెలుగులోకి తీసుకురాగా, ఈ కేసు విషయంలో కేరళ హైకోర్టు వెలువరించిన తీర్పును చివరి పదిహేడు పేజీలలో నల్సార్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అనువదించారు.

కోర్టులు మరింత సమర్థవంతంగా పనిచేసి, ప్రజా సంఘాలు నిత్య చైతన్యంతో కృషిచేసి, హక్కుల సంఘాలు డేగకళ్లతో పహారా కాస్తూ, నిరంతర సంఘర్షణ జరిపిననాడే మన పోలీసులు విధులు, బాధ్యతలను గుర్తెరిగేటట్లు చేయగలం. లక్ష్మణ రేఖను దాటినప్పుడల్లా కొరడాదెబ్బల్లాంటి కోర్టు తీర్పులు, కళ్లు బైర్లుకమ్మేలా జరిపే ప్రజాందోళనలు మాత్రమే వారిని అదుపులో పెట్టగలుగుతాయి. అంతే తప్ప చట్టాన్ని కాపాడాల్సిన వారు వికటాట్టహాసం చేస్తున్నప్పుడు వారిని దారిలో పెట్టాల్సిన ప్రభుత్వం ఏమైనా చేస్తుందనుకోవడం మన భ్రమ మాత్రమే.

♦

తెలుగు సేత	: **సి. వనజ, మాడభూషి శ్రీధర్**
వెల	: **రు. 25**
ప్రతులకు	: **హైదరాబాద్ బుక్ ట్రస్ట్,** ఫ్లాట్ నెం. 85, బాలాజినగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 28. ఫోన్ 040 – 23521849

బాలకార్మిక వ్యవస్థ - ఒక పరిశీలన

- జి. చంద్రమౌళి, కె. రాధిక

నేడు భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలలో బాల కార్మిక వ్యవస్థ ప్రధానమైనది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 60 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా మన సమాజంలో నేటికీ బాలకార్మిక వ్యవస్థ కొనసాగడం దురదృష్టకరం. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత ఒకవైపు, తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేయించుకోవచ్చునని యాజమాన్య దోపిడి పెరిగిపోవడం బాలకార్మిక వ్యవస్థ పుట్టడానికి దోహదం చేస్తున్నాయి. నేటికి మన దేశ జనాభాలో 30 శాతం మంది దారిద్ర్యరేఖ దిగువన ఉన్నట్లు అనధికారిక అంచనాలు . రెక్కాడితేగాని డొక్కాడని అభాగ్యులు బాలకార్మికులు.

చిట్టి చేతులు చిన్నారులు తల్లిదండ్రుల బీదరికం కారణంగా కుటుంబానికి ఆర్థికంగా మద్దతునివ్వడం కోసం బాలకార్మికులుగా మారుతున్నారు. మన సమాజ నిర్మాతలైన బాలలు ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా చదువుకునే పరిస్థితులు లేకపోవడం, తల్లిదండ్రుల పెంపకంలో లోపాలు, దోపిడి, వివక్ష, కుల అణచివేత, లింగ అణచివేత, చెడు స్నేహాలు, అశక్తత, ఇలా అనేక కారణాల వలన బాలలు పని మనుషులుగా, బాల నేరస్థులుగా, సెక్స్ వర్కర్లుగా మార్చబడి, దోపిడీకి గురవుతూ బాల కార్మికులుగా రూపు దాల్చుతున్నారు. పేదరికం వలన బాల కార్మిక వ్యవస్థ, దీని వలన నిరక్షరాస్యత, పేదరికం ఇలా ఒక దాని ఆధారంగా మరొకటి చక్రబంధమై పెరుగుతోంది. 1996 యునిసెఫ్ నివేదిక పేర్కొన్న సంగతిని ప్రభుత్వాలు, ప్రజలు గుర్తించుకోవాలి. ఈ దేశ చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్య కేవలం బాలకార్మిక వ్యవస్థ ఒకటి మాత్రమే కాదు. బాలకార్మిక వ్యవస్థలో బాల్యం కుమిలిపోతున్నది. దీనితో పాటుగా వీధి బాలల పేరిట బాట తప్పిన బాల్యం వీధులల్లో రోదిస్తోంది. దురదృష్టవశాత్తు 'ఎవరికి పుట్టిన బిడ్డ ఎక్కెక్కి ఏడ్చింది' అన్నట్లుగా బాల కార్మికుల ఆక్రందనలను పట్టించుకునే మనసు సమాజానికి కరువైంది. ఒక లక్ష్యం, ఒక గమ్యం అన్నింటిని మించి ఒక ఆధారం, ఆలంబన లేక తెగిన గాలి పటాల్లా జీవిస్తున్నారు.

పిల్లలు పనిచేయటం అన్నది మనం నైతికంగా సమ్మతించలేని విషయం వారు విద్య నేర్చుకోవాలి, ఆటలాడుకోవాలి. పిల్లలు సృజనాత్మకమైన మరుపురాని బాల్యాన్ని గడపాలి. మన దేశంలో బాల కార్మికులు అధిక సంఖ్యలో ఉండడానికి ప్రధాన కారణం దారిద్ర్యం. సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వర్గాల పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. బాల కార్మికులు ఏ వ్యాపకం లేకుండా, రేపన్న ఆలోచన రానీయకుండా జీవితాన్ని సాగిస్తున్నారంటే వారి శ్రమశక్తి, మేధో సంపద వృథా అవుతుంది. తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరమై చదువుసంధ్యలు లేక, అనారోగ్య పరిస్థితులలో దేశ సంపదను వృద్ధి చేస్తూ కుటుంబాలకు అండగా ఉండే బాలలు ఏం కోల్పోతున్నారో ఆలోచిస్తే ఈ సామాజిక వ్యవస్థ అసలు స్వరూపం, బాధ్యతారాహిత్యం బహిర్గతమవుతుంది. 2003 మెగసేసే అవార్డు గ్రహీత ఆచార్య 'శాంతా సిన్హా' అన్నట్లు 'బడిలో కాకుండా బాలలు ఎక్కడున్నా కార్మికులే' అన్న విస్తృత నిర్వచనం బాలల పరిస్థితిని స్పష్టం చేస్తుంది.

బాల కార్మిక వ్యవస్థ - స్వరూపం

వ్యవసాయం, పశువులు, మేకలు, గొర్రెలు కాయడం, ఇంటి పనులు చేయడం, హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలలో కిరణా హోల్‌సెల్ వ్యాపారాలు, మోటారు మెకానిజం, పత్తి, పొగాకు, మత్స్య పరిశ్రమలు, గనులు, అగ్గిపెట్టెల తయారీ, బాణాసంచా పరిశ్రమ, బీడీ పరిశ్రమ, రత్నాలను పాలిష్ చేసేందుకు, పలకలను తయారు చేయడానికి, రాళ్లు కొట్టించడం, సిమెంట్ తయారీ, నిర్మాణ పరిశ్రమ, మందుగుండు సామాగ్రి, తాళాలు తయారు చేసే సంస్థలలో, అద్దాల కర్మాగారంలోను, రైల్వే శాఖలోను, ఓడ రేవులలోను, తివాచీల నేత పరిశ్రమలోను, సబ్బుల తయారీ పరిశ్రమ ఇలా అనేక రూపాల్లో చాలా రంగాలకు బాల కార్మిక వ్యవస్థ విస్తరించింది. వారి శారీరక, మానసిక ఆరోగ్యాలకు హానికరమైన పరిస్థితుల్లో బాల కార్మికులు పని చేస్తున్నారు. బాల బాలికలు నిర్బంధంగా వివిధ శాఖల పనులలోకి నెట్టబడుతున్నారు.

పద్నాలుగు సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండి పని చేసే వారిని బాల కార్మికులుగా గుర్తించడం జరిగింది. అంతర్జాతీయ శ్రామిక కార్యాలయం పనిలో చేరే వారి వయస్సు విషయంలో ఆమోదించిన తీర్మానం ప్రకారం పదిహేను సంవత్సరాల వయస్సు నిండిన వారు మాత్రమే శ్రామికులుగా పనిచేయడానికి అర్హులు. ఐక్యరాజ్యసమితి 1989వ బాలల హక్కుల కన్వెన్షన్ అనుసరించి గుర్తించి పద్దెనిమిది సంవత్సరాలలోపు వ్యక్తులందరినీ బాలలుగా పరిగణించడం జరుగుతుంది. కాని నేడు బాలలు వారి ఆనందమైన, తీపి జ్ఞాపకాల బాల్యాన్ని అనుభవించకముందే బాల కార్మిక వ్యవస్థ వారి బాల్యాన్ని మింగివేయడం జరుగుతోంది.

బాల కార్మికులు - గణాంకాలు

ప్రపంచంలోని పది దేశాలలో ఎక్కువగా బాల కార్మికులు పడరాని కష్టాలు ఎదుర్కొంటున్నారు. పది దేశాల జాబితాలో సూడాన్, ఉగాండా, కాంగో దేశాలు మొదటి స్థానాలను ఆక్రమించాయి. అలాగే మనదేశంలో బాల కార్మికుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆ జాబితాలో మనది ఆరవ స్థానం. మన దేశంలో 2001లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల వయస్సు కలిగి ఉండి బాల కార్మికులుగా పని చేస్తున్న వారి సంఖ్య 12.6 మిలియన్లు. బెల్జియం దేశంలోని దేశ జనాభా కంటె మనదేశంలోని బాల కార్మికుల సంఖ్య అధికం. మన దేశంలోని బాల కార్మికులలో సగం కంటె ఎక్కువమంది దాదాపు 6.7 మిలియన్ల బాలకార్మికులు ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్,

రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో ఉన్నారు. రాష్ట్రంలో 4.23 లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ సంఖ్యకు రెట్టింపు బాలకార్మికులు మన రాష్ట్రంలో ఉన్నట్లు అనధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి.

ఐక్యరాజ్య బాలల నిధి (యునిసెఫ్) ప్రకారం ప్రపంచంలో 24.60 కోట్ల మంది బాల కార్మికులున్నారు. 1999లో యునిసెఫ్ లెక్కల ప్రకారం మన దేశంలో 4.40 కోట్ల మంది బాల కార్మికులున్నారు. బాల కార్మికులు లేని దేశమంటూ లేదు. ప్రపంచంలో ప్రతి సంవత్సరం పని సంబంధమైన ప్రమాదాల్లో ఇరవై రెండు వేల మంది బాల కార్మికులు దుర్మరణం చెందుతున్నారు. బాల కార్మికులు అసంఘటిత రంగంలో అత్యధిక సంఖ్యలో ఉన్నారు. బాల కార్మికుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులే. మన రాష్ట్రంలో బాలకార్మికుల సంఖ్యకు సంబంధించి నేటి వరకు సమగ్ర సర్వే నిర్వహించిన దాఖలాలు లేవు. మన దేశంలో ఇళ్లలో పని చేసే బాల కార్మికుల సంఖ్య పద్నాలుగు లక్షల పైగా ఉంటుంది. హైదరాబాద్‌లోనే ఇళ్లలో పనిచేసే బాల కార్మికుల సంఖ్య దాదాపు 1.50 లక్షల వరకు ఉండవచ్చునని అంచనా. ఈ గణాంక వివరాలన్నీ పరిస్థితి తీవ్రతను అద్దం పడుతున్నాయి.

బాలల హక్కులపై - ఐక్యరాజ్య సమితి విధానం

ఐక్యరాజ్య సమితి రూపొందించిన బాలల హక్కుల ఒడంబడికలో ప్రకరణ (1) ప్రకారం 18 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి ఒక్కరు బాలలే. 1959 నవంబర్ 29న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ బాలల హక్కులపై ప్రకటన చేస్తూ అంతర్జాతీయ మానవ హక్కులను అంతర్భాగంగా గుర్తించింది. 1979 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి "అంతర్జాతీయ బాలల సంవత్సరం"గా ప్రకటించింది. ప్రతి పిల్లవాడికి జీవించి, అభివృద్ధి చెందే హక్కును సమాజ హక్కుగా ఒప్పందం ప్రకటించింది. అలాగే బాలల ఆరోగ్య, విద్య హక్కులను అతి ముఖ్యమైన హక్కులుగా గుర్తించింది. 1989లో ఐక్యరాజ్య సమితి బాలల హక్కులపై ఒక అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించింది. 1992 డిసెంబర్ 11న ఈ ఒప్పందాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది. బాలల రక్షణ ప్రకటన (1979) బాల నేరస్తుల పట్ల పాటించవలసిన ఐక్యరాజ్య సమితి ప్రమాణాలు, నిబంధనలు ప్రపంచంలోని అన్ని మూలాలల్లోను నివసిస్తున్న పిల్లలకు జాతి, మత, వర్గ, లింగ భేదం లేకుండా సమానమైన రక్షణ, సంక్షేమం కావాలనే మానవాళి ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నాయి. వాటన్నింటికి కొనసాగింపుగానే 1989 ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక ముందుకు వచ్చింది.

బాలల హక్కులు - భారత రాజ్యాంగ రక్షణలు

చిన్నారుల పట్ల సమాజానికి బృహత్తర బాధ్యత ఉన్నదన్న విషయాన్ని భారత రాజ్యాంగం నొక్కిచెప్పింది. రాజ్యాంగంలోని 24వ ఆర్టికల్ ప్రకారం పద్నాలుగు సంవత్సరాల లోపు బాల బాలికలను కర్మాగారాలు, గనులు లాంటి ప్రమాదకర ప్రదేశాలలో కార్మికులుగా నియమించరాదు. రాజ్యాంగంలోని 45 అధికరణం పద్నాలుగు సంవత్సరాలలోపు బాల బాలికలకు సార్వత్రిక, నిర్బంధ ఉచిత విద్యావకాశాలు కల్పించింది. ప్రభుత్వం ఈ అధినియమను మార్పు చేసి 86వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాలలోపు బాలల నిర్బంధ ప్రాథమిక విద్యను 21(ఎ) ఆర్టికల్ ప్రకారం ప్రాథమిక హక్కుగా మార్చడం జరిగింది. ఆర్టికల్ 23 ప్రకారం వెట్టి చాకిరీ, స్త్రీ, శిశువులను నిర్బంధంగా అవమానకర పనులకు ప్రోత్సహించడం నిషేధించడం జరిగింది. 1975 లో వెట్టి చాకిరి నిరోధక చట్టాన్ని పార్లమెంట్ చేసింది.

మనదేశంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం పరిశ్రమల చట్టం 1881, బాలల చట్టం 1933, బాలల ఉద్యోగ కల్పన చట్టం 1938, కర్మాగారాల చట్టం 1948, ప్లాంటేషన్ కార్మిక చట్టం 1951, గనుల చట్టం 1952, మోటారు రవాణా కార్మిక చట్టం 1961, ఫ్యాక్టరీ చట్టం 1982 మొదలైన చట్టాలను రూపొందించడం జరిగింది. 1901లో గనుల చట్టం, 1990 తరువాత ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు వివిధ చట్టాలు రావడం జరిగాయి. మన రాష్ట్రం మరో అడుగు ముందుకేసి బడికి వెళ్లని బడి ఈడు (6-14) వయస్సున్న పిల్లలంతా బాల కార్మికులేనని ప్రకటించడం మంచి పరిణామం. కేంద్ర ప్రభుత్వం విధానాలను, చట్టాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తూ విజన్ 2020 డాక్యుమెంట్‌లో బాలల విద్యా హక్కు మనందరి బాధ్యతగా డిసెంబర్ 1999లో ప్రకటించింది.

ఆర్టికల్ 15 : మహిళలు, బాలల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు చేయవచ్చు; **ఆర్టికల్ 23(1) :** బాలలను అమ్మడం, కొనడం, బిక్షాటన చేయించడం, నిర్బంధ చాకిరీలు నిషేధితం; **ప్రకరణం 30(సి) :** లేత వయస్సు పిల్లలను అపహాస్యం కాకుండా చూడాలని, ఆర్థిక అవసరంతో తమ వయస్సుకీ, శక్తికీ మించిన పనుల్లో నిమగ్నం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వంపై ఉంది; **ప్రకరణం 39(ఎఫ్) :** బాలలు స్వేచ్ఛాయుత, గౌరవప్రద పరిస్థితుల్లో ఆరోగ్యవంతంగా పెరగడానికి తగినన్ని అవకాశాలు, సౌకర్యాలు కల్పించి, బాల్యాన్ని కామ పీడన నుంచి, నైతిక, భౌతిక నిర్లక్ష్యాల నుంచి ప్రభుత్వం రక్షించాలి; **ప్రకరణం 47 :** బాలలకు పౌష్టికాహారం, మెరుగైన జీవనాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి.

బాలలకు రక్షణ కల్పిస్తూ భారతీయ శిక్షాస్మృతిలో **ఐ.పి.సి 361, ఐ.పి.సి. 363-ఎ, ఐ.పి.సి. 366** బాలలకు రక్షణ కల్పించింది. భారత ప్రభుత్వం బాలల కోసం కొన్ని చెప్పుకోదగిన చట్టాలు చేసింది.

బాలల ఆరోగ్యం, విద్య విషయాలలో వివిధ రాష్ట్రాలలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు ఒక నిర్దిష్ట వయోపరిమితి వరకు ప్రాథమిక ఉచిత విద్యను కల్పిస్తున్నాయి. భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలో ప్రసాదించిన నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యా విధానం నేటికీ అమలు కాలేదు. మాతా, శిశు సంక్షేమం పేరిట ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖ ఉన్నప్పటికీ పెద్దగా సాధించింది ఏమిలేదు. ప్రస్తుతం అమలులో ఉన్న బాలకార్మిక చట్టం 1986ను అనుసరించి మన దేశంలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిషేధించడం జరగలేదు. ఆగస్ట్ 1, 2006 నుండి పనులను బాల కార్మికుల చేత చేయించరాదని భారత ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ ఆదేశాలను జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం బాల కార్మికులను ఇళ్లలో పని చేయడానికి నియమించుకోరాదు. ఈ నిషేధపు ఉత్తర్వులు అక్టోబర్ 10, 2006 నుండి అమలులోకి వచ్చాయి.

బాల కార్మిక వ్యవస్థ - అమలు తీరు

1. బాలకార్మికుల చట్టాలను ఉల్లంఘిస్తున్న యజమానులను శిక్షించే యంత్రాంగం పటిష్టంగా లేదు; 2. ప్రభుత్వం చట్టాలను రూపొందించడంతో తమ బాధ్యత తీరిపోయిందని వ్యవహరిస్తోంది; 3. రాజకీయ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయడం లేదు; 4. యజమానులు బాలకార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నారు; 5. సమాజం బాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది; 6. ప్రసార సాధనాలు ప్రజలలో సరియైన అవగాహనను కల్పించలేకపోతున్నాయి.

"పని చేయడానికి రెండు చేతులున్నాయి, తినడానికి ఒక నోరుంది" అని బాలలు తమ పొట్ట తామే నింపుకుంటూ కుటుంబానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చిపెట్టే ఆదాయవనరులు అవుతున్నారు. అందమైన బాల్యాన్ని కోల్పోయి, విద్యా గ్రంథాలకు దూరమై, పలక బలపం పట్టవలసిన చేతులు పార పలుగు పట్టుకుంటూ బరువైన పనులు చేస్తూ అనారోగ్యం, ఆకలిమంటలతో అసహాయ స్థితిలో పని చేస్తున్న బాలలను ఏ చట్టాలు పరిరక్షించలేకపోతున్నాయి. అమ్మ ఒడిలో, బడిలో చేర్చలేకపోతున్నాయి.

బాల కార్మికుల నిర్మూలనకు సూచనలు

బాల కార్మిక వ్యవస్థని నిషేధించినంత మాత్రాన, దానంతటదే రద్దుకాదు. ఇది బాలల సమస్య, ఒక సామాజిక రుగ్మత. ఈ చిన్నారులు సంఘవ్యతిరేక శక్తులుగా మారి మొత్తం సమాజానికే సమస్యగా మారుతున్నారు. బాల కార్మికులను సమాజం ఉపేక్షిస్తున్న మాట యదార్థమే. వీరి చీకటి బతుకులలో వెలుగు రేఖలు నింపే ప్రయత్నాలు మరిన్ని సమాజం, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు బాధ్యత వహించాలి. బాలల హక్కుల పరిరక్షణ ఏ ఒక్కరితోను సాధించబడదు. ఇది అందరి బాధ్యతగా గుర్తించినప్పుడే సాధ్యమవుతుంది.

1. సామాజికపరంగా, హక్కులపరంగా బాలల అభివృద్ధి సంరక్షణ కోసం ఉన్న శాసనాలను సమీక్షించి మార్పులు చేయడం; 2. బాలల హక్కుల పరిరక్షణ కోసం కావల్సిన వనరులు బడ్జెట్‌లో ప్రతిపాదించి అమలు చేయడం; 3. ప్రజలను చైతన్య పరిచే కృత్యాలను, కార్యక్రమాలను ప్రోత్సాహించడం; 4. పిల్లలకు మంచి పరికరాలు, వసతులు ఉన్న పాఠశాలలను అందుబాటులోకి తేవటం; 5. బాలల హక్కుల పరిరక్షణకు పర్యవేక్షకులను నియమించి, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం; 6. ప్రభుత్వేతర సంస్థల సేవలను ప్రోత్సాహించడం; 7. ప్రసార మాధ్యమాల ద్వారా పిల్లలను చాకిరికి గురి చేయటంలోని నిర్దయతను, కృరత్వాన్ని తెలియజేయాలి; 8. ప్రభుత్వేతర సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వాలి. వృత్తి నైపుణ్యతలో, ఆర్థిక విషయాల్లో, సంస్థాపరమైన, సిబ్బంది వస్తు పరికరాల విషయాలలో ప్రభుత్వేతర సంస్థలకు చేదోడు, వాదోడుగా ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించాలి; 9. బాల శ్రామికులకు మరిన్ని పునరావాస పథకాలు కల్పించాలి. వారికి విద్యను, వృత్తి నైపుణ్యంలో శిక్షణను అందుబాటులోకి తీసుకురావాలి; 10. పిల్లల శారీరక, మానసిక, ఆరోగ్యాలను కాపాడటం తల్లిదండ్రులు తమ కనీస బాధ్యతగా గుర్తించడం; 11. తల్లిదండ్రులు తమ జీవనం కోసం పిల్లల జీవితాన్ని పణంగా పెట్టకపోవడం; 12. తల్లిదండ్రులు పిల్లల ద్వారా పొందే స్వల్ప ఆదాయాన్ని ఆశించకుండా ఉండటం; 13. సమాజం ప్రభుత్వంలో నిర్వహించే చైతన్య కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయడం; 14. ప్రజలు ప్రభుత్వం రూపొందించే చట్టాలను, విధానాలను గౌరవించి, ప్రోత్సహించడం; 15. ప్రజలు కూడా భాగస్వాములు కావటం అత్యావశ్యకం. పిల్లల చాకిరి నిర్మూలనకు ప్రధానంగా ప్రేరణ సమాజం నుంచే రావాలి; 16. ఉపాధ్యాయులు పాఠశాల వాతావరణాన్ని ఆకర్షణీయంగా చేసి, బడి నమోదును ప్రోత్సాహించడం; 17. ఉపాధ్యాయులు ఔత్సాహికముగా, నిబద్ధతతో బాలల సమస్యల పట్ల సమాజంలో స్పందన స్ఫురింపచేయాలి.

చిన్నారులకు బంగారు బాటలను నిర్మిద్దాం

ఆట పాటలతో చదువుతో హాయిగా గడిచిపోయే అవకాశాలను, సౌకర్యాలను బాలబాలికలకు కల్పించాలి. అప్పుడే బాల కార్మిక వ్యవస్థ బలహీనపడుతుంది. బాల కార్మిక వ్యవస్థను విముక్తి చేయడానికి ప్రభుత్వం, పౌర సమాజం బాధ్యత వహించాలి. శ్రమలో మసిమడిన పసి మొగ్గలకు రక్షణ కవచాలివ్వాలి. ఆరోగ్యం, వినోదం, విజ్ఞానం కలిగిన బాలల సమాజాన్ని మనం నిర్మిస్తే, రేపది గొప్ప సమాజంగా రూపాంతరం చెందుతుంది. సమాజ నిర్మాణానికి పునాది బాలలు. బాలలు బంగారు కాంతులతో విలసిల్లినప్పుడే సమాజం వెలుగు పూలు పూయిస్తుంది.

"పిల్లల పట్ల ప్రపంచం చూపించే ప్రేమానురాగాలు, విశ్వాసాలకు మించిన పవిత్ర అంశం మరొకటి లేదు. పిల్లల హక్కులను పరిరక్షిస్తూ, ఆ హక్కులను గౌరవిస్తూ, వారి సంక్షేమాన్ని రక్షిస్తూ పిల్లల జీవితాలు భయమన్నది ఎరుగక, కొరతన్నది తెలియక శాంతియుతంగా ఎదిగేందుకు నిర్వర్తించే కర్తవ్యాన్ని మించిన కర్తవ్యం మరొకటి లేదు".


–కోఫీ అన్నన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో అభివృద్ధి ఫలితాలు అందరికీ అందాలన్న సంకల్పంతో అడుగులు వేస్తోంది. బాలకార్మిక వ్యవస్థ చట్ట పరిధిని మరింత విస్తృత పరుస్తూ, బాలకార్మిక చట్టాలు బలంగా అమలయ్యేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. మానవ విలువలతో ముడిపడిన చట్టాల విషయంలో సమాజం సహకారం అందించనదే లక్ష్యాలను సాధించడం సాధ్యమయ్యే విషయం కాదు. సమాజం, ప్రభుత్వ సహకారాలతో బాలల భావి జీవితాలలో వెలుగు కాంతులను విస్తరింపచేయడానికి నడుం బిగించి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం. చిన్నారుల భవితకు బంగారు బాటలు వేద్దాం.


బాలల సమస్య దేశ భవిష్యత్తు సమస్య. కొత్త చట్టాలు రూపొందించటంతో బాటు ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి. బాలల ఆరోగ్యం, విద్య దేశాభివృద్ధికి అత్యంత కీలకమైనవి. బాలల బాల్యం బడిలోనే, బాలల భవిష్యత్తు బడితోనే ! ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యులు కావాలి. చేదోడు వాదోడుగా నిలవాలి. ♦

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు ఉరి!

– యశపాల్ 'సింహావలోకనం'




సుఖదేవ్



రాజగురు

1931 మార్చ్ 23వ తారీఖున భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు – వీర్ని లాహోరు జైల్లో ఉరి తీశారు. ఈ సందర్భంగా దేశమంతటా హర్తాళ్లు జరిగాయి. అప్పటికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల మధ్య ద్వేషాగ్నిని బాగా రగల్చగలిగారు. ముస్లింలకు, కాంగ్రెస్‌వారు హిందూ ప్రభుత్వాన్ని స్థాపించనున్నారన్న భావన ఏర్పడింది. ముస్లింలీగ్, సాంప్రదాయక ముస్లింలు – పోటీలో వెనుక పడకుండా ఉండగలందులకు ఇంగ్లిష్ ప్రభుత్వానికి విశ్వాస పాత్రులవుతున్నారు. కాన్పూర్‌లో హర్తాళ్ చేయించడంలో కాంగ్రెస్ ప్రముఖ పాత్ర వహించింది. పోలీసులు రెచ్చగొట్టడంతో, కొందరు ముస్లింలు కాంగ్రెస్‌ను ఉడికించడానికి హర్తాళ్ చేయం అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి కృపాపాత్రులవడానికీ ఇది మంచి అదును. హర్తాళ్‌లో పాల్గొనకపోవడం జాతీయ వీరుల్ని అవమానించడంగా సాధారణ ప్రజలు భావించారు. ప్రజలు అమర వీరుల్ని అవమానపరచడం ఎప్పుడూ సహించరు. ఈ కారణంగా హిందూ ముస్లిం కొట్లాటలు చెలరేగాయి. ఈ కొట్లాటల్లోనే గణేష్ శంకర్ విద్యార్థి మతపిచ్చిలో అంధులైన ముస్లింలచేత హత్య చేయబడ్డాడు.



1929, 30, 31 లల్లో 'ఇంక్విలాబ్ జిందాబాద్' 'భగత్‌సింగ్‌కి జై!' అన్న నినాదాలు భారత ప్రజల్లో అత్యధిక ప్రచారంలో ఉన్నాయి. ఆ రోజుల్లో పై నినాదాలకున్న ప్రచారం 'గాంధీకి జై' అన్న నినాదానికి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ పార్టీలోని సాధారణ సభ్యులు బ్రిటిష్ ప్రభుత్వంతో సంప్రతించేప్పుడు 'భగత్‌సింగ్ కూ, అతడి మిత్రులకూ విధించబోయే ఉరిశిక్షను రద్దుచేయా'లన్న షరతును కూడా చేర్చవల్సిందని గాంధీని అడిగారు. కానీ గాంధీ ఈ సమస్యను ఒక షరతుగా వైస్రాయ్ ముందుంచడానికి నిరాకరించారు. ఏమైనప్పటికీ ప్రజల వాంఛను ఇంతగా నిర్లక్ష్యం చేస్తారని ఎవరూ అనుకోలేదు. ఉరిశిక్ష రద్దవుతుందనే అందరూ ఆశించారు. ఆంగ్ల ప్రభుత్వం దీన్ని తన గౌరవానికీ, సామర్థ్యానికీ సంబంధించిన ప్రశ్నగా భావించింది. భగత్‌సింగ్‌నూ, అతడి మిత్రులనూ ఉరితీశాక ప్రజల హృదయాలు ఘోర ఆఘాతానికి గురి అయ్యాయి. ఆ వీరుల సమన్యకు గాంధీ తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వలనా ప్రజల హృదయాలు క్షోభపడ్డాయి. గాంధీ ఆంగ్ల ప్రభుత్వంతో రాజీ పడడానికి పన్నెండు షరతుల్ని వైస్రాయ్ ముందుంచారు. వాటిల్లో ఒకటి ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని పెట్టాలనేది. కానీ, భగత్‌సింగ్, అతని అనుచరులను వదిలిపెట్టాలన్న షరతు మాత్రం ఆ పన్నెండింటిలో లేదు. ప్రజల మీద పర ప్రభుత్వ శక్తని ఉపయోగించి మద్యపాన నిషేధాన్ని అమలుపరచడం నైతికంగా సమర్థనీయ చర్యగా భావించారు గాంధీ. కానీ, భగత్‌సింగ్ – మిత్రుల ఉరిశిక్షలను రద్దుచేయడానికి, ప్రజాశక్తి ఆధారంగా పర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం అనైతికమైన విషయంగా భావించారు. కనుకనే, 1931 మార్చ్ చివరి వారంలో కరాచీలో జరిగిన కాంగ్రెస్ సభలో గాంధీకి నల్లని పూలు కానుకగా ఇచ్చారు. నల్ల జండాలు చూపించారు. ప్రజల హృదయాలు వివశంగా ఘూర్ణిల్లాయి. పర ప్రభుత్వం మీద ద్వేషం పెల్లుబికింది. తమ ప్రియతమ వీరుల మీద అతిశయోక్తితో కూడిన కథలల్లి ప్రచారం చేసుకుని తృప్తిపడ్డారు ప్రజలు.

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు – వీర్ని ఉరితీసేప్పుడు, రెండవ లాహోరు కుట్రకేసుకు సంబంధించిన నిందితులు సర్దార్ సింగ్, జహంగీరీలాల్, జై ప్రకాశ్, ధర్మపాల్ – వీరూ లాహోరు సెంట్రల్ జైలులోనే ఉన్నారు. వీళ్ల గదులు ఉరిశిక్ష పడ్డ భగతసింగ్ మొదలైనవారి గదులకు దగ్గర్లోనే ఉన్నాయి. ఎప్పుడైనా ఒకరికి ఒకరు ఎదురు పడడమూ కద్దు. మాట్లాడుకోవడమూ జరుగుతూ ఉండేది. తమ గదుల్లోంచి కూడా కేక వేసి పలకరించు కోవచ్చును. కాపలావాళ్లు, వార్డర్లూ వార్తల్ని,

తినుబండారాల్ని ఒకరినుంచి మరొకరికి చేరవేస్తూ ఉండేవారు. ఈ మిత్రుల కథనం ప్రకారం భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు – చివరి క్షణం వరకు ఆరోగ్యకరమైన మానసిక స్థితిలోనే ఉన్నారని తెలుస్తుంది. తమ ఆదర్శం కోసం బలౌతున్నందుకు వాళ్లు ఎంతో తృప్తిగా ఉన్నారు. అప్పట్లో ఒకే ఒక విషయం భగత్‌సింగ్ మనస్సును బాధించింది. అది ఏమిటంటే, అతడి తండ్రి సర్దార్ కిషన్‌సింగ్ పుత్రప్రాణభిక్ష కోసం గవర్నర్‌కు ప్రార్థనాపత్రం పంపుకున్నాడు. గవర్నర్ ఆ ప్రార్థనను ఎటూ అంగీకరించలేదు. కాగా, తండ్రి అలా చేసినందుకు భగత్‌సింగ్ ఎంతో అవమానాన్ని పొందాడు. తండ్రి పెట్టుకున్న ప్రార్థనాపత్రాన్ని గురించి విని ఖిన్న స్వరంలో భగత్‌సింగ్ ఇలా అన్నాడు. "మై ఫాదర్ హాజ్ స్టాబ్‌డ్ మి ఇన్ ది బాక్" (తండ్రే నన్ను వెన్నుపోటు పొడిచాడు).

1931 మార్చ్ 24న మిత్రుల్ని ఉరితీయడానికి నిశ్చయింపబడ్డది. ఆ సమయంలో ప్రజలు ప్రదర్శనలు జరపవచ్చు. ప్రజలు శవాన్ని తీసుకుని ఊరేగింపు జరపవచ్చు. ఇవన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకతను తెచ్చిపెట్టే చర్యలవుతాయి. కనుక గవర్నర్ ప్రత్యేక అనుమతితో, ఉరిశిక్షల్ని అనుకున్న సమయానికి ముందే అమలు జరపడం ఉచితం అనుకున్నారు జైలు అధికారులు.

మార్చ్ 23న రెండవ లాహోరు కుట్రకేసులోని నిందితుల్ని మధ్యాహ్నానంతరం కోర్టునుండి జైలుకు తీసుకువచ్చారు. మూడు నాలుగు గంటల సమయంలో జైల్లోని ఖైదీలందర్నీ వారి వారి గదుల్లోకి పంపించి తలుపులు వేసేశారు. జైలంతా శుభ్రం చేస్తున్నారు. భగత్‌సింగ్ గది ధర్మపాల్ గదికి చాలా దగ్గర్లో ఉంది. భగత్‌సింగ్ ధర్మపాల్‌ని కేక వేసి పిలిచి అడిగాడు. "ధర్మా! ఇవ్వాళ కోర్టునుంచి మీరింత తొందరగా వచ్చారేం?"

"జైళ్ల ఇనస్పెక్టరు, కమీషనరు – జైలును చూడడానికి వస్తున్నారని అంటున్నారు!" అన్నాడు ధర్మపాల్.

"పిచ్చోడా! చూట్టానికి వాళ్లు రావడంకాదు. మేం వెళ్తున్నాం" అన్నాడు భగత్‌సింగ్.

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు – వీరి ముగ్గురికీ అప్పుడే స్నానానికి నీళ్లు ఇచ్చారు. మరణశిక్షను పొందే వ్యక్తిని, ఉరితీయడానికి తీసుకు వెళ్లేముందు స్నానం చేయించడం ఆచారం. భగత్‌సింగ్‌కు జైలు అధికార్లలోనే ఎవరో ముందుగా ఈ విషయాన్ని చెప్పారు. జైప్రకాష్ మొదలైన రెండవ లాహోరు కుట్రకేసు నిందితులు భగత్‌సింగ్ వస్తువుల్ని జ్ఞాపకార్థం అడిగారు. ఉరి తీయడానికి ఒక గంటముందు అతడు తన వస్తువులన్నింటినీ – రేజరు, బ్లేడ్లు, గుండీలు, ఖాళీ అగ్గిపెట్టె – అన్నింటినీ మిత్రులకు పంచేశాడు. పై అధికారులకు అనుమానం కలగకుండా ఉండడానికి తనకేమీ తెలియనట్టు మౌనంగా ఉన్నాడు.

సుఖదేవ్ గదిలోంచి 'ఇంక్విలాబ్ జిందాబాద్' అన్న దీర్ఘ నినాదం వినిపించింది. తరువాత అతడి గదిలోంచి ఘర్షణ పడుతున్న సవ్వడి వినిపించింది. సుఖదేవ్ చేతులకు బేడీలు వేయబోతున్నారనీ, అతడు వ్యతిరేకిస్తున్నాడనీ తెలిసింది. ఉరికంబం దగ్గరకు తీసుకువెళ్లేప్పుడు ఖైదీల చేతుల్ని వెనక్కు విరిచికట్టడం ఆచారం. సుఖదేవ్ అందుకు అంగీకరించడం లేదు. ముసలి జైలు వార్డర్ చతర్‌సింగ్, భగత్‌సింగ్‌ను ప్రార్థించాడు. 'మా మీద దయ చూపండి. బేడీలు వేయమని ఆర్డర్ అయింది. అలా వేయడం ఆచారం. వేయించుకోండి' అన్నాడు. భగత్‌సింగ్ చెప్పిన మీదట సుఖదేవ్, రాజగురు బేడీలు వేయించుకున్నారు. తరువాత జైలులోని ఇతర మిత్రుల్ని ఉద్దేశించి 'సరే, మిత్రులారా వెళ్తున్నాం' అన్నాడు భగత్‌సింగ్.

ఇతర మిత్రులు తమ గదుల్లోంచి 'ఇంక్విలాబ్ జిందాబాద్!' అని నినాదాలు చేశారు. వీరిని అనుకరించి జైలులోని ఖైదీలందరూ 'ఇంక్విలాబ్ జిందాబాద్!' అని నినాదాలు చేశారు. ఈ నినాదాలు జైలుకు పక్కన్నే ఉన్న పండిత్ కె. సంతానం గారి బంగళాలోకి వినిపిస్తున్నాయి. ఆయనగారు ఈ నినాదాలకు కారణాన్ని ఊహించి, సర్దార్ కిషన్‌సింగ్‌కు ఫోన్ చేశాడు. జైల్లోని ఖైదీలందరూ ఉరికొయ్య పడే శబ్దాన్ని వినడానికి శ్వాస బిగబట్టుకు వింటున్నారు. ధర్మపాల్ గడియారం ప్రకారం 7 గంటల 23 నిమిషాలకు ఉరికొయ్య పడ్డ శబ్దం వినిపించింది. జైలంతా ఒక్కమాటుగా 'ఇంక్విలాబ్ జిందాబాద్!', 'భగత్‌సింగ్ జిందాబాద్!', 'సుఖదేవ్ జిందాబాద్!', 'రాజగురు జిందాబాద్!' అన్న నినాదాల్తో ప్రతిధ్వనించిపోయింది. ఈ నినాదాల ప్రతిధ్వని కారణంగా అరగంటవరకూ మా మిత్రులు ఎవరూ ఒకరితో ఇంకొకరు మాట్లాడుకోలేకపోయారు. జైలు అధికారులు మా మిత్రులకు చెప్పిన వార్తల్ని బట్టి, భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు – ఉరికొయ్య దగ్గరకు వెళ్లాక, సూపరింటెండెంట్‌ను 'మేము తృప్తిగా నినాదాలు ఇచ్చుకోవడానికి రెండు క్షణాలు అవకాశం ఇవ్వండి ! మా ఈ చిన్న కోర్కెను మీరు అంగీకరిస్తారని ఆశిస్తున్నాం!' అని అడిగారుట. సూపరింటెండెంట్ రెండు క్షణాలు మౌనంగా నిలబడ్డాడు.

ముగ్గురు మిత్రులూ ఒకేసారి నినాదాల్నిచ్చారు.

లాంగ్ లివ్ రెవల్యూషన్– విప్లవం వర్థిల్లాలి!

డౌన్ విత్ ఇంపీరియలిజం – సామ్రాజ్యవాదం నశించాలి!

ఆనాడు జైల్లో ఖైదీలెవరూ అన్నాలు తినలేదు. కొందరు భారతీయులైన జైలు అధికారులు కూడా ఆ రోజున అన్నం తినలేదు. జైలు ఇనస్పెక్టర్ మహమ్మద్ అక్బర్ ఖాన్‌సాహెబ్, రెండు రోజుల తరువాత సర్దార్ కిషన్‌సింగ్‌ను కల్సుకున్నప్పుడు ఇలా అన్నాడట : 'ఉద్యోగం అనే దాస్యం చేస్తున్నాం గనక ప్రభుత్వ ఆజ్ఞల్ని పాటించక తప్పదు. కానీ, మనస్సు చాలా బాధపడ్డది. అన్నం ముందు కూచుంటే పురుగుల్ని చూసినట్టయింది. వెధవపొట్ట, ఈ పొట్టకోసం కదా, ఇలాంటి దాస్యానికి పాల్పడవల్సివచ్చింది!'

ప్రభుత్వం విప్లవకారుల శవాలకు ఉచితరీతిన దహన సంస్కారాలు జరుపుతుందన్న నమ్మకం ప్రజలకు లేదు. శవాలను అగౌరవ పరచవచ్చని ప్రజలు భయపడ్డారు. లాహోరు నుంచి బయటకు వెళ్లే ప్రతి రోడ్డుమీదా కొందరు మిత్రులు కాపలా కాస్తూ కూర్చున్నారు. ఫిరోజ్‌పూర్ వెళ్లే రోడ్డున భగత్‌సింగ్ సోదరి అమర్‌కౌర్ మిత్రుల్తో కూర్చుంది. అర్థరాత్రి తరువాత పోలీస్ వ్యాన్ ఒకటి ఫిరోజ్‌పూర్ వైపు వెళ్లింది. శవాలను సట్లజ్ తీరానికి తీసుకువెళ్తున్నారని అనుకున్నారు. సూర్యోదయంతో పాటు లాహోరుకు అరవై మైళ్ల దూరంలోగల సట్లజ్ నదీ తీరానికి ప్రజలు గుంపులు గుంపులుగా పోసాగారు. అక్కడే నది మీద రైలు వంతెన ఒకటుంది. తెల్లవారాక ఆ పరిసరంలో మూడు చితులు మండుతూ కనిపించాయి. పోలీసులు వెళ్లిపోయారు. శ్రద్ధాళువులైన ప్రజలు అస్థికలనూ, భస్మాన్నీ

తీసుకువెళ్లారు. 1947 మార్చి వరకూ ప్రతి సంవత్సరం మార్చ్ 23న అక్కడ పెద్ద తిరునాళ్ల జరిగేది. ఇప్పుడా ప్రదేశం పాకిస్తాన్‌లోకి పోయింది.

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు – వీళ్లతోపాటు మరో వ్యక్తికి కూడా ఉరిశిక్ష విధించారు. అతడు కేహారిసింగ్. అతడు తన బావనూ, ఊరి మునసబునూ హత్య చేశాడు. ఆ కేసు నడుస్తున్నది. అందరితోటీ ఇలా అనేవాడు. 'నేను ఇంకొకణ్ని చంపాలి! వాణ్ని చంపి వచ్చి ఉరికంబం ఎక్కుతాను!' కేహారిసింగ్ విడుదల అయ్యాడు. అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్ని చంపి, మళ్లీ జైలుకు వచ్చాడు. ఈ మాటు అతడు హైకోర్టుకు అపీల్ చేసుకోలేదు. ఐతే, అతడి పినతల్లి అపీల్ చేసుకుంది. ఈ సారీ శవం దొరకలేదు. ఈసారీ విడుదల అవటానికి అవకాశం ఉంది. అతడు జైలు సూపరింటెండెంట్‌కు 'తను కొన్ని హత్యలకు సంబంధించిన వివరాల్ని పోలీసులకీయాలనుకుంటున్నానని' దరఖాస్తు పెట్టుకున్నాడు. అతడి చేతులకు బేడీలు వేసి, గట్టి బందోబస్తుతో జైలు నుండి బయటకు తీసుకువెళ్లారు. తను హత్యచేసిన ముగ్గురి శవాలను చూపించాడు. కోర్టులో నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు మళ్లీ ఉరిశిక్ష పడ్డ ఖైదీలను ఉంచే ఖైదు కొట్లల్లోకి వచ్చాడు. అతడు సిఫిలిస్, గనేరియాలాంటి భయంకరమైన సుఖవ్యాధుల్తో బాధపడుతుండేవాడు. ఎప్పుడూ బూతుపాటల్ని పెద్దగా పాడుతుండేవాడు. ఎప్పుడు ఉరికంబాన్నెక్కి శాంతిని పొందుదామా అని తహతహలాడుతున్నట్టు అశాంతిగా ఉండేవాడు. ఒకరోజున భగత్‌సింగ్, ఇతర మిత్రులూ అతడితో అన్నారు. 'నువ్వు ఇంతటి వీరుడివి కదా, ఇలాంటి బూతుపాటలు పాడడం నీకేం శోభస్కరంగా ఉంటుంది?'

కేహారిసింగ్ 'ఐతే, ఇంకేం పాడమంటారు? సమయం గడపడానికి ఏదో ఒకటి పాడుకోవాలి కదా?' అన్నాడు.

మిత్రులిలా అన్నారు 'మిత్రమా! నీకు ఇంకేమీ రాకపోతే, భగవంతుణ్ణయినా తలచుకో, ఇలాంటి బూతు పాటలు మాత్రం పాడకు!'

కేహారిసింగ్‌కు వీళ్లమాటంటే గురి. 'సరే బాబూ! ఇక మీదట నేనీ పాటను పాడుకుంటాను – 'మౌలా మై కుక్కడ్ ఖాదే తేరే, బక్షదే ఔగున్ మేరే!' ఓ యజమానీ, నేను నీ కోళ్లను తిన్నాను. నీవు నా అపరాధాల్ని క్షమించు!' అని అన్నాడు.

ఉరికంబం వైపు వెళ్లేప్పుడు కూడా అతడు ఇదే పాట పాడుకుంటూ వెళ్లాడు.

భగతసింగ్, సుఖదేవ్, రాజగురు – ఈ ముగ్గురు అమర వీరుల్లో ఎవరు గొప్ప? ఎవరు కొద్ది? అన్న విచక్షణ తగదనే అనుకుంటున్నాను. కానీ, నిజం చెప్పుకోవాలంటే సుఖదేవ్‌కు చాలా అన్యాయం జరిగింది. అతడి భావనను ఎవరూ అర్థం చేసుకోలేదు. అతడి దృష్టికోణానికీ, ఇతర మిత్రుల దృష్టికోణానికి వ్యత్యాసం ఉండడం వల్ల అతడి ప్రవర్తన ఇతరులకు విచిత్రం అనిపించింది. మొట్టమొదట అరెస్టు కాగానే తను చేసిన కొన్ని పనులను ఒప్పేసుకున్నాడు. అప్పుడే ఇతర మిత్రుల ప్రవర్తనకూ, అతడి ప్రవర్తనకూ వ్యత్యాసం కనిపించింది. ఆ తరువాత కూడా అతడి ప్రవర్తననే చూశారు. కానీ, అతడి ఉద్దేశాన్ని ఎవరూ అర్థం చేసుకోలేదు. చిట్టచివరి వరకూ అతడి ప్రవర్తనను పరిశీలిస్తే గానీ, అతడిని అర్థం చేసుకోలేం. అతడి చివరి రోజు ప్రవర్తన వల్ల సాహసంలో అతడు ఎవరికీ తీసిపోడనీ, ఇతర మిత్రులకంటే సాహసికుడనీ స్పష్టం అవుతున్నది. శత్రువు నుండి ఎలాంటి సౌజన్యాన్ని ఆశించడం గానీ, శత్రువు పట్ల సౌజన్యాన్ని ప్రదర్శించడం గానీ అతడికి ఇష్టం ఉండదు. కోర్టులో నడిచిన కేసు పట్ల కూడా అతడి దృష్టికోణం ఇదే. ఇతర మిత్రులు 'కోర్టులో తప్పించుకోగలిగితే తప్పించుకుందాం' అంటారు. కానీ సుఖదేవ్‌కు అసలు కోర్టుకు వెళ్లడమే ఇష్టం లేదు. అతడిలా అంటాడు 'నువ్వు నా శత్రువ్వు! నీతో నేను పోరాడుతున్నాను! నువ్వు చేసేదేమిటో చేసుకో' ఈ భావనతోనే అతడు ముందుగా తన తప్పుల్ని ఒప్పుకున్నాడు. అతడి దృష్టికోణంలో లోపం ఉండవచ్చు. కానీ, పిరికితనం, ప్రాణరక్షణార్థం పాకులాడే తత్వం అతడిలో లేదు. ♦

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. ఆ సహజ మరణపు వయోపరిమితి దేశ కాల పరిస్థితులను బట్టి, జీవన ప్రమాణాలను బట్టి అరవైల నుంచి తొంబైల దాకా ఉండవచ్చు. కాని మన సమాజంలో సాధారణ ఆయు ప్రమాణం 63 సంవత్సరాలు అయినప్పటికీ ఎంతోమంది పుట్టుకలోనే మరణిస్తున్నారు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ మరణం అనేక రూపాలలో సంభవిస్తోంది. ఆకలి, అనారోగ్యం, మానసిక ఆందోళనలు, సామాజిక అసమానతలు, వరకట్న మరణాలు, నిర్లక్ష్యం, అంటరాని తనం, వ్యవసాయం, చేనేత వంటి రంగాల్లోని సంక్షోభాలు, పారిశ్రామిక అశాంతి, జీవనోపాధి లేమి అసహజ మరణాలకు లెక్కలేనన్ని కారణాలున్నాయి. మన పక్కనె మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైనపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే, ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

తేది	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
26.2.07 నుండి 4.3.07	16	–	15	–	–	–	7	2	–	3*	19	19	2	3	1	–	4	–
5.3.07 నుండి 11.3.07	8	–	16	–	–	–	12	7	–	2*	18	19	–	–	–	–	11	–
12.3.07 నుండి 18.3.07	11	–	22	1	–	–	18	8	–	5*	19	11	–	–	–	–	16	–
19.3.07 నుండి 25.3.07	15	–	21	1	–	–	6	4	–	2*	26	11	–	–	–	1	8	–
మహబూబ్‌నగర్ రవికుమార్	3	1	29	–	–	–	14	14	1	4*	30	29	6	1	–	–	–	–
మెదక్ కె. రాజు	16	–	–	–	–	–	–	–	2	6*	–	2	1	1	–	–	–	–
కడప ఎస్.ఎస్.ఖలంధర్	10	–	8	–	–	–	1	2	–	3*	14	–	–	–	–	2	–	–
మొత్తం	**79**	**1**	**111**	**2**	**–**	**–**	**58**	**37**	**3**	**25**	**126**	**91**	**9**	**5**	**1**	**3**	**39**	**–**

*** రాత్రి కరెంట్ వలన 21 మంది రైతులు చేనుకు నీళ్లు కట్టడానికి వెళ్లి చనిపోయారు.**

గమనిక : మీ అందరి సహకారంతో అన్ని జిల్లాల పూర్తి సమాచారంతో భవిష్యత్తులో ఈ శీర్షికను మరింత సమగ్రంగా అందించే ప్రయత్నం చేస్తాం.

RNI Regn. No. APTEL/2003/11482 Published on 27-03-07 PRINTED BOOK

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 66843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Working Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayatnagar, Hyd-29.